

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Rajahmundry, Srikakulam

28-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 266 పేజీలు: 10+4 వెల: 6.50


వాణిజ్య ఒప్పందం దిశగా భారత్, అమెరికా చర్చలు 5లో

బంగ్లా మ్యాప్‌లో భారత్ భూభాగాలు

# భయపడకండి



సోమవారం ఆర్టీజీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

- తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్నా ప్రజలను ఆస్తి, ప్రాణనష్టం నుండి రక్షిస్తాం: సిఎం చంద్రబాబు
- ప్రతి గంటకు తుఫాన్ ప్రత్యేక బులెటిన్
- పరిస్థితిపై సిఎంతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని
- పునరావాస కేంద్రాల్లో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు
- పిఎంఒతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సిఎం

## విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు: సిఎం

**విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాన్ ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ప్రతీ గంటకూ తుపాన్ బులిటెన్లు విడుదల చేస్తూ, అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుపాన్ కారణంగా నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎక్కడా సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని, మొబైల్ టవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుపాన్ ప్రభావం ఎక్కువ ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జెనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎక్కడా కమ్యూనికేషన్ వ్యవస్థకు అవాంతరాలు తలెత్తకూడదన్నారు. తుఫాన్ వల్ల ఎవరూ ప్రమాదాల బారిన పడకూడదని, ఒక్క మరణం సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి 25 కేజీల బియ్యంతో సహా నిత్యావసరాలు అందించాలన్నారు. కరువును ఎదుర్కొనేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామో, తుఫాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినచర్యలను ప్రధానికి వివరించగా, >>2



సోమవారం తుఫాన్ ప్రభావంతో కాకినాడ సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు



చిత్తూరు జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

## శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా

# రెడ్ అలర్ట్

రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

- మొంథా తుఫాన్ అల్లకల్లోలం
- మచిలీపట్నం, కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరందాటే అవకాశం
- గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడింది. ఇది మొంథా తుపానుగా మారినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది బంగాళాఖాతంలో నైరుతిఆగ్నేయ మధ్య కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. గడిచిన 10 గంటల్లో గంటకు 16 కిలోమీటర్ల వేగంతో తుఫాను ముందుకు కదులుతూ వస్తోంది.మంగళవారం >>2



## తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

సిఫారసు చేసిన జస్టిస్ గవాయ్ 2లో

## 97 రైలు సర్వీసులు రద్దు

విజయవాడ డిఆర్ఎం మెహిత్ సోనాకియా 2లో

తుఫాన్ కారణంగా నిలిచిన పలు విమాన సర్వీసులు



సోమవారం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌చే ఎపి హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

## హైకోర్టు జడ్జిగా జస్టిస్ మానవేంద్ర నాథ్ ప్రమాణం

చేయించిన సిజెఐ 2లో

## 7 లక్షల రేషన్ కార్డు కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

మంత్రి నాదెండ్ల



**ఏలూరు, అక్టోబరు 27:ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో సోమవారంరాష్ట్రంలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహార్ పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొంథా తుఫాను >>2





## నేటి నుంచి 12 రాష్ట్రాలు యుటిల్లో 'సర్'

సిఇసి జ్ఞానేష్‌కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎస్ఐఆర్ నిర్వహించడంపై తీవ్ర దుమారం రేపుతున్న వేళ దేశవ్యాప్తంగా రెండో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ రెండో దశను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటర్ లిస్ట్ >>2





## పరకామణి కేసుపై సిఐడి దర్యాప్తు

### హైకోర్టు ఆదేశం

- నిందితుడు రవికుమార్ ఆస్తులపై సమగ్ర దర్యాప్తునకు ఎసిబి డిజికి ఆదేశం
- లోక్అదాలత్ న్యాయమూర్తినీ వదలని కోర్టు
- గత టిటిడి ఛైర్మన్, అధికారులపైనా విచారణ జరపాలన్న జడ్జి

**తిరుమల, అక్టోబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** మూడుసంవత్సరాల క్రిందట తిరుమల పరకామణిలో విదేశాకరెన్సీ చోరీజరిగిన కేసులో జరిగిన పరిణామలన్నిటిపై పూర్తిస్థాయిలో సమగ్రదర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం సిఐడిని ఆదేశించింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి ఆ తరువాత చోటుచేసుకున్న అంశాలపై ,లోక్అదాలత్‌లో రాజీచేసుకోవడం వరకు అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి డిసెంబర్ 2వతేదీకి గడువు విధించింది. అలాగే పరకామణిలో గుమస్తా అయిన సివి రవికుమార్ నిందితుడు ఆస్తులపై దర్యాప్తుకు అవినీతినిరోధకశాఖ(ఎసిబి)డిజికి ఆదేశాలిచ్చింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపై కూడా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడం సంచలనంగా మారింది. అత్యవసరంగా సిబిసిఐడితో విచారణకు ఆదేశించడంతో పరకామణి చోరీ వ్యవహారంలో 'పెద్ద'లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారికి, అధికారులకు చెమటలు పడుతున్నాయి. ఎటుపోయి ఈ కేసు విచారణ ఎక్కడకు దారితీస్తుందనే భయం గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. 2023లో పరకామణి చోరీ కేసులో తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసినా, ఆ తరువాత విచారణ చేయకుండా అడ్డుకున్న దెవరు?వారిపై ఎవరి ఒత్తిడి పనిచేసింది, లోక్అదాలత్‌తో రాజీకి ప్రోత్సహించిన అధికారులు, గతబోర్డు పెద్దలెవరనేది ఇప్పుడు సిఐడి చేపట్టే విచారణలో వెలుగుచూడనున్న కీలక అంశాలు. తిరుమల తిరుపతిదేవస్థానం చరిత్రలోనే ఇలాంటి చోరీ కేసు నమోదుకాలేదు. ఆపైగా చోరీచేసిన గుమస్తా టిటిడి ఉద్యోగి కూడా కాకపోవడం మరో కొసమెరుపు. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి కోట్లాదిమంది భక్తులు విశ్వాసంతో మొక్కుబడులుగా హుండీకి కానుకలు సమర్పిస్తారు. ఆ కానుకలను లెక్కించే పరకామణి భవనంలో అనధికార వ్యక్తికి ఎంతో బాధ్యత ఉన్న పరకామణిలో గుమస్తాగా నియమించి విధులు నిర్వర్తింపచేయడం కూడా పెద్ద తప్పిదంగానే తెలుస్తోంది. ఏకంగా ఆయన దేవునిసొమ్ము అనే పాపభీతి,భయం లేకుండా,నిర్భయంగా ఏకంగా 920 అమెరికల్ డాలర్లు చోరీ చేయడం,ఆపై 72వేల రూపాయలు విలువ మాత్రమేనని అప్పటి టిటిడి బోర్డుపెద్దలు, ఓ ఉన్నతాధికారి, పోలీసు అధికారులు కలసి సులభంగా కొట్టిపారేయడం ఇప్పుడు సంచలనం రేకెత్తిస్తోంది. తప్పుచేసిన >>2

## అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

**విజయవాడ, అక్టోబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువును ఎపి ప్రభుత్వం పొడిగించింది. మరో మూడు నెలలపాటు గడువు పొడిగిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. వాస్తవానికి అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ గడువు ఈ నెల 23తో ముగిసింది. అయితే గడువు పెంచాలంటూ ప్రభుత్వంపై పలు ఆవాశిత ప్రాంతాల వారు, ఇతరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో జనవరి 23 వరకూ లే అవుట్లు, ప్లాట్‌లు రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ దిశలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక గడువును పెంచే అవకాశం లేదని ప్రభుత్వం వెల్లడించింది. ఈ >>2

# సహాయ శిబిరాలు సిద్ధం

- తుఫాన్ బాధితులకు 24 గంటలూ అత్యవసర సేవలు
- క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేష్ ఆదేశం



సోమవారం తుఫాన్ తాజా పరిస్థితులను మంత్రి నారా లోకేష్‌కు వివరిస్తున్న సీఎస్ విజయానంద్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు కీలక ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా తుపాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తుఫాను సహయక చర్యల పర్యవేక్షణ బాధ్యతను మంత్రి నారా లోకేష్‌కు సీఎం చంద్రబాబు అప్పగించారు.కేంద్రంతోను, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతోను సమన్వయం చేసుకుంటూ తుఫాను ప్రభావిత ప్రాంతాల వారికి సహాయకచర్యలు అందించాలని ఆదేశించారరు.ఈ క్రమంలో నారా లోకేష్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, హోంమంత్రి అనితలతో కలిసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు., ఈ సందర్భంలో లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాచారం ప్రకారం తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ సమష్టిగా పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అవసరమైతే సహాయక చర్యలలో కూటమి పార్టీల కార్యకర్తలు కూడా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. తుపాను ప్రభావిత తీరప్రాంతాలు, లంక గ్రామాల్లోని ప్రజల కోసం తక్షణమే సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని >>2



## పునరావాస కేంద్రాల్లోని ప్రజల ఇళ్లకు పూర్తి భద్రత

### గర్భిణులు, బాలింతలు, వృద్ధులను సురక్షిత ప్రదేశాలకు తరలించి వైద్యసేవలందించాలి: డిసిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమాచారం కోసం అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం, ముందస్తు సహాయక చర్యలపై జిల్లా ఇంఛార్జి మంత్రి పి. నారాయణ, స్పెషల్ ఆఫీసర్ శ్రీ కృష్ణ తేజ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాలపై ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికల ద్వారా తెలుస్తోంది. ముందుగా తీర ప్రాంత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లావ్యాప్తంగా గర్భిణి స్త్రీలు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. **కాకినాడ జిల్లాకు రూ. కోటి అత్యవసర నిధి:** తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అత్యవసర సాయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్ల విడుదల చేసింది. అందులో కాకినాడ జిల్లాకు కోటి రూపాయిలు కేటాయించారు. ప్రజలకు నిత్యవసర సరుకుల పంపిణీ, ఇళ్లు కూలడం, దెబ్బ తినడం వంటి సంఘటనలు జరిగితే తక్షణ సాయం చేయాలన్నారు,



సోమవారం ముంబయిలో 'మారిటైమ్ వీక్' కార్యక్రమంలో పాల్గొని శివాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్ షా

## శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా రెడ్ అలర్ట్

>> ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తుపాను అల్లకల్లోలం సృష్టిస్తోంది. సముద్ర తీరాల నుంచి గమనిస్తూ అలలు ఎగిసిపడుతున్నాయి. గడిచిన 6 గంటల్లో గంటకు 16 కి.మీ. వేగంతో కదిలిన మొంథా తుపాను విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 650 కి.మీ. దూరంలోను చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 590 కి.మీ. దూరంలో మొంథా తుపాను కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయవ్యంగా కదిలి 12 గంటల్లో తీవ్ర తుపానుగా మారే అవకాశం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. రేపు సాయంత్రం లేదా రేపు రాత్రికి తీవ్రతుపానుగా తీరం దాటే అవకాశం. మచిలీపట్నంకళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు, కాకినాడ పరిసర సముద్రంలో మీటరు ఎత్తున ఎగిసిపడనున్న సముద్ర అలలు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షం, ఒకటిరెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు. ఇవాళ శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లాల వరకు రెడ్ అలర్ట్ జారీ, రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ. మత్స్యకారులు ఐదు రోజులపాటు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

**అన్ని పోర్టుల్లో ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ:** చేశారు. ఇప్పటికే అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 710 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు ఆగ్నేయంగా 680 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 600 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. తీరం వెంట 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. మొంథా తుపాను ప్రభావంతో ఏపీ లోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో చిరు జల్లులు కురుస్తున్నాయి. కాకినాడలో ఈ ఉదయం చిరు జల్లులు పడగా, ఉదయం 10 గంటల సమయం తర్వాత వర్షం తీవ్రత పెరిగింది.

**రాయలసీమ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ:** నేడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లాల వరకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మత్స్యకారులు ఐదు రోజుల పాటు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను అధికారులు జారీ చేశారు. మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒకటిరెండు చోట్ల అత్యంత భారీ వర్ష సూచనలు ఉన్నట్లు చెప్పారు. తీర ప్రాంతాల్లో ఉండే ప్రజలు కోసం అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మచిలీపట్నం కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో మంగళవారం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. విజయవాడ కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుపాను ప్రభావంతో, అన్ని శాఖల సమన్వయంపై కలెక్టర్ చర్చించారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావం తగ్గే వరకు వరి, పత్తి కోతలు చేయొద్దని కలెక్టర్ విజ్ఞప్తిచేశారు.

**ప్రభుత్వ సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు నిధులు విడుదల:** 'మొంథా' తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను ప్రభావ దృష్ట్యా అధికారులకు సెలవులు రద్దు చేశారు. ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల చేసింది. ఎస్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఎంఏ సిబ్బందులు, 16 శాటిలైట్ ఫోన్లు ఏర్పాటు చేశారు. 57 తీర ప్రాంత మండలాల పరిధిలో 219 తుపాను షెల్టర్లు ఏర్పాటు చేశారు. సముద్రంలోని 62 మెకనైజ్డ్ బోట్లను ఒడ్డుకు రప్పిస్తున్నారు. సముద్ర తీరాల్లో పర్యాటకుల రాకపోకలపై నిషేధం విధించారు.

**విద్యాసంస్థలకు కొనసాగుతున్న సెలవులు:** అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో విద్యా సంస్థలకు ఎల్లుండి వరకు సెలవులు ప్రకటించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, కడపలో విద్యా సంస్థలకు రేపటి వరకు సెలవులు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలోని విద్యా సంస్థలకు కలెక్టర్ హిమాన్షు శుక్లా నేడు మంగళవారంసెలవు ప్రకటించారు. తుపాను దృష్ట్యా జిల్లాల్లో విపత్తు బృందాలు మోహరించారు. సహాయక చర్యల కోసం 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచారు. తుపాను దృష్ట్యా జిల్లాలకు టీఆర్27 కింద నిధులు మంజూరు చేశారు. వీటితో సహాయ శిబిరాలు, తాగునీరు, ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని ముక్కాం తీరప్రాంత గ్రామంలో జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మొంథా తుపాను వేళ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొంథా తుపాను వేళ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మవద్దు. ప్రజలందరూ భయపడకుండా ప్రశాంతంగా ఉండాలి. అత్యవసర కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండాలి. వాతావరణ హెచ్చరికల కోసం టీవీలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ఛాఫ్ చేయాలి. అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు, గ్యాస్ కనెక్షన్లను తీసి వేయాలి. తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. మీ భద్రత, మనుగడ కోసం అవసరమైన వస్తువులతో అత్యవసర వస్తు సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలి. మీ పత్రాలు, సర్టిఫికెట్లు, విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలి. మీ ఇళ్లు సురక్షితం కాకపోతే తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయానికి చేరుకోవాలి. పాత భవనాలు, చెట్లు, విద్యుత్తు తీగలు, స్తంభాల కింద ఎప్పుడూ ఉండకూడదు. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వాటిని వదిలేయాలి. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది. కడప కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

## నిత్యావసరాలు పంపిణీ

>> ప్రభావిత 12 జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో పౌర సరఫరాలు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి మొత్తం 12 జిల్లాలో యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఈ జిల్లాల్లో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7 లక్షలు కార్డు దారులు కుటుంబాలకు నిత్యవసర సరుకులు సబ్సిడీ రూపంలో రేపు ఉదయం 9:00 గంటలు నుండి అందిస్తున్నామని అన్నారు. మొంథా తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు జిల్లాలో టార్పాలిన్లు రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని రైతులు వాడుకోవచ్చునని తెలిపారు. ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 626 వివిధ కంపెనీల బంకులలో 35,443 లీటర్లు డీజిల్ ఆయిల్, పెట్రోల్ అదనంగా నిల్వలను అందుబాటులో ఉంచి, కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న 1,500 మిల్లులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు నుంచి తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి ధాన్యం వ్యవసాయ అధికారుల సహకారంతో పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత ఏడాది మాదిరిగానే టార్పాలిన్లు, తాళ్లు, ఇసుక సంచులు, ప్లాస్టిక్ షీట్లు అందుబాటులో ఉంచామని అవసరాన్ని బట్టి వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమాచార వ్యవస్థలో ఏటువంటి అంతరాయం లేకుండా చూడాలని, సెల్ టవర్స్ దగ్గర ఏర్పాటు చేసిన జనరేటర్లుకు సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా డీజిల్ ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, సమాచార వ్యవస్థ బాగుండేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

# భయపడకండి

>> కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు, నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో అత్యవసర వైద్యసేవలు అందించే సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భవిష్యత్తులో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనే విధంగా ఈ కార్యచరణ ఒక రోల్‌మోడల్‌గా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు.

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో అతిభారీ వర్షాలకు అవకాశం:** ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ. దూరంలో ఉన్న మొంథా తుపాన్, 16 కి.మీ వేగంతో తీరానికి చేరువ అవుతోందని ఈ సమావేశంలో అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. దీని ప్రభావంతో ఇప్పటికే ఉత్తర, దక్షిణ కోస్తాలో వర్షాలు కురు స్తున్నాయని, మంగళవారం కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించినట్టు వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. మంగళ వారం రాత్రికి తుపాన్ తీరానికి చేరే అవకాశం ఉందన్నారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ దళాలు అందుబాటులో ఉండాలని, ఫైర్ సర్వీసెస్ కూడా అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టీమ్, రహదారులు భవనాల శాఖ, విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. రహదారులు కోతకు గురైనా, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడినా వెంటనే పునరుద్ధరించేలా మెటీరియల్, మిషనరీ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తుపాను అనంతరం అంటువ్యాధులు సోకకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తుపాను సమయంలో గర్భిణిలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి వైద్య సౌకర్యాలు కొనసాగేలా చూడాలన్నారు. యాంటీ స్నేక్ వెనోమ్, యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు పంటనష్టం సంభవించకుండా టార్పాలిన్లు విరివిగా ఉంచాలని, పశుసంపద నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో 851 జేసీబీలు, 757 పవర్ సాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంచారనేది మ్యాపింగ్ చేయాలని, తుపాన్ అనంతరం వీటన్నింటి వినియోగంపైనా ఆడిటింగ్ చేస్తామని సీఎం చెప్పారు. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్టం చేయాలని నిర్దేశించారు.

**విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు:** "తుపాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేశాలు పంపించి అవగాహన పెంచాలి. తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుపాన్లపై అనుభవాన్ని ఇందుకు వినియోగించాలి. అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు ఎలా నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయండి. రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. బలమైనగాలులకు కూలిపోయే అవకాశం ఉన్న చెట్లకొమ్మలను ముందుగానే తొలిగించాలి" అని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తుపాన్ రక్షణ విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 97 రైలు సర్వీసులు రద్దు

### విజయవాడ డిఆర్ఎం మోహిత్ సోనాకియా

### తుఫాను ప్రభావంతో అప్రమత్తమైన రైల్వేశాఖ

**విజయవాడ.అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మొంథా తుపాను కమ్ముకొస్తున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. తుపాను ప్రభావం ఉండనున్న ప్రాంతాల్లో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పర్యటించారు. ప్రభావిత ప్రాంతాల్లో హై ఎలర్ట్ ప్రకటించారు. అనంతరం విజయవాడలో డివిజన్ అధికారులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. తీసుకున్న చర్యలను జీఎంకు విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా వివరించారు.

**రద్దయిన రైలు సర్వీసుల వివరాలు :** విజయవాడ డివిజన్ మీదుగా నడిచే 54 రైళ్లను దక్షిణమధ్య రైల్వే రద్దు చేసింది. రేపు (మంగళవారం), ఎల్లుండి (బుధవారం) బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి. రాజమండ్రి, నిడదవోలు, గుంటూరు, కాకినాడ నుంచి బయలుదేరేవి, తెనాలి, మార్కాపురం, మచిలీపట్నం, నర్సాపురం నుంచి బయలుదేరేవి, విశాఖ, ఒంగోలు, భీమవరం, మాచర్ల నుంచి బయలుదేరే రైళ్లు రద్దు చేశారు. రైళ్ల గురించిన సమాచారాన్ని ప్రయాణికుల మొబైల్‌కు సందేశాలు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపారు.

**ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులు రద్దు :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి మొంథా తుపానుగా మారడంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే అప్రమత్తమైంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించాల్సిన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే, రద్దుచేసిన రైళ్ల జాబితాను 'ఎక్స్'లో పోస్టు చేసింది.

## తుఫాన్ ప్రభావంతో విమానసర్వీసులు రద్దు

**గన్నవరం, అక్టోబరు 27, ప్రభాతవార్త :** తీవ్రతుఫాన్ మెంతా ప్రభావానికి పలు విమానసర్వీసులు రద్దుచేస్తున్నట్లు విజయవాడ విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మంగళవారం భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాల నేపథ్యంలో మంగళవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంనుండి రాకపోకలు సాగించే 8 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానసర్వీసులు రద్దయ్యాయి. విశాఖపట్నం-గన్నవరం మధ్య తిరిగే ఐఎక్స్2819, గన్నవరం-హైదరాబాద్ ఐఎక్స్ 2862, ఐఎక్స్ 2875 బెంగుళూరు-గన్నవరం, ఐఎక్స్ 2876 గన్నవరం-బెంగుళూరు, ఐఎక్స్ 976షార్జా-గన్నవరం , ఐఎక్స్ 975 గన్నవరం-షార్జా, ఐఎక్స్ 2743 హైదరాబాద్-గన్నవరం, ఐఎక్స్ 2743 గన్నవరం-విశాఖపట్నం విమానసర్వీసులను రద్దు చేసారు. విశాఖపట్నం నుండి వెళ్ళె ఎయిరిండియా, ఇండిగో విమానసర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం.

## క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

>> క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి మరో మూడు నెలల పాటు రాష్ట్రంలో అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ గడువు లభించింది.



సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరిగిన ఛాత్‌పూజ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

## తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

### సిఫారసు చేసిన జస్టిస్ గవాయ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ సూర్యకాంత్ పేరు ఖరారైంది. ప్రస్తుత చీఫ్ జస్టిస్ భూషణ్ ఆర్.గవాయ్ తన వారసుడిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును కేంద్ర ప్రభుత్వానికి సోమవారం సిఫారసు చేశారు. దీంతో దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి మార్గం సుగమమైంది. జస్టిస్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సిజెఐ పేరును సూచించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ కోరిన మీదట జస్టిస్ గవాయ్ ఈ సిఫారసు చేశారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24న నూతన సిజెఐగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేసేంత వరకు, అంటే సుమారు 14 నెలల పాటు ఈ అత్యున్నత పదవిలో కొనసాగుతారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ నుంచి 1981లో డిగ్రీ, రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా తన ప్రాక్టీసును ప్రారంభించారు. 1985లో చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2000 జులై 7న హర్యానా రాష్ట్రానికి అత్యంత పిన్న వయస్కుడైన అడ్వొకేట్ జనరల్‌గా రికార్డు సృష్టించారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ గవాయ్ సిఫారసుతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై అధికారిక నోటిఫికేషన్ జారీ చేయనుంది.

## హైకోర్టు జడ్జిగా జస్టిస్ మానవేంద్రనాథ్

**విజయవాడ,అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ మానవేంద్ర రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం. న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002 లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులై వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయ సేవలు అందజేశారు. 2015 జూలై నుండి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గా మరియు 2019 జూన్ నుండి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందజేయగా 2023 నవంబర్ లో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై సొంత రాష్ట్రానికి వచ్చిన ఆయన తిరిగి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు, ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సహాయ శిబిరాలు సిద్ధం

>> ఆదేశించారు. ఆ శిబిరాలలో నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీనిని నివారించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు, మందులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖ సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా చూసే బాధ్యతను సెల్ ఫోన్ ఆపరేటర్లు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలకు చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంట పొలాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, నీటిని బయటకు పంపేందుకు అవసరమైన ఆయిల్ మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఖిమొంథాఖి తుపాను పరిస్థితులను గమనిస్తూ ప్రజలంతాఅప్రమత్తంగా ఉండాలని, బాధితులకు ఏసాయం అవసరమైనా స్పందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం 24గంటలూ సిద్ధంగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

## వీధికుక్కల బెడదను నివారించలేరా?

### సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాలపై సోమవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ కుక్కలను పట్టుకోవడం, వాటి సంతానోత్పత్తిని నిరోధించడం, వాటిని శిబిరాలకు తరలించడంపై తీసుకుంటున్న చర్యలు తెలియజేసేలా అఫిడవిట్లు దాఖలు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతోన్న నేపథ్యంలో న్యాయస్థానం నుంచి తీవ్ర స్పందన వచ్చింది. రాష్ట్రాల నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. వీధి కుక్కల దాడులు పెరుగుతున్నాయి. నిరంతరం ఈ ఘటనలు జరుగుతున్నాయి. ఆ బెడద వల్ల విదేశాల్లో భారత్‌ను చెడుగా చిత్రీకరిస్తున్నారు. మేం కూడా వార్తా కథనాలను చూస్తున్నాం.

## పరకామణి కేసుపై సిఐడి దర్యాప్తు

>> వాడిని శిక్షించాల్సిన టిటిడి అధికారులు, పోలీసుశాఖ లోక్‌అదాలత్‌లో రాజీ ధోరణికి తీసుకెళ్ళడం ఎంతవరకు సరైందనే వాదనలు ఇప్పుడు అన్ని వర్గాల్లోనూ హాట్‌టాఫిక్‌గా మారింది. టిటిడి ప్రస్తుత ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ కూడా టిటిడి అనుమతిలేకుండానే చోరీ కేసులో పూర్వ ఏవిఎస్‌ఒ సతీశ్‌కుమార్‌రాజీచేసుకోవడాన్ని తప్పుపట్టారు. హైకోర్టులో ఇదే అంశాన్ని తెలియజేస్తూ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో ఇప్పుడు ఏం జరగనుందనేది పోలీసుశాఖలో భయంగొల్పిస్తోంది. ఏవిఎస్‌ఒ సతీశ్‌కుమార్ కౌంటర్‌దాఖలు చేసి కేసు రాజీలో తనకెలాంటి దురుద్దేశం లేదని పేర్కొనడం వెనుక అంతర్యమేమిటనేది కొందరు పోలీసు అధికారులు తప్పుపడుతున్నారు. టిటిడి పరిధిలోని అంశం గనుక బోర్డు, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలి. మరీ నేరం జరిగినా ఆయన ఫిర్యాదిదారుడుగా రాజీ చేసుకున్నాననడం ఎంతవరకు కరెక్ట్‌కూడా ఇప్పుడు సిఐడి విచారణలో తేలనుంది. సిఐడి డిసెంబర్ 2వతేదీకి ఇచ్చే దర్యాప్తు నివేదికలో పేర్కొనే సంచలన విషయాలపై పూర్వ టిటిడి ఉన్నతాధికారి, కొందరు పూర్వ పోలీసు అధికారుల ఉద్యోగాలకు కూడా ఇబ్బంది కలిగే అవకాశం లేకపోలేదు.

**దర్యాప్తు నిందితుడు రవికుమార్‌చుట్టూనే:** దేవునికి భక్తులు కానుకలుగా సమర్పించే కరెన్సీ నోట్లు, చిల్లరనాణేలను టిటిడి పరకామణి భవనంలో లెక్కింపు చేస్తుంది. ఎంతో అమూల్యమైన ఈ వ్యవహారంలో బాధ్యతగా టిటిడి డిప్యూటీ ఇఒ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులతో బాటు విజిలెన్స్‌విభాగం పర్యవేక్షణ ఉంటుంది. విజిలెన్స్ విభాగం టిటిడి పరిధిలో ఉన్నా డిప్యూటేషన్‌పై పోలీసుశాఖ నుండి వచ్చే సిఐలు, డిఎస్పీ అధికారులు విధుల్లో ఉంటారు. వీరి కాలపరిమితి రెండేళ్ళు. టిటిడిలోకి వచ్చిన తరువాత డిప్యూటేషన్ అధికారులను తిరిగి వారి మాతృసంస్థలకు బదలాయించాలి. అయితే టిటిడిలో ఉన్న విఐ, ఏవిఎస్‌ఒ, విఎస్‌ఒల హోదా పరపతి, సామంతరాజుల్లా మందీమార్బలంతో సకలం జరిగిపోతూ రాజకీయపెద్దల అండతో ఏళ్ళతరబడి రకరకాల హోదాల్లో కాలం వెల్లబుస్తున్నారు. ఇలాంటి సమయంలో టిటిడిలో ఏదేని తప్పులు జరిగినా ఆ అదికారులదే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరీ పూర్వ ఏవిఎస్‌ఒ సతీశ్‌కుమార్ వ్యవహారం ఇందుకు భిన్నంగా మారి, ఫిర్యాదిదారుడు తానే కావడంతో కేసు రాజీచేసుకునే అర్హత తనకుందని పిటిషన్‌లో పేర్కొనడం ఇప్పుడు రానున్న రోజుల్లో టిటిడి విజిలెన్స్‌విభాగంలో ప్రక్షాళన తప్పదనేది కూడా చర్చమొదలైంది. పైగా టిటిడిలో ప్రత్యేకంగా విజిలెన్స్‌విభాగం పోలీస్ సిబ్బంది లేకపోవడం కూడా ఇలాంటి తప్పిదాలకు అవకాశం ఇచ్చినట్లేనని కొందరు ఉద్యోగులు వాదనలు. పరకామణిలో గుమస్తా అయిన సివి రవికుమార్ 2023ఏప్రిల్‌లో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేసిన కేసు, ఎఫ్ఐఆర్, ఆ తరువాత దర్యాప్తు, అతను కూడబెట్టిన ఆస్తులు, కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లోక్‌అదాలత్‌లో రాజీతో ఎవరెవరికి ఎంత మొత్తంలో లాభపొందారనేది సిఐడి నిగ్గుతేల్చాల్సిన కీలక అంశంగా మారింది.

# నేటి నుంచి 12 రాష్ట్రాలు, యుటిల్లో 'సర్'

>> సెకండ్ ఫేజ్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ మంగళవారం నుంచే మొదలు కానుందని వివరించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రారంభం అవుతుందని సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. దేశంలోని 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలతోపాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఓటరు ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించి కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడానికి ఏవైనా తప్పులను సరిదిద్దుతారని సీఈసీ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారం6, డిక్లరేషన్ ఫారాలను సేకరించి, కొత్త ఓటర్లు ఫారాలను నింపడానికి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) లేదా అసిస్టెంట్ ఈఆర్ఓకి అందజేస్తారని తెలిపారు. ఎస్ఐఆర్ రెండో దశ శిక్షణ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు.

## వారం - వర్జ్యం

28-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
షష్ఠి ఉ.7.59
పూర్వాషాఢ మ.3.41
వర్జ్యం : రా.12.15-1.59
దు.ఉ.8.23-9.09
2) రా.10.18-11.04
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంతాలలోని ఆత్మీయుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** నిలకడ లేని ఆర్థికవ్యవహారాలు చికాకు పరుస్తాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో పురోభివృద్ధి ఒడిదుడుకులు లేకుండా సానుకూలంగా ఉంటుంది.

**కర్కాటకం :** బంధువులతో మాట పట్టింపులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటారు.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. నూతన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**కన్య :** ఇంటి వాతావరణం ప్రోత్సాహకరంగా ఉంటుంది. బంధువుల కలయిక.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. వస్త్రాల కొనుగోలు.

**ధనుస్సు:** మీ సన్నిహితుల నుండి సకాలంలో సహాయం అందకపోవచ్చు.

**మకరం:** ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**కుంభం:** చిన్ననాటి మిత్రలను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలు.


**మీనం :** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# లాజిస్టిక్స్ అభివృద్ధికి రైలు రవాణా కారిడారే కీలకం

## నూతన పోర్టులకు రైల్వే కనెక్టివిటీ రావాలి

### రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



రైల్వే ప్రాజెక్ట్‌లపై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని నూతనంగా నిర్మించే పోర్టులను కూడా అనుసంధానించేలా రైల్వే కనెక్టివిటీ వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మూలపేట, విశాఖ, కాకినాడ, రామాయపట్నం తదితర పోర్టులకు కనెక్టివిటీని పెంచేలా లైన్లు వేయాలని సీఎం రైల్వే అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేలా ప్రణాళిక చేస్తున్నామని ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్పత్తుల రవాణా కోసం రైల్వే సహకారం అవసరమని సీఎం అన్నారు. కేంద్రంతో కలిసి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నడికుడిశ్రీకాళహస్తి, గుంటూరుగుంతకల్, గుణదలముస్తాబాద్ బైపాస్, రేణిగుంట, రాయదుర్గ్‌తుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం అధికారులతో సమీక్షి ంచారు. హైదరాబాద్‌బెంగుళూరు, అమరావతి మీదుగా హైదరాబాద్‌చెన్నై మార్గాల్లో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్వే కారిడార్ కు సంబంధించిన ప్రతిపాదనలపై సీఎం చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు రావాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతిని కలుపుతూ చెన్నై బెంగుళూరు హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ ఉండేలా చూడాలన్నారు. మరోవైపు ఖరగ్ పూర్ నుంచి చెన్నై వరకూ డెడికేటెడ్ రైలు రవాణా కారిడార్ పైనా సమీక్షలో సీఎం దిశానిర్దేశం చేశారు. కొత్తగా 1564 కిలోమీటర్ల కొత్త మార్గాలకు సంబంధించిన పనులపై కూడా సీఎం ఈ సమీక్షలో చర్చించారు. ఏపీని లాజిస్టిక్స్ కారిడార్ గా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నామని ప్రస్తుతం ఉత్తర దక్షి ణ భారత్ ల మధ్య కనెక్టివిటీ దిశగా పనులు జరిగాయని ఇక తూర్పు నుంచి పశ్చిమ రాష్ట్రాలను అనుసంధానించే ప్రాజెక్టులు కూడా చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచనలు జారీ చేశారు. నడికుడి శ్రీకాళహస్తి మార్గంలో తదుపరి పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.27 కోట్ల నిధుల్ని తక్షణం విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. కోటిపల్లి నర్సాపూర్ మార్గంలో కాకినాడ కోటిపల్లి అమలాపురం మార్గంలో రైలు సర్వీసు నడపాలని సూచించారు. అమరావతి, గన్నవరంలో నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని రైల్వే శాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటితో పాటు విజయవాడ, గుంటూరు నగరాల్లోనూ రైల్వే కోచింగ్ టెర్మినళ్లను విస్తరిస్తున్నట్టు అధికారులు వివరించారు. గుంటూరు గుంతకల్ డబ్లింగ్ పనులు వేగంగా చేపట్టాలని... కాజీపేట విజయవాడ మధ్య మూడో లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఐకానిక్ రైల్వే స్టేషన్లు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖ,
తిరుపతిలను ఐకానిక్ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా నిర్మించనున్న అమరావతి రైల్వే స్టేషన్ ను కూడా వినూత్నంగా నిర్మాణం చేపట్టాలన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ రీడెవలప్మెంట్ పనులు వేగంగా చేపట్టాలని తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికుల సౌలభ్యం కోసం స్కైవాక్ నిర్మించాలని సీఎం సూచించారు. విశాఖలో జ్ఞానాపురం వైపు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయని సీఎం అన్నారు. ప్రస్తుతం మూడు స్టేషన్లతో పాటు నెల్లూరు,

రాజమహేంద్రవరం స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు రైల్వే అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 73 స్టేషన్లను అమృత్ స్టేషన్ల కింద ఆధునీకరిస్తున్నామని రైల్వే అధికారులు వివరించారు.

# బస్సు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు



**వింజమూరు, (నెల్లూరు)అక్టోబర్ 27, ప్రభాతవార్త** కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బెంగుళూరుకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో సజీవ దహనమైన గోళ్ళ రమేష్ కుటుంబ సభ్యుల మృతదేహాలు ఆదివారం రాత్రికి గోళ్ళవారిపల్లికి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వచ్చాయి. సోమవారం ఉదయం జరిగిన అంతిమ యాత్రలో మృతులు గోళ్ళ రమేష్, అనూష, శశాంత్, మన్విత్‌లకు అశ్రునయనాలతో ఘనంగా కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. బస్సు ప్రమాద ఘటన తెలిసినప్పటి నుండి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వయంగా గోళ్ళవారిపల్లి గ్రామానికి వెళ్లి గోళ్ళ రమేష్ తండ్రి మాలకొండయ్యకు ధైర్యం కల్పిస్తూ అండగా అక్కడే ఉండి మృతదేహాలను స్వగ్రామంకు తీసుకొని వచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి అటు పార్టీ పెద్దలు దృష్టికి రమేష్ కుటుంబ పరిస్థితి వివరించి ఇటు జిల్లా నాయకులతో ప్రమాద ఘటన వివరిస్తూ వారి కుటుంబంలో ఒక్కడిగా వ్యవహరించిన ఎమ్మెల్యే తీరు గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆదివారం రాత్రి కర్నూలు నుండి ప్రత్యేక అంబులెన్స్‌లో బయలుదేరిన మృతదేహాలు వస్తున్నాయని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గోళ్ళవారిపల్లి గ్రామంలో మృతదేహాలను రాత్రికి ఉంచేందుకు మృతుడు ఇంటి వద్ద ఐస్ బాక్సులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా సోమవారం ఖననం చేసే ప్రాంతం శుభ్రం చేయించాడు. ప్రమాద సంఘటన జరిగిన రోజు నుండి చివరి అంతిమ యాత్ర వరకు అన్ని ఖర్చులు ఎమ్మెల్యే భరించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెబుతూ గ్రామస్తులు అందరూ కూడా వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు. సోమవారం అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో జనాలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గోళ్ళవారిపల్లిలో దు:ఖ వాతావరణం నెలకొంది. సోమవారం జరిగిన రమేష్ కుటుంబ సభ్యుల అంతిమ యాత్రలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు. రమేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను మానసికంగా తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టం ఏ ఒక్క కుటుంబానికి కలగకూడదని దేవుని ప్రార్థిస్తున్నాం అన్నారు. మృతుడు కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. గోళ్ళ మాలకొండయ్య కుటుంబానికి పార్టీ నుండి పది లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు. అలాగే కాకర్ల చారిటబుల్ ట్రస్టు నుండి మూడు లక్షల రూపాయలు ఆర్థిక సాయం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ట్రస్టు నుండి రూ.5లక్షలు ఆర్థిక సాయం, అలాగే మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వర్ణ భారతి ట్రస్టు ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మరికొంత ఆర్థిక సహాయం అందనుందన్నారు.

ఆర్థికపరంగా మాలకొండ కుటుంబానికి భరోసా కొంత కలిగినప్పటికి, కుటుంబ సభ్యులు కోల్పోయిన లోటును తీర్చలేనిదన్నారు. వారి కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. ప్రత్యేకంగా పోలీసు వారికి మీడియా మిత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## తాళ్లరేవు మండల గ్రామాలకు సహాయక చర్యలపై దృష్టి సారించాలి

### అమలాపురం ఎంపి హరీష్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో విలీనమై అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న తాళ్లరేవు మండలంలోని గ్రామాల ప్రస్తుత పరిస్థితి పై అధికారులను హరీష్ ఆరా తీశారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షి ంచారు. అవసరమైతే చెయ్యాల్సిన సహాయక చర్యలపై దృష్టి సారించాలని ఎంపీ హరీష్ అధికారులకు సూచించారు. అలాగే ఈ సమావేశంలో పాల్గొన్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌లను విపత్కర పరిస్థితులు ఏర్పడితే తమ పరిధిలోని గ్రామాలకు పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఎంపీ

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

### ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలి : డిప్యూటీ సిఎం పవన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న క్రమంలో కాకినాడ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై సోమవారం మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ల్లాలో 12 మండలాలపై ప్రభావం ఉంటుందనీ తెలిసిన క్రమంలో ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షి త ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన ఆహారం, రక్షి త తాగునీరు, పాలు, ఔషధాలు సమకూర్చాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, ఈతగాళ్లు సిద్ధంగా ఉన్నందున ఎలాంటి ఆందోళన అవసరం లేదని ప్రజలకు తెలియచేయాలన్నారు. తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత ఎక్కువగా ఉం టుంది కాబట్టి విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి వాటి పున రుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గర్భిణులు, బాలిం తలు, వృద్ధులు, రోగుల వివరాలు తెలుసుకొని,

## మొంథా తుఫాన్ ప్రభావం

### నేడు ప్రశాంతి.. విశాఖ సహా అనేక రైళ్లు రద్దు

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 27, ప్రభాత వార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి మొంథా తుపానుగా మారడంతో రైల్వేశాఖ అప్రమత్తమైంది. ప్రయాణికుల రక్షణ, భద్రత దృష్ట్యా భువనేశ్వర్ బెంగళూరు మధ్య తిరిగే ప్రశాంతి ఎక్స్ ప్రెస్, భువనేశ్వర్ సికింద్రాబాద్ మధ్య తిరిగే విశాఖ ఎక్స్ ప్రెస్ తోపాటు తూర్పు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే అనేక రైలు సర్వీసులను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

## మేయర్ అనురాధ దంపతుల హత్యకేసు నిందితుల శిక్ష మళ్లీ వాయిదా

**చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ హత్య కేసులో నిందితుల శిక్ష మరోసారి వాయిదా పడింది. మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసు తుది తీర్పు సోమవారం వెల్లడిస్తామని మూడు రోజుల క్రితం చిత్తూరు 6వ అదనపు జడ్జి కోర్టు ప్రకటించింది. ఈ మేరకు హత్యానేరం నిర్ధారించబడిన ఐదు మందిని పోలీసులు సోమవారం కోర్టు ఎదుట హాజరుపరిచారు. అయితే నిందితుల నుండి వాగ్మూలాలు తీసుకున్న కోర్టు ఈ నెల 30వ తేదీన తుది తీర్పు వెల్లడించనున్నట్లు జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు 2015 నవంబర్ 17వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనే దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మేయర్ దంపతుల హత్య కేసులో 23 మంది నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కోర్టులో 2016 ఫిబ్రవరి 18వ తేదీన కోర్టులో 23 నిందితులపై చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విచారించిన 6వ అదనపు కోర్టు 23 మంది నిందితుల్లో మేయర్ దంపతులను హత్య కేసులో ఐదు మందిని మాత్రమే నిందితులుగా నిర్ధారించి మిగిలిన వారిని విడుదల చేసింది. ఈ మేరకు మేయర్ దంపతులను హత్య చేసిన మొదటి ఐదు మంది నిందితులను పోలీసుల కస్టడీలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం మేయర్ దంపతుల హత్య కేసు నిందితులకు శిక్ష ఖరారు అవుతుందని అందరు భావించారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులుగా వున్న చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌ల వాగ్మూలాలను కోర్టు సోమవారం మరోకసారి నమోదు చేసింది. ఈ మేరకు నిందితులు తమ ఆవేదనను కోర్టుకు విన్నవించుకున్నారు.

## వైఎస్సార్సీ రాజకీయాలు చేస్తుందా? ఆ పేరుతో నేరాలను ప్రోత్సహిస్తుందా? మంత్రి లోకేష్

**విజయవాడ, అక్టోబరు 27 పభాతవార్త ప్రతినిధి:** వైసిపి రాజకీయాలు చేస్తుందా, ఆ పేరుతో నేరాలను ప్రోత్సహిస్తుందా ఆలోచించుకోవాలి అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. పక్క రాష్ట్రంలోని ఓ గురుకుల పాఠశాలలో 2023 నాటి వీడియోను ఇప్పుడు అరకులో జరిగినట్లు ఒక కథనం రాసి వైకాపా అనుబంధ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయం చేద్దామనుకుంటున్న 'బ్లూ బ్యాచ్' సమాజానికి ప్రమాదకరమని ఎక్స్‌లో నారా లోకేష్ ఆరోపించారు..

'ఈ వార్త, వీడియోపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫ్యాక్ట్ చెక్‌లో సంపూర్ణ వివరాలు అందించాం. కొద్ది రోజులు ఊరుకొని మళ్ళీ అదే వీడియోతో తాజాగా తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ఈ ఫేక్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు.

తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసు కోవాల్సిందిగా పోలీసుల్ని కోరుతున్నాను'అని లోకేష్ వివరించారు.

## తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

### - విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు - డివిజన్లస్థాయిలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు - ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతిరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎపిఎస్పీడిసిఎల్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పీడిసిఎల్ పరిధిలో తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండే జిల్లాల్లో అధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాలలో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. నెల్లూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణాదేవి, తిరుపతిసర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ పి.సురేంద్రనాయుడు, చిత్తూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ యం.ఉమాపతిలను నోడల్ ఆఫీసర్లగా నియమించామని తెలిపారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఎపిఎస్పీ డిసిఎల్ నుంచి అధి కారులు, సిబ్బందితో (1505 మంది) కూడిన 124 బృందాలు తరలి వెళ్ళాయని తెలి పారు. ఎస్పీడిసి ఎల్‌కు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, ఎబి స్విచ్‌లు, క్రాస్ ఆర్మ్స్, కండక్టర్, ఎబి కేబుల్ తదితర విద్యుత్ పరికరాలను కూడా తరలించినట్లు పేర్కొన్నారు. ఎపిఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతా ల్లో సరఫరా పున రుద్ధరణ పనులు వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాల న్నారు. వర్షం కురుస్తున్న సందర్భాలలో ప్రజలు విద్యుత్ స్తంభాలకు తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూటిపోవడం, లైన్ల తెగిపడటం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి గానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు–1912 లేదా 1800 425 1553 33కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో విడవని వర్షం



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావంతో తిరుమలతో బాటు తిరుపతి జిల్లాలో తిరుమల,తిరుపతి,చంద్రగిరి ప్రాంతాల్లో బలమైన వాన కురుస్తోంది. ఉదయం గంటసమయం కురిసిన వాన మళ్ళీ మధ్యాహ్నం, సాయంత్రం నుండి కురుస్తోంది. ఓ వైపు వర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంస్థలకు కూడా వరుసగా మూడురోజులు సెలవులు ప్రకటించారు. కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో సకలం సుభిక్షం

### రఘువిజయతీర్థస్వామి



**తిరుమల, అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉంటుందని కర్నాటక శ్రీకూడలి ఆర్యఅక్షోభ్యమఠం పీఠాధిపతి రఘువిజయతీర్థస్వామి తెలిపారు. పవిత్రమైన కార్తీక సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా మహద్వారం వద్ద స్వాగతం పలికారు. వానలోనూ స్వామి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పరకామణి కేసులో ముందుకు ఎలా !

### - వైకుంఠద్వారదర్శనాలపై నేడు నిర్ణయం?

### - నేటి టిటిడి బోర్డు సమావేశంలో కీలక అంశాలు




**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడులుగా కానుకలు సమర్పించే పరకామణిలో చోరీ జరిగిన ఉదంతంపై కేసు హైకోర్టులో ఉండటంతో తదుపరి ఎలా వ్యవహరించాలనే అంశంపై టిటిడి బోర్డు చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ కేసులో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. టిటిడి ప్రమేయం లేకుండా అప్పటి పరకామణి ఏవిఎస్‌ఒ సతీశ్‌కుమార్ కేసు రాజీచేసుకున్నారనే ప్రధాన ఆరోపణ వినిపించారు. ఇప్పుడు సిఐడితో విచారణకు, రవికుమార్ ఆస్తులపై ఏసిబికి కేసు అప్పగించడం సంచలనంగా మారింది. టిటిడికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన భక్తుల మనోభావాలతో ముడిపడిన విషయం కావున ఎలాంటి చర్యలు చేపట్టాలి, సిఐడికి ఇవ్వాల్సిన సమాచారం పై నేడు చర్చించనున్నారు. అలాగే గతనెలలో ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఇటీవల దిగ్విజయంగా జరిపించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల బహుమానం కూడా టిటిడి ఉద్యోగులకు 18వేల రూపాయలు మంజూరుచేయాలనేది టిటిడి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు. గత ఏడాది 15,400 రూపాయలు బ్రహ్మోత్సవ బహుమానం అధికారులు మంజూరుచేశారని దాన్ని కొంతరెట్టింపు చేయాలని కోరుతున్నారు. ఎంత మొత్తంలో అందజేస్తారనేది బోర్డు సమావేశంలో స్పష్టత రానుంది. ఇక ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వారాన్ని తెరచి ఉంచే విషయంపై రెండురోజులకే పరిమితం చేయనున్నారనేది వెల్లడికానుంది. ఇదేగాక తిరుమలలో ఔషధవనం ఏర్పాటు, ప్రసాదాలకు ఆహారపదార్థాలు టెండర్లు, టిటిడిపై దుష్ప్రచారాలు చేసేవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, గోశాల నిర్వహణ పై కార్యాచరణ వంటి అంశాలు చర్చకు రానున్నాయి.

## శ్రీవారి దర్శనం ఆనందదాయకం - ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని పవిత్రకార్తీక మాసంలో దర్శనంతో అంతా ఆనందదాయకమని పలువురు ప్రముఖులు తెలిపారు. సోమవారం ఉదయం జబర్ధస్త్ రాకేశ్, సాయిప్రదీప్తి, ప్రవళ్ళిక, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారులు సుభాష్‌కేశవ రావు, సీమాగార్గ్‌లు విఐపి బ్రేక్ సమయంలో కుటుంబంతో కలసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారికి తలనీలాలు సమర్పించిన కొడాలి నాని



**తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఎప్పుడూ భిన్నంగా గడ్డంతో కనిపించే మాజీమంత్రి, వైసిపి నేత కొడాలి నాని సోమవారం ఉదయం తిరుమలలో వేంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆయన చూడటానికి చాలా సన్నగాకనిపించారు. సోమవారం ఉదయం వైసిపి మాజీమంత్రులు కొడాలి నాని, పేర్నినాని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి కానుకలు సమర్పించారు. ఆలయ అర్చకులు రంగనాయకుల మండపంలో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. చాలారోజుల తరువాత వీళ్ళు తిరుమలకు వచ్చారు.

## తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి, ప్రజలను అప్రమత్తం చేయాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మొంథా తుపాను ప్రభావంపై సోమవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, ప్రత్యేక అధికారి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జీ.బిందు మాధవ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ, అమలాపురం పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జీఎం.హరిష్ బాలయోగిలతో కలిసి హాజరయ్యారు.

తుపాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని సిఎం అధికారులకు సూచించారు. తుపానుకు ఎక్కువగా ప్రభావితం అయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి

ప్రజలను సురక్షి త ప్రదేశాలకు, పునరవాస కేంద్రాలకు తరలించాలని సిఎం అధికారులను ఆదేశించారు. గతలో సంభవించిన తుపాను సంఘటనలను ఆధారంగా అధికారులు మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు.

వార్త

దేనినైనా ఆశించబోయే ముందు అందుకు కావలసిన అర్హతను సంపాదించుకో.

-బర్ట్రండ్ రస్సెల్

# ముందస్తుతో ముప్పు తప్పేనా?

భారీ తుపాను హెచ్చరికతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజలకు కంటి మీద కునుకు లేదు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలయితే ఎప్పుడు ఏ జలఖడ్గం మీద పడ్తుందోనని బెంబేలు పడుతున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇక్కడొచ్చే భయం అదే. వాయుగుండం బలహీనపడి తీరం దాటేటప్పుడే అసలు సమస్య వస్తుంది. తుఫానులు వాయుగుండాలు, వరదలు తెలియని తీర ప్రాంతంకాదు. కోస్తాతీర ప్రాంతాలకు మూడు రోజులు ముందుగానే వాతావరణ హెచ్చరికలు తెలియడం, తుఫాను తీవ్రతను అంచనా వేయగలగడం ఆధునిక శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకొని వాతావరణ తీవ్రతను తెలియ చేయడం మంచి పరిణామం. దీని వల్ల ప్రాణనష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తేలిక. ఉత్తర ఈశాన్య జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని జారీ చేసిన హెచ్చరికలు మొదట్లో ప్రజల్ని ఆందోళనలో ముంచెత్తినా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆహ్వానించదగినవి. గతంలో ఉత్తరాంధ్రకు ఎంతో తీవ్రతతో వచ్చి ఆ ప్రాంత ప్రజలపై పంజా విసిరిన 'హుద్‌హుద్' తుఫాను అనంతర చర్యలు ఉపశమనం కలిగించాయి. ఆనాటి అనుభవాలతో ఈ ప్రాంతంలో అలల అలజడికి మరెంతో మంది అప్రమత్తులైనారు. తీరం పొడవునా బీచ్‌లన్నీ మూసేసారు. ఈదురుగాలులకు విద్యుత్ లైన్‌లు, కమ్యూనికేషన్, వంటి మౌలిక సౌకర్యాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఎక్కువ. కనుక పెద్ద సంఖ్యలో పునరుద్ధరణ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రకృతి బీభత్సాలు ఆ ప్రాంతాలకు, ప్రభుత్వాలకు కొత్త కాదు. ఈసారి మరిన్ని ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 2014 అక్టోబరు 12న హుద్‌హుద్ తుపాను ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ముంచెత్తింది. కనీవినీ ఎరుగని రీతిలోరూ. 21,908 కోట్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం జిల్లాలు ప్రభావితం కాగా వ్యవసాయ సంబంధిత నష్టం రూ.947 కోట్లుగా అంచనా వేశారు. గత అనుభవాల రీత్యా ఈసారి 'మొంథా' తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. సోమవారం రాత్రికి తీవ్ర వాయుగుండం ప్రభావం గట్టిగానే ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం తుపాను బలహీనపడుతుంది. ఇలా జరిగినప్పుడే ప్రకృతి విధ్వంసం తీవ్రంగా ఉంటుంది. కోస్తా జిల్లాలో ఈదురు గాలులతో వర్షాలు పడుతున్నాయి. మొంథా తుపాను మంగళవారం సాయంత్రానికి కాకినాడ, తునిల మధ్య తీరం దాటుతుందన్నది అంచనా. ప్రస్తుతానికి చెన్నైకి 520 కి.మి, కాకినాడకి 570కి.మీ, విశాఖపట్నానికి 600 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. తీరం వెంబడి అన్ని పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. జాలర్లను సముద్రంలోకి వెళ్లకుండా నిషేధాజ్ఞలు విధించారు. నెల్లూరు జిల్లాలో ఎగువనున్న సోమశిల డ్యామ్ నుండి పెన్నానదికి వచ్చే వరద ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పొర్లుకట్టల నిర్మాణాన్ని స్థానికులు చేసుకుంటున్నారు. ఎన్నడూలేనిది ఈసారి ఎలాంటి విలయ తాండవానికైనా తట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమౌతోంది. బొర్రా గుహలకు ఈనెల 31వరకు పర్యాటకులెవరూ సందర్శించకుండా సెలవులు ప్రకటించారు. ఉభయ రాష్ట్రాలలో ఎన్నో కష్టాలు కోర్చి వరి, కూరగాయలు, అపరాలు,వగైరా ఎన్నో పంటలను పండించగా ఇటీవలనే కోతల వరకు చేరి మరో పంటకు సిద్ధమైన తరుణంలో ఈ తుపాన్ ప్రభావం నష్టపరిచేదే. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తుపానుల తాకిడి ఉంటుందని పంటల ఒబ్బిడి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నవారు గట్టెక్కారు. అలా చేసుకోలేని వారు ఆందోళనపడుతున్నారు. ఉభయ రాష్ట్రాల్లో జూన్ నుంచి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇందువల్ల వ్యవసాయ కార్యకలాపాల మీద తీవ్ర ప్రభావం చూపాయి. చివరికి పంట చేతికొచ్చిన తరుణంలో నోటికందకుండా చేస్తోంది. అంటే సాగు ఉత్పత్తులను విక్రయించుకునే సమయానికి భారీ వర్షాలు ముంచెత్తిరావడంతో రైతులు కష్టాల సాగు చేసినట్లు భావించాల్సి వస్తోంది. చాలా మంది రైతులు తాము పండించిన పంట ఆదాయ వ్యయాలుచూసుకుంటే అప్పులే మిగిలాయి. దానికితోడు ఈవర్షాలు మరిన్నితిప్పలు తెచ్చిపెట్టాయి. గత నాలుగు నెలల్లోనూ 98 రోజుల భారీ వర్షంతో తెలంగాణ రైతును ఎత్తి కుదేసాయి. ఇక వ్యవసాయం వద్దనుకునే పరిస్థితి. దాదాపు ఆంధ్రప్రదేశ్ రైతాంగం పరిస్థితి అదే. ఎక్కడా వెసులుబాటు లేని స్థితి. మళ్లీ పంటకు పెట్టుబడి పెట్ట లేని స్థితి. రేపటి తుపాను ప్రభావం ఎలా ఉంటుందో తెలియని గందరగోళంలోకోస్తా రైతు కొట్టుమిట్టాడుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే తుపానుపై ప్రిడెక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటాను అనుభవంలోకి తీసుకుని ముఖ్యమంత్రి సరైన సమయానికి సరైన నిర్ణయాలు, అప్రమత్తం పాటింపు చర్యలు తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. డ్రోన్‌లు, క్రేన్‌లు, జెసిబిలు, రంపాలు వంటి అన్ని ఆధునిక పరికరాలతో బృందాలు సిద్ధమయ్యాయి. తీరం దాటేటప్పుడు ప్రచండగాలులు వీస్తాయని హెచ్చరించడంతో ఉత్తరకోస్తా ప్రాంతం వాళ్లు బతుకు జీవుడా అని కాలం వెళ్లబుచ్చుతున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నౌకాదళ హెలికాప్టర్‌లు బోట్లు సిద్ధం చేయడం వల్ల తక్షణ సహాయాన్ని అందివ్వడం వీలవుతుంది.

సమాజంలో మాత్రమే ఒక వ్యక్తి అనుకున్న శక్తులన్నిటినీ అన్ని దిశలలోనూ అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.



వివేకానంద

ఎక్కువ మంది విమర్శిస్తారు, కొద్ది మంది ప్రశంసిస్తారు. బహు కొద్ది మంది ప్రోత్సహిస్తారు.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### సాంకేతికత అవసరం

హైదరాబాదు నుండి బెంగళూరుకు వెళ్తున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ వోల్వో బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి మంటలు చెలరేగి, క్షణాల్లోనే అగ్నికి ఆహుతైంది. మొత్తం44మంది ప్రయాణికుల్లో కనీసం20మంది ప్రాణాలు కోల్పోగా,పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక విచారణ ప్రకారం,ఢీకొన్న బైక్ బస్సు కింద చిక్కుకోవడంతో స్పార్క్‌లు పుట్టి మంటలు చెలరేగాయి. రాత్రి మూడుగంటల సమయంలోఎక్కువమంది ప్రయాణికులు నిద్రలో ఉండటం,అత్యవసర ద్వారాలు సకాలంలో పనిచేయకపోవడం, బస్సులో ఎలక్ట్రికల్ మార్పులు ఉండటం వంటి అంశాలు ప్రాణనష్టాన్ని మరింత పెంచాయి. ఈ ఘటనఒక్కసారిగా జరిగిన అనర్థంమాత్రమే కాదు భారత రోడ్డు భద్రతా వ్యవస్థలో ఉన్నలోపాలను మళ్లీ బహిర్గతం చేసింది. అతివేగం,డ్రైవర్ అలసట, తగిన పర్యవేక్షణ లేకపోవడం, నిబంధనలు కేవలం పత్రాలకే పరిమితమవడం వంటి కారణాలు ఇప్పటికీ అనేకప్రాణాలను తీస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యూనివర్సిటీ శుభ్రతను కాపాడాలి

ఉత్తరతెలంగాణ జిల్లాలో పెద్దదైన కాకతీయ యూనివర్సిటీలో నిత్యం వేలాదిమంది నడకదారులు, యోగా చేసే వారు సైకిల్ వాకర్స్ యూనివర్సిటీ లోపల పచ్చని చెట్ల మధ్య ప్రకృతిలో సేదతీరుతారు. అదేవిధంగా కిలోమీటర్ల కొద్ది వాకింగ్ చేస్తూ తమఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ప్రతిరోజు నిత్యం 2000 నుంచి 5000 వరకు ఈ ప్రాంతంలో వాకింగ్ చేస్తారు యూనివర్సిటీ ప్రధాన రహదారివెంబడి చెత్తాచెదారంతో అపరిశుభ్రంగాఉండడం వల్ల నడకదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి

### ఎల్ఐసిపై వాషింగ్టన్ పోస్ట్ ఆరోపణలు

వాషింగ్టన్ పోస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాపై ఆధారరహిత ఆరోపణలు చేసింది, దాని విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నంగాకనిపిస్తోంది. వాషింగ్టన్ పోస్ట్ లాంటి మీడియా సంస్థలు కుట్ర చేస్తున్నాయని, భారతీయ మీడి యా విచక్షణ లేకుండా ఈ ఆరోపణలను ప్రసారంచేస్తూస్వయం నష్టంకలిగిస్తోందని అనిపి స్తుంది. ఆరోపణలు ఆధారరహితంగా, అతిశయోక్తిగా ఉన్నాయి.

- ఎ.రఘునాథ రెడ్డి, కడప

### అత్యాచారాలు ఆపలేమా?

మన దేశం సంస్కృతి, సంప్రదాయాల పరంగా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. 'మాతృదేవోభవ' స్త్రీను గౌరవించు' అని చెప్పేనేటి రోజుల్లో మహిళలపై చిన్నారులపైనా, దివ్యంగులపైనా, వృద్ధులపైనా జరుగుతున్న అత్యాచారాలు, దాడులు మనసును కలచివేస్తున్నాయి. ఇది మన సమాజం మీద ఒక నల్ల మచ్చగా మారింది.మహిళ అనేది కేవలం ఒక వ్యక్తి కాదు. ఆమె తల్లి, అక్క,చెల్లి, భార్య,స్నేహితురాలు, గురువుగా కూడా మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆమెకు గౌరవం ఇవ్వడం అనేది మన అందరి నీతిపరమైన బాధ్యత. అయితే, కొన్ని మానవతా విలువలు కోల్పోయిన వ్యక్తులు స్త్రీని కేవలం వస్తువుగా చూసిహింసకు,దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇది అత్యంత దారుణమైన,మానవతను అవమానపరిచేచర్య. మహిళలపైదాడులు ఆగాలంటే ప్రతిపౌరుడుబాధ్యతగా వహరించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### తెలంగాణ అభివృద్ధికి నూతన దిశ

తెలంగాణ ప్రభుత్వం నవంబర్‌లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును నిర్వహించేందుకు సిద్ధమవ్వడం రాష్ట్ర అభివృద్ధి దిశలో ఒక ప్రగతిశీల అడుగుగా చెప్పుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి చేస్తున్న కృషి తెలంగాణ భవిష్యత్తుకు కొత్త దిశను చూపగల సామర్థ్యం కలిగి ఉంది.'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు, మూసి నది పునరుజ్జీవన ప్రణాళిక వంటి భారీ ప్రాజెక్టులు ప్రపంచ పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా మారేఅవకాశంఉంది.ఈరెండు ప్రాజెక్టులు హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి పెట్టే సామర్థ్యంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి కొత్త మార్గాలను సుగమం చేస్తాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలి

వంతెనలు భూగర్భ కాలువలలో పని చేసే కార్మికులు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో తమ విధులను నిర్వహిస్తుంటారు. భయంకరమైన దుర్వాసన మనుషుల మల విసర్జన ప్రవాహంలో పనిచేస్తూ నిర్మిస్తుంటారు. వీరికి దుర్వాసన నుండి అరికట్టడానికి ముఖానికి మాస్కులు చేతులకు గ్లౌజులు కాళ్ల రక్షణకు పొడవైన బూట్లుఉండవు.ఈపనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో తప్పకుండా కార్మికులకు అత్యంత నాణ్యమైన తగు రక్షణ పరికరాలు సమకూర్చుటకు పొందుపరచాలి.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

మనవి: ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ప్రాథమిక హక్కులకు గ్రహణం?

**రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఎసరు పెట్టే మెజారిటేరియనిజం ప్రమాదం కట్టెదుట నిలిచింది. రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు ప్రధానంగా ఏవంటే రాజ్యాంగం అత్యున్నత స్థానం, దేశ ఐక్యత సమైక్యత, సర్వసత్తాకత, ప్రజాస్వామిక జీవన విధానం, రాజ్యాంగ లౌకికవాద, ఫెడరల్ స్వభావం, ప్రాథమిక హక్కులు, శాసన సభ, కార్యనిర్వాహక వర్గం, న్యాయస్థానాల మధ్య అధికార వేర్పాటు, సంక్షేమ రాజ్యం,సమానత్వం మొదలగునవి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారం లోకి వచ్చిన తర్వాత నేటి పాలక పార్టీ మెజారిటేరియని జాన్ని ప్రోత్సహిస్తూ, అభివృద్ధి పేరిట తీవ్ర ఆర్థిక అసమా నతలు పెరిగే పంథాన పయనిస్తూ, ప్రభుత్వ రంగాన్నినీరు కారుస్తూ, ప్రతి పక్షాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని చెబుతూ రాజకీయ ప్రత్యామ్నాయ సిద్ధాంతాల సమూల నిర్మూలనకు సిద్ధమవుతున్నారు. ఇదే కొనసాగితే అవతరిం చేది సంకుచిత భారత్ కానీ వికసిత భారత్ కాదు.**

డా.జె. రవీంద్రనాథ్

ప్రజాస్వామ్యం ఈనాటి పరిస్థితుల్లో జీవించి వికసించాలంటే ప్రజలకు తమ గొంతు వినిపించే స్వేచ్ఛ ఉండాలి. తమ న్యాయమైన కోర్కెల కోసం రోడ్ల మీదకు వచ్చి శాంతియుతంగా ప్రదర్శనలు చేసే అవకాశం , ధైర్యం ఉండాలి. తమ అంతరాత్మకు నచ్చిన మతం అనుసరించే, ప్రచారం చేసే రాజ్యాంగ హక్కు మైనారిటీలకు కాగితంపై కాక ఆచరణలో ఉండాలి. మేజర్లు అయిన యువతీ యువకులు పరస్పర అంగీకారంతో కుల, మత, జాతి భేదాలకు అతీతంగా పరిణయమాడే స్వేచ్ఛ, సామాజిక, నైతికమద్దతు నిచ్చే చట్టాలు ఉండాలి. కానీ 'లవ్ జిహాద్ చట్టాల'తో వారి ప్రాథమిక హక్కులు సమకాలీన భారతంలో మృగ్యమయ్యాయి. రాజ్యాంగం చెప్పిన 'సహేతుక ఆంక్షల' స్థానంలో నిష్కారణ నిర్బంధం, అణచివేత, అగ్రకుల అహంకారపూరిత పరువు హత్యలు పరిపాటి అయ్యాయి. చివరకు జీవించే హక్కు నిస్సారమయ్యేలా వలస కాలం నాటి చట్టాలను మించిన కఠిన చట్టాలను ప్రతిపక్షాలు బైట ఆందోళనలో ఉన్నపుడు ఏ చర్చ లేకుండా పాలక పార్టీ పార్లమెంటులో ఆమోదించింది. అమలులో ఉన్న నల్ల చట్టాలని యధేచ్ఛగా ఉపయోగిస్తోంది. మరో వైపు కార్యనిర్వాహక వర్గాల అత్యుత్సాహం, న్యాయ విరుద్ధ చేష్టలు న్యాయ ప్రక్రియనే శిక్షగా మార్చాయి. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఎసరు పెట్టే మెజారిటేరియనిజం ప్రమాదం కట్టెదుట నిలిచింది. రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు ప్రధానంగా ఏవంటే రాజ్యాంగం అత్యున్నత స్థానం, దేశ ఐక్యత సమైక్యత, సర్వసత్తాకత, ప్రజాస్వామిక జీవన విధానం, రాజ్యాంగ లౌకికవాద, ఫెడరల్ స్వభావం, ప్రాథమిక హక్కులు, శాసన సభ,కార్యనిర్వాహక వర్గం,న్యాయస్థానాల మధ్య అధికార వేర్పాటు, సంక్షేమ రాజ్యం,సమానత్వం మొదలగునవి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారం లోకి వచ్చిన తర్వాత నేటి పాలక పార్టీ మెజారిటేరియని జాన్ని ప్రోత్సహిస్తూ, అభివృద్ధి పేరిట తీవ్ర ఆర్థిక అసమానతలు పెరిగే పంథాన పయనిస్తూ, ప్రభుత్వ రంగాన్నినీరు కారుస్తూ, ప్రతి పక్షాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని చెబుతూ రాజకీయ ప్రత్యామ్నాయ సిద్ధాంతాల సమూల నిర్మూలనకు సిద్ధమవుతున్నారు. ఇదే కొనసాగితే అవతరించేది సంకుచిత భారత్ కానీ వికసిత భారత్ కాదు. 1950 నాటి ఏ కె గోపాలన్ కేసు నుంచి నేటి భీమా కోరేగాం కేసు దాకా పీడీ, ఉపా, పీఎంఎల్ఏ లాంటి చట్టాల మూలానా వేలాది మంది ఖైదీలు ఎన్నో యేళ్లుగా బెయిలు రాక బాగా కిక్కిరిసిన కారాగారాల్లో మగ్గుతున్నారు. భిన్నాభిప్రాయం, సిద్ధాంతాలు సమర్థించే మేధావులు, నిజాన్ని అన్వేషించే పాత్రికేయులు, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రేమించే కళాకారులు తమ హక్కులు కోల్పోయే దుస్థితి రిపబ్లిక్‌తరహా ప్రభుత్వాన్ని కాక నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రపంచ న్యాయ ప్రాజెక్టు చట్టబద్ధ పాలన సూచిక 2024 ప్రకారం భారత్ మొత్తం 142 దేశాల్లో నేపాల్ (69), శ్రీలంక( 75) తర్వాత 79వ స్థానంలో ఉంది. విడి అంశాలలో చూస్తే భారత దేశం ప్రాథమిక హక్కులలో 102వ స్థానం, ప్రభుత్వ అధికారాలపై ఆంక్షల స్థానంలో 60వ స్థానం, పారదర్శకతలో 44వ స్థానం, అవినీతిరాహిత్యంలో 97వ స్థానం,




భద్రతలో 98వ స్థానం, సివిల్ న్యాయంలో 107వస్థానం, క్రిమినల్ న్యాయంలో 82వ స్థానంలో ఉంది. భారత్‌ను ఇతర దేశాలతో పోల్చి చూసినపుడు జర్మనీ(5),కెనడా (12), జపాన్ (24),యుకె (15), ఫ్రాన్స్(22), అమెరికా (27), ఇటలీ (32)వ స్థానాల్లో ఉన్నాయి. డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్‌లు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను మూడవ భాగంలో పొందుపరిచారు.వీటిలో సమానత్వ హక్కు (ఆర్టికల్స్ 1418), స్వేచ్ఛ హక్కు(19, 22), దోపిడీ వ్యతిరేక హక్కు(23, 24), మత స్వేచ్ఛ (25, 28),సాంస్కృతిక, విద్యాహక్కులు (29,30), రాజ్యాంగ పరిష్కారాల హక్కు (32, 35) ఉన్నాయి. ఇవి రాజ్యానికి వ్యతిరేకంగా ఆర్టికల్ 12లోని విశాల నిర్వచనానికి తగినట్లు అమలులో ఉంటాయి. దేశంలో ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా చట్టాలుంటే ఆ మేరకు ఆ చట్టాలు చెల్లనేరవని ఆర్టికల్ 13(1)చెబుతుంది. రాజ్యాంగ సభ చర్చల్లో ఆ నాడు పీడీ చట్టంపై 'న్యాయ ప్రక్రియ' స్థానంలో "చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన విధానం చేర్చారు. వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో కోర్టుల అధికారం తగ్గి సభ్యులందరూ తమ నమ్మకాన్ని శాసన సభ దయపైన, నేతల మంచి వ్యక్తిత్వంపైన పెట్టుకున్నారని గ్రాన్విల్ ఆస్టిన్ తన పుస్తకంలో రాశారు.అంబేద్కర్ ఆశించినట్లు సాంఘిక ఆర్థికన్యాయాలను, సమానత్వాన్ని విస్మరించి రాజ్యం మరింత నిర్బంధానికి పూనుకుంటే నిజమైన జాతీయ ఐక్యతకు భంగం కలుగుతుంది. భిన్నమతాలు, కులాలు, భాషలు, ప్రాంతాలు ఉన్న మన దేశంలో బలమైన వ్యక్తిత్వం,దార్శనికత, చిన్న బృందాలు, ప్రాంతాల కోసం దేశ ప్రయోజనాలను త్యాగం చేయనివారు, పై భేదాల వల్ల కలిగే అపోహలను నుంచి పైకి ఎదిగిన వారు వస్తారని ఆశిద్దాం అన్నారు అంబేద్కర్. కానీ మెజారిటీ మత, భాషా సంకుచిత భావాలను ప్రకటించే నేటి పాలకులకు అట్టి స్థాయి ఎక్కడిది? అయితే గతంలో ఎదురైన ఎమర్జెన్సీ అనుభవం తర్వాత సుప్రీం కోర్టు చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన విధానం అంటే ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని భావించింది. అంటే "అమలులోని చట్టం హేతుబద్ధత పరీక్షకు తట్టుకోవాలి" ఈ విధంగా రాజ్యాంగ నిర్మాతలు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టిన 'న్యాయ ప్రక్రియ' సారాంశంలో మరింత సమాచారయుత వ్యాఖ్యానం ద్వారా తిరిగి ప్రవేశ పెట్టబడింది. ఆర్టికల్స్ 14,16 రాజ్య చర్యలోని వివాదస్పద గుణాన్ని దెబ్బతీసి న్యాయం,సమాన ట్రీట్మెంట్ జరిగేలా హామీ ఇస్తాయని రాయప్ప కేసు (1974)లో న్యాయ మూర్తులు కృష్ణయ్యర్, భగవతిలు తీర్పులో చెప్పారు. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం 2023 డిసెంబర్ నాటికి 5.3 లక్షల మంది ఖైదీల్లో 73.5 శాతం విచారణలో ఉన్న ఖైదీలు. వీరి సంఖ్య 3.9 లక్షలు కాగా, 1295 మంది ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలం ఇప్పటికే జైలులో గడిపారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణయ్యర్ మాటల్ని గుర్తుచేసుకోవటం సముచితంగాఉంటుంది. జస్టిస్ కృష్ణయ్యర్‌ను నారిమన్ తన గ్రంథం ఇలా ఉటంకించారు. ప్రాథమిక నియమం బెయిల్ కానీ జైలు కాదు. అయితే న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకునే ప్రమాదం, నేరాలకు మళ్లీ పాల్పడటం లేదా సాక్షులను భయపెట్టడం లాంటి వాటి ద్వారా సమస్యలు సృష్టించే పరిస్థితుల్లో తప్ప చాలా కేసుల్లో డబ్బు స్యూరిటీ కాకుండా పిటిషనర్ బంధువులు లేదా అతడు చెందిన సంస్థ హామీ ఇవ్వటం మెరుగైనది, సామాజికంగా కూడా ప్రాసంగికమైనది. ప్రమోద్ సింగ్లా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా,ఇతరులు (2023) కేసులో ప్రివెంటివ్ డిటెన్షన్ కేసుల్లో న్యాయ విధాన అనుసరణలో ఎంత చిన్న తప్పుజరిగినా డిటెన్యూకు అనుకూలంగా సంశయ లాభం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చింది. జస్టిస్ లెర్నెడ్ హ్యాండ్ మాటల్లో స్వేచ్ఛ స్త్రీ పురుషుల హృదయాల్లో ఉంటుంది. అది అక్కడ మరణిస్తే ఏ రాజ్యాంగం, ఏ చట్టం, ఏకోర్టు దాన్ని కాపాడలేదు. ఏ రాజ్యాంగం, ఏ చట్టం, ఏ కోర్టు దానికి అంతగా సాయం చేయలేదు. ●

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై నీలినీడలు



రామ కిష్టయ్య సంగన భట్ల

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెలుగు రాష్ట్రాల్లో విద్యా రంగంలో ఒక పెద్ద సంస్కరణగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో 2008లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి దీన్ని ప్రవేశపెట్టారు. ప్రారంభంలో రెండు వేలకోట్ల రూపాయల వ్యయం ఉండగా, కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడం, కోర్సుల విస్తరణ జరగడం వల్ల ఇది ఏటా ఎనిమిది నుండి పది వేలకోట్ల వరకుచేరింది. ఈపథకం ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చదివే సుమారు ఇరవై లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇంజనీరింగ్ కళాశాలల్లోనే ఏడు నుండి ఎనిమిది లక్షల మంది విద్యార్థులు పూర్తిగా ఈ పథకం ఆధారంగానే చదువులు కొనసాగించారు. మొదట్లో ఇది సామాజిక సమానత్వానికి దారితీసే గొప్ప ఆలోచనగా నిలిచింది కానీ చెల్లింపులు ఆలస్యమవడం, బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం నుంచి సమయానికి నిధులు రాక విద్యాసంస్థలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యమయ్యాయి, లైబ్రరీలు, లాబ్‌లు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ దెబ్బతింది. నాణ్యత తగ్గిపోవడంతో పాటు అనేక కళాశాలలు మూతపడ్డాయి. గత దశాబ్దంలో రెండు వందలకు పైగా ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలు తలదాచుకోలేక మూసివేయబడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడివిడిగా అమలు చేసినప్పటికీ రెండు రాష్ట్రాల్లోనూ బకాయిలు వేల కోట్లలో పేరుకుపోయాయి.ఈ నేపథ్యంతో విద్యార్థుల ఆందోళనలు తెలంగాణలో మరింత ఉధృతమయ్యాయి. బకాయిలు సకాలంలో చెల్లించాలని, కాలేజీల ఆర్థిక సంక్షోభం పేరుతో విద్యార్థులు నష్టపోకూడదని విద్యార్థి సంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. కళాశాల యాజమాన్యాలకు కాకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు జమచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



దీనిపై తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. విద్యాసంస్థలకు కాకుండా నేరుగా విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోనే నిధులు జమ చేసే విధానం పరిశీలనలో ఉంది. దీనివల్ల డబ్బుల దుర్వినియోగం తగ్గి విద్యార్థులకే ప్రయోజనం నేరుగా అందుతుంది. అయితే ఇలాంటి విధానం అమలు చేయాలంటే విద్యార్థులు నిజంగా కళాశాలల్లో చేరారన్నది, వారు తరగతులు హాజరవుతున్నారన్నది, కోర్సులు కొనసాగిస్తున్నారన్నది కచ్చితంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఈ సదుపాయం కూడా లోపాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 9వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతుండగా, విద్యార్థులు విద్య కొనసాగించడానికి తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయి. ఫలితంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు చెల్లింపులు ఆలస్యమవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు సమయానికి పొందలేక నిరాశలో ఉన్నారు.నవంబర్ 1లోగా 8వేల కోట్లు ప్రభుత్వం ప్రకటించిన విధంగా చెల్లించకపోతే,3వ తేదీ నుండి కళాశాలలు మూసి వేస్తామని, మార్చి ఏప్రిల్ నెలలలో నిర్వాహించే పరీక్షలకు సహకరించేది లేదని ప్రైవేటుకళాశాలల యాజమాన్యాలు స్పష్టంచేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టడం అనివార్యం. ఈపరిస్థితిలో పరిష్కార మార్గాలు అత్యవసరంగా అవసరం.ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తగిన బడ్జెట్ కేటాయింపులు చేసి త్రైమాసికాల వారీగా నిధులు విడుదల చేయాలి. అర్హులైన విద్యార్థుల వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా ధృవీకరించి చెల్లింపులు జరగాలి. ప్రైవేట్ కళాశాలలు పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వీయ నిధులతో కొంత శాతం నిర్వహణ చేపట్టాలి.అదేవిధంగా విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నిధులు జమచేసే విధానం అమలులోకి వస్తే వారు నేరుగా లబ్ధిపొందే అవకాశం ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల భవిష్యత్తుకు ఒక శక్తివంతమైన సాధనం. కానీ సమయపాలన, పారదర్శకత, బాధ్యత లేకుంటే ఇది విద్యార్థులకే కాకుండా విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు, సమాజానికి నష్టాన్ని కలిగిస్తుంది. అందువల్ల దీన్ని రాజకీయ వాగ్దానాల పథకంగా కాకుండా విద్యారంగ అభివృద్ధి పునాదిగా పరిగణించి అమలు చేయాలి. అప్పుడే ప్రతి విద్యార్థి తన చదువును ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగించ గలుగుతాడు,ప్రతి విద్యాసంస్థ నిలదొక్కుకుంటుంది, సమాజం ముందుకు దూసుకుపోతుంది. ●

# జీవిత ఖైదుతో అవినీతి అంతం అయ్యేనా?

పూసాల సత్యనారాయణ

ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రజాప్రతి నిధులను ఎన్నుకునే విధానం ఎలాఉంది అంటే 'గొర్రెలమందకు తోడేలును కాపలపెట్టిన' చందంగా ఉంది. నేడు ప్రజలు ఓటు వేసే విధానం. ప్రభుత్వ ఉద్యోగులు సైతం పైసా లేకుండా నయాపైసాపని చేస్తే ఒట్టు. అవినీతి పరులు ప్రజల రక్తం తాగుతున్నారు.కాల్చిచంపే ఉగ్రవాదుల కన్న దేశద్రోహుల కన్న కరడు గట్టిన నేరస్థులు అంత్యంత ప్రమాదకరమైన క్రూరమృగాలు. లంచం తీసుకోకుండా గ్రామ సర్పంచి పని చేస్తాడా? ప్రభుత్వ ఉద్యోగిగాని ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగాని డిమాండ్ చేసినంత ముట్టచెప్పాల్సిందేనా?ఇంకెంతకాలం కొనసాగుతుంది? 'అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా' వర్ధిల్లుతున్నదంటే పవిత్ర భారత దేశంలో ఉన్న బూజుపట్టిన బలహీనమైన చట్టాలే కారణం. శతాబ్దాలు గడిచినా హై టెక్నాలజీ ఆకాశమంత ఎత్తుఎదిగి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్‌తో విన్యాసాలు చేసినా అవినీతిని కూకటి వేళ్ళతో పెకిలించి వారేరీ?సమాచార హక్కుచట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం ,అవినీతి అధికారులపై ఎక్కుపెట్టిన సత్పౌరుడెవ్వరు? ఉంటే 'పౌర రత్న'బిరుదుతో పాటు క్యాష్ అవార్డ్‌ఇచ్చి రాష్ట్రపతి గాని ప్రధాన మంత్రి గాని సన్మానం చేయాలి. అప్పుడే ప్రజలలో చైతన్యం కదలి అవినీతి కర్పూరంలా కరిగిపోతుంది.లోకపాల్,లోకాయుక్త ఉందని ప్రజలకు తెల్సా? ఏంటి కరప్షన్ బ్యూరో ఇంటెలిజెన్స్ బ్యూరో,సెంట్రల్ విజిలెన్స్ కమీషన్, దర్యాప్తు సంస్థలు నీతి నిజాయితీగా సమర్థవంతంగా స్వతంత్రంగా పని చేస్తున్నాయా? సిగ్గులేని అవినీతి అధికారులను నిగ్గ తీసి ప్రశ్నించాలి. మలినమైన మనుషులను నిప్పుకణికలతో కడగాలి. తెగించి కొట్లాడే దమ్ము,ధైర్యం ఉన్నబాహుబలి మనిషి ఉంటే ఒట్టు. 54 శాతం మంది భారతీయులు లంచం చెల్లించి పని చేయించుకొని చేతులు దులుపుకొని జారుకుంటున్నారు. ఇది కూడా ఒక నేరమేకదా! ఆర్థిక వ్యవస్థకు అవినీతి క్యాన్సర్‌గా అవతారమెత్తితేమనిషి బతికి బట్ట కట్టగలడా !180 దేశాలలో భారత దేశం అవినీతిలో 96 స్థానంలో తళతళ మెరుస్తుంది.ఇది అసమర్థత పాలనకు నిలువెత్తు నిదర్శనం కాదా! సమాజంలో అసమానతలను కాలుష్యంలా పెంచే ఈసంస్కృతి మనకెందుకు? 542 మంది పార్లమెంట్ సభ్యులలో 220 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. నేరం రుజువైన వారిని జైలు నుండి బెయిల్ పై వచ్చిన వారిని పోటీ చేయుటకు అర్హత లేకుండా చట్టాలు ఎందుకు చేయడం లేదు.? ప్రశ్న ప్రశ్నగానే నిలిచి పోవాలా?ఫిన్‌లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, స్వీడన్, ఆస్ట్రేలియా, దేశాలలో అవినీతి అంతం ప్రభుత్వ పంతం. కఠిన చట్టాలతో కొరడా ఝుళిపించి నిర్దాక్షిణ్యంగా కటకటాలకు నెట్టుతున్నారు. బలమైన చట్టాలతో బలాదూర్ అంటూ అని గల్లా ఎగరేసిగర్వపడుతున్నారు.అక్కడ ఆర్థిక వ్యవస్థ చిగురులు తొడిగి దీపావళి పండుగ చేసుకొంటుంది. ఇటీవల చైనాలో జరిగిన సంఘటన అవినీతి పరులగుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేసింది. ప్రపంచదేశాలకు షాక్ ఇచ్చింది.మాజీ వ్యవసాయ గ్రామీణ వ్యవహారాల శాఖా మంత్రి టాంగ్ రెన్ జియాన్' దాదాపు 337 కోట్ల అవినీతి ఉచ్చులో చిక్కుకొని నేరం రుజువైనందుకు ఆయనకు కోర్టుమరణ శిక్షవిధించింది. ఆయన పశ్చాత్తాపపడి కోర్టు విచారణకు సంపూర్ణంగా సహకరించినందులకు అక్రమంగా సంపాదించిన ఆస్తులను సొమ్మును స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పచెప్పినందులకు ఆయన మరణ శిక్షను రద్దుచేస్తూ రెండేళ్ల పాటు జైలుశిక్ష విధించినట్లు జిలిన్ ప్రావిన్స్‌లోని 'చంగ్ చున్ పీపుల్స్' కోర్టు తీర్పు వెలువరించింది.ఐతే ఉరి లేకుంటే జీవిత ఖైదీ. న్యాయ వ్యవస్థ లో అనకొండ ప్రవేశించింది. రేపిస్ట్ భూకబ్జాదారు ఆర్థిక నేరస్థుడు డేరా బాబాకు 40 రోజులు పెరోల్ 5సంవత్సరాల్లో 14వసారి పెరోల్ ఇవ్వడం ఏంటి? లోకం చుట్టిన వీరుడు ప్రధాని మోడీగారు. తన వాక్చాతుర్యంతో అత్యున్నత బిరుదులు అందుకొని భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పివారు. గ్లోబల్ లీడర్‌గా మొదటి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించడం భారతీయులందరికీ గర్వకారణం. ప్రధాని మోడీ గారికి "క్షణం తీరిక లేదు రూపాయి ఆదాయం లేదు ఇంటగెలిచింది లేదు గానిబయట రచ్చరచ్చ చేస్తున్నారు. పారిశ్రామిక దిగ్గజాలకు కోట్ల రుపాయలు రుణ మాఫీ చేయడం, బాంక్ ఖాతాలో మినిమం బ్యాలెన్స్ ఉంచే స్థోమత లేని పేదల నుండికోట్లు వసూల్ చేయడం న్యాయమేనా? ఓట్ చోరీతో అధికారంలోకి అడుగు పెట్టాడనే ఆరోపణ కొట్టి పడెయ్యలేము. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్‌గారి మాటలు గుర్తుకు వస్తాయి." సిరా చుక్క మౌనం వహిస్తే మద్యం చుక్క రాజ్యంఏలుతుంది. మేధావులు మౌనం వహించినంత కాలం మూర్ఖులు రాజ్యం ఏలుతారు 'ఇప్పుడు అదే జరుగుతుంది. దేశ సంపద కొంత మంది చేతిలోకి పోతే ఆర్థిక క్రమశిక్షణ ఆగమైంది.అందుకే కేంద్రప్రభుత్వం 200 లక్షల కోట్లు అప్పు చేసింది.కాకులను కొట్టి గద్దలకు వేయడం అంటే ఇదేనేమో! కేంద్రంతో దోస్తీ చేస్తేనే కేంద్ర నిధులు అందుతాయా ! కేంద్రానికే జాతీయ గీతం ఉందా?ప్రజాస్వామ్యంలో పక్షపాత వైఖరి రాజ్యాంగ విరుద్ధం కాదా! కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలలో అవినీతి తీవ్ర స్థాయిలో ఉన్నట్లు సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. నీతి నిజాయితీ మానవీయ విలువలు పాఠశాల కళాశాల స్థాయిలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. అవినీతి నిర్మూలన చట్టాల మీద సదస్సులు సమావేశాలు నిర్వహించాలి. నిజాయితీ గలవారికి అవార్డ్ ఇచ్చి ప్రోత్సహించాలి.అధికారులలో జవాబుదారీతనం ఉండాలి.పారదర్శకత పెరగాలి. డిజిటల్ టెక్నాలజీ వినియోగించి అవినీతిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని చట్టసభలలో అడుగు పెట్టనీయకూడదు. అవినీతి రుజువైతే అక్రమార్జన సొమ్ము ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని జీవిత ఖైదీ శిక్షవిధించితే అవినీతి అడ్రస్ లేకుండాపోతుందనిసామాన్య మానవుడు అనుకోవడంలో తప్పులేదు.ఆర్థికంగాబలపడితేనే దేశం అన్ని కోణాలలో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.ఆ రోజులు తప్పని సరిగా వస్తాయని ఆశిద్దాం. ●

# బంగ్లా మ్యాప్‌లో భారత్ భూభాగాలు!

## వివాదాస్పద మ్యాప్‌ను పాక్ ఆర్మీచీఫ్‌కు అందించిన యూనస్



**ఢాకా, అక్టోబరు 27:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ మరోసారి భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌లో అంతర్భాగంగా చూపిస్తున్న ఒక వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్తాన్ ఆర్మీ ఉన్నతాధికారికి ఆయన బహుమతిగా ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్య ద్వారా భారత్ సార్వభౌమత్వాన్ని యూనస్ పరోక్షంగా ప్రశ్నించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పాకిస్తాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా ఢాకాలో పర్యటించారు. యూనస్‌తో భేటీ తర్వాత, యూనస్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతాలో కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. వాటిలో, పాక్ జనరల్‌కు ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్ అనే పుస్తకాన్ని బహుమతిగా ఇస్తున్న చిత్రం ఉంది. అయితే, ఆ పుస్తకం ముఖచిత్రంపై ఉన్న మ్యాప్‌లో భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ భూభాగంలో కలిపి చూపించారు. ఇది తీవ్రవాద ఇస్లామిక్ సంస్థలు కోరుతున్న గ్రేటర్ బంగ్లాదేశ్ వాదనకు బలం చేకూర్చేలా ఉంది. ఈ ఫొటో బయటకు రావడంతో సోషల్ మీడియాలో యూనస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనవసరంగా భారత్ అంతర్గత విషయాల్లోకి ప్రవేశిస్తున్నారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అయితే ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 1971 విమోచన యుద్ధం తర్వాత చారిత్రాత్మకంగా దెబ్బతిన్న బంగ్లాదేశ్‌పాకిస్తాన్ సంబంధాలను, యూనస్ అధికారంలోకి వచ్చాక మెరుగు పడుతున్నాయనడానికి ఈ భేటీ నిదర్శనంగా నిలుస్తోంది. యూనస్ భారత్ ఈశాన్య రాష్ట్రాల గురించి మాట్లాడటం ఇది మొదటిసారి కాదు. గత ఏప్రిల్‌లో చైనా పర్యటనకు వెళ్లినప్పుడు, "భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలు. సముద్రానికి చేరుకోవడానికి వాటికి మార్గం లేదు. ఆ ప్రాంతానికి సముద్ర సంరక్షకులం మేమే అని వ్యాఖ్యానించి ఢిల్లీకి ఆగ్రహం తెప్పించారు. చైనా తన ఆర్థిక కార్యకలాపాలను ఈ ప్రాంతంలో విస్తరించుకోవడానికి ఇది మంచి అవకాశమని ఆయన సూచించారు. యూనస్ వ్యాఖ్యల తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. బంగ్లాదేశ్ వస్తువులు భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్‌లకు వెళ్లేందుకు వీలు కల్పించే రవాణా ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. దీనికితోడు, యూనస్ సన్నిహితులు కూడా గతంలో 'గ్రేటర్ బంగ్లాదేశ్' మ్యాప్‌లను సోషల్ మీడియాలో షేర్ చేయడం, భారత్‌పైరెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటివి చేశారు. వరుస ఘటనలపై యూనస్ మౌనంగా ఉండటం, ఇప్పుడు స్వయంగా వివాదాస్పద మ్యాప్‌ను బహుమతిగా ఇవ్వడం చూస్తుంటే.. చైనా, పాకిస్తాన్ మద్దతుతో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలను మార్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని అంతర్జాతీయ సంబంధాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# మీకుటుంబంలో ఒకడిగా చూడండి!

## మృతుల కుటుంబాలను క్షమించమని కోరిన టివికె చీఫ్ విజయ్



**మహాబలిపురం, అక్టోబరు 27:** తమిళనాడు కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతుల కుటుంబాలను కలిసారు. వీరికోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రిసార్టును బుక్‌చేసారు. ప్రతి కుటుంబానికి ఒక సూట్ చొప్పున బుక్‌చేసినటివికె పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమం మొత్తం సజావుగా సాగేటట్లు పర్యవేక్షించారు. భద్రతా కారణాల రీత్యా ఎక్కువమందిని మీడియాప్రతినిధులను కూడా అనుమతించలేదు. మీ కుటుంబంలో ఒకడిగా చూడాలని, ఏంసమస్య వచ్చినా తాను అండగా ఉంటానని టివికె చీఫ్ విజయ్ ఈసందర్భంగా మృతుల కుటుంబాల్లో భరోసా నింపారు. జరిగిన సంఘటన విషాదాంతమని ఈఘోరంపై తన ప్రమేయం లేకున్నా అందరూ క్షమించాలని నటుడు విజయ్ వారిని కోరారని పార్టీ నేతలు వెల్లడించారు. మహాబలిపురం లోని ఓ రిసార్ట్‌లో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. ప్రతికుటుంబాన్ని ఆయన ఆప్యాయంగా పలకరించారు. మృతులకు చెందిన 37 కుటుంబాలతో సహా 200 మందితో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ కోసం టీవీకే దాదాపు 50 రూమ్స్‌ను బుక్ చేసింది. కరూర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు తరలించారు. అక్కడ వారితో విజయ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతీ కుటుంబం నుంచి నాలుగు నుండి ఐదుగురు వ్యక్తులు విజయ్‌ను కలవడానికి వచ్చారు. ప్రతి ఒక్కరినీ విజయ్ వ్యక్తిగతంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఈ భేటీకి మీడియా సహా ఇతరులను అనుమతించలేదు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించిన విజయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఇక మృతుల కుటుంబాలకు టీవీకే ఆర్థిక సాయంగా రూ.20 లక్షలు అందజేసిన విషయం తెలిసిందే.

# డంకీరూటులో అమెరికాకువెళ్లి పట్టుబడిన భారతీయులు!



**కర్నాల్, అక్టోబరు 27:** అమెరికాలో అడుగుపెట్టి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకున్న హర్యానా యువకుల కలలు కల్లలయ్యాయి. అక్రమంగా డంకీ మార్గంలో దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన సుమారు 50 మంది యువకులను అమెరికా అధికారులు అరెస్ట్ చేసి, బేడీలతో భారత్‌కు తిప్పి పంపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ఈ యువకులంతా హర్యానాలోని జింద్, కైథల్ జిల్లాలకు చెందిన వారు. ఈ ఘటనలో బాధితుడైన కైథల్ జిల్లాకు చెందిన నరేశ్ కుమార్ అనే యువకుడు తన ఆవేదనను మీడియా ముందు వెల్లడించాడు. వ్యవసాయ భూమిని అమ్మి ఓ ఏజెంట్‌కు రూ. 57 లక్షలు ఇచ్చాను. పనామా అడవుల గుండా అమెరికాకు పంపిస్తానని చెప్పాడు. కానీ, సరిహద్దు దాటుతున్నప్పుడు నన్ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. 14 నెలల తర్వాత బేడీలతో వెనక్కి పంపారని నరేశ్ వాపోయాడు. ఏజెంట్ తన నుంచి పలు దఫాలుగా డబ్బులు గుంజినట్లు తెలిపాడు. మొదట రూ. 42 లక్షలు తీసుకున్నాడు. గ్వాటెమాలలో రూ. 6 లక్షలు, మెక్సికోలో మరో రూ. 6 లక్షలు, సరిహద్దు దాటే ముందు మిగిలిన మొత్తాన్ని తీసుకున్నాడు. కానీ, నన్ను సురక్షితంగా అమెరికా చేర్చకుండా జైలు పాలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను మోసం చేసిన ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత ఎవరూ డంకీ మార్గాన్ని ఎంచుకోవద్దని విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటనపై కైథల్ ఎస్పీ ఉపాసన మాట్లాడుతూ, అమెరికా నుంచి బహిష్కరణకు గురైన యువకులను వారి కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపారు. వారి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారిలో ఒకరికి నేరచరిత్ర ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. జింద్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులను కూడా ఇలాగే వెనక్కి పంపారని ఎస్పీ కుల్దీప్ సింగ్ వెల్లడించారు. డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లడం తీవ్రమైన నేరం. ఇది మన సమాజ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. ఇలాంటి అక్రమ ప్రయాణాలు ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా, ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చిపెడతాయి. అనేక సందర్భాల్లో యువకులు శారీరక వేధింపులు, మోసాలు, చివరికి మరణాన్ని కూడా ఎదుర్కొంటున్నారని జింద్ ఎస్పీ కుల్దీప్ సింగ్ హెచ్చరించారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు చట్టబద్ధమైన మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని ఆయన సూచించారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వాణిజ్య ఒప్పందం దిశగా భారత్ - అమెరికా చర్చలు



- ఆసియాన్ సదస్సు వేదికగా సమాలోచనలు
- మార్కో రూబియోతో జైశంకర్ సమావేశం
- అటు యూఎస్‌లో జీన్ షాహీన్‌తో భారత్ రాయబారి భేటీ
- వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడి

**కౌలాలంపూర్, అక్టోబరు 27:** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. భారత్ వస్తువులపై అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి రెండు వైపులా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథనయంలో మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్ విదేశాంగ మంత్రి, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కీలక చర్చలు జరిపారు. మలేసియా వేదికగా ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాలు జరుగు తున్నాయి. ఈ సమావేశాలకు ప్రధాని మోడీ గైర్హాజరయ్యారు.

మోడీ తరఫున భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మలేసియాకు వెళ్లారు. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను జైశంకర్ కలిశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు, ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై జైశంకర్- రూబియో చర్చించారు. ఈ మేరకు జై శంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు."ఈ ఉదయం కౌలాలంపూర్‌లో రూబియోని కల వడం ఆనందంగా ఉంది. ద్వైపాక్షిక సంబం ధాలతోపాటు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చలు జరిగాయి" అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కీలక చర్చలు జరిగినట్లుగా పేర్కొన్నారు. ఇంబంధించిన ఫొటోలను కూడా పంచుకున్నారు. ఆదివారం జైశంకర్ మలేసియా ప్రధానమంనరతి అన్వర్ ఇబ్రహీం, సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రి సిహాసక్ ఫువాంగ్కెట్కియోలతో విడివిడిగా చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ర్యాంకింగ్ సభ్యురాలు జీన్ షాహీన్ సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా పరస్పరం ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం, ఇంధన భద్రత, చమురు, గ్యాస్ వాణిజ్యం గురించి చర్చించారు. ఇరు దేశాలకు సంబంధించిన కీలక చర్చలు జరిగినట్లుగా వినయ్ మోహన్ క్వానరాతా ఎక్స్‌లో తెలిపారు.

ఈ సందర్భంగా రష్యా- ఉక్రెయిన్ వివాదంపై భారత ప్రధాని మోడీ వైఖరిని రాయబారి క్వాత్రా స్పష్టంగా తెలియజేశారు.

మరోవైపు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు బాగా పురోగమిస్తున్నాయని, రెండు వైపులా చాలా అంశాలపై కమ్యూనికేట్ అవుతున్నాయని, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం ఆసన్నమైందని సూచించారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మనం చాలా దగ్గరగా ఉన్నట్లు భావిస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సుదీర్ఘంగా సాగుతున్నాయి. భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశ కోసం ఇప్పటి వరకు ఐదు రౌండ్ల చర్చలు పూర్తయ్యాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ముగింపునకు చాలా దగ్గరగా ఉంది. భారత్‌పై తొలుత 25శాతం సుంకాన్ని ట్రంప్ వేశారు. అనంతరం రష్యాతో సంబంధాలు పెట్టుకున్నందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధించారు.

ఇలా మొత్తంగా భారత్‌పై 50శాతం సుంకం పడింది. అయితే రష్యాతో సంబంధాలు తెంచుకుంటే సుంకాలు తగ్గిస్తామని అమెరికా అంటోంది.

ప్రస్తుతం రష్యా దగ్గర చమురు కొనుగోలు తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది.

## పాక్- అఫ్ఘాన్ సమస్య పరిష్కరిస్తా

# మధ్యవర్తిత్వానికి సిద్ధం

## ఆసియాన్ సదస్సులో ట్రంప్



**కౌలాలంపూర్, అక్టోబరు 27:** పాకిస్థాన్- అఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని తానే పరిష్కరిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకొచ్చారు. మలేషియాలో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య మళ్లీ వివాదం మొదలైందని విన్నాను. కానీ నేను దాన్ని చాలా త్వరగా పరిష్కరిస్తాను. వాళ్లిద్దరూ నాకు తెలుసు. మధ్యవర్తిత్వం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా అని వ్యాఖ్యానించారు. వివాదాలను పరిష్కరించడం తనకు బాగా చేతనైన పని అని, దీని ద్వారా లక్షలాది ప్రాణాలను కాపాడగలనని ట్రంప్ చెప్పుకొచ్చారు. గతంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడంలో తానే కీలకపాత్ర పోషించానని ట్రంప్ మళీ పాత పాటే పాడారు. ఇస్తాంబుల్ వేదికగా పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియాన్ సదస్సులో ప్రసంగించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జపాన్ బయలుదేరి వెళ్లారు. టోక్యోలో ట్రంప్‌కు ఘనస్వాగతం లభించింది. జపాన్ ప్రధానమంత్రి సనాయి తకాచితో సమావేశమై, ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపనున్నారు. అనంతరం జపాన్- అమెరికా సదస్సులో పాల్గొననున్నారు.

# షూవిసిరిన లాయర్‌పై ధిక్కార చర్యలకు సుప్రీం నో!



**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఇటీవల షూ విసిరేందుకు ప్రయత్నించిన లాయర్‌పై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టేందుకు అనుమతించేది లేదని సుప్రీంకోర్టు సోమవారం నాడు పేర్కొంది. ఈ విషయంపై సీజేఐ ఎలాంటి కేసు నమోదు చేయలేదని, లాయర్‌పై చర్యలు తీసుకోవడానికి సీజేఐ విముఖత చూపించారని తెలిపింది. లాయర్‌పై కోర్టు ధిక్కారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కోర్టు ధిక్కార నోటీసు జారీ చేయడం వల్ల సీజేఐపై షూ విసిరిన లాయర్‌కు అనవసర ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుందని, ఈ ఘటన దానంతటదే సద్దుమణుగుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన ఒక కేసులో సీజేఐ వ్యాఖ్యలకు నిరసనగా రాకేష్ కిషోర్ అనే అడ్వకేట్ ఈనెల 6న ఆయనపై షూ విసిరేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది అతన్ని అడ్డుకుని బయటకు పంపారు. సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదంటూ రాకేష్ కిషోర్ నినాదాలు చేశారు. కోర్టులో నినాదాలు చేయడం, షూ విసిరడం కోర్టు ధిక్కారణ కిందకు వస్తుందని, అయితే దీనిపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లడం అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తామని కూడా తెలిపింది.

# డిజిటల్ అరెస్టు.. అత్యంత భయంకర ముప్పు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన



**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదరింపులకు గురిచేస్తూ.. భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపిఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు విడియో కాల్స్ చేసి.. తాము పోలీసులమని బెదరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయ పెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

# షట్‌డౌన్‌తో 8 వేల విమానసర్వీసులకు ఎఫెక్ట్

## అమెరికాలో తీవ్రమవుతున్న రవాణా సమస్యలు



**వాషింగ్టన్,అక్టోబరు 27:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి విమాన సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ షట్‌డౌన్‌తో వేల సంఖ్యలో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఈ షట్‌డౌన్‌తో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడం లేదు. ఇది విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానాశ్రయాల్లో దాదాపు 8 వేలకుపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పలు విమానాలు రద్దైనట్లు తెలిసింది. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా చాలా చోట్ల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడంలేదు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడింది. లాస్‌ఏంజిల్స్, కాలిఫోర్నియా, చికాగో, వాషింగ్టన్, న్యూజెర్సీలోని నెవార్క్ తదితర ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఉన్నట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) తెలిపింది. ఫలితంగా దాదాపు 8వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు రానున్న రోజుల్లో సిబ్బంది కొరత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అమెరికా రవాణా మంత్రి శాన్ డఫీ వెల్లడించారు. దీంతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత ఎక్కువగా ఉండొచ్చని పేర్కొన్నారు. విమానాల ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఉద్యోగి కాకుండానే అధికారి భార్యకు రెండేళ్లుగా జీతం

## రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చిన ఐటిడైరెక్టర్ నిర్వాకం



**జైపూర్, అక్టోబరు 27:** ఆమె అసలు సాఫ్ట్ వేర్ ఉద్యోగియే కాదు. అయినా రెండు టెక్ కంపెనీల్లో జాబ్. ఒక్క రోజు కూడా ఆఫీస్‌కు వెళ్లలేదు. అయినా ప్రతినెల ఠంచనుగా ఆమె అకౌంట్లలో జీతం పడించింది. ఇలా ఇంట్లో కూర్చునే రెండేండ్లలో ఏకంగా రూ.37 లక్షల 54 వేలు సంపాదించింది. ఇంజినీరింగ్, డిగ్రీ పట్టాలు ఉన్నా ఉద్యోగం ఎలా సంపాదించాలని చాలామంది నెలల తరబడి కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉంటారు.. అయినా ఆమె రెండు ఉద్యోగాలు ఎలా సంపాదించారనుకుంటున్నారా అంటే ఆమె భర్త రాజస్థాన్ ప్రభుత్వ ఐటీ శాఖలో డైరెక్టర్ కావడమే. ప్రద్యుమ్న దీక్షిత్ అనే వ్యక్తి రాజస్థాన్ ప్రభుత్వ రాజ్‌కాంప్ ఇన్ఫో సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఒరియన్‌ప్రో సొల్యూషన్స్, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంస్థలకు ప్రభుత్వ టెండర్లు దక్కేలా దీక్షిత్ చేశాడు. ప్రతిగా తన భార్య పూనమ్ దీక్షిత్‌కు ఉద్యోగం ఇవ్వాలని రెండు కంపెనీలను డిమాండ్ చేశాడు. ప్రతి నెల జీతం చెల్లించాలని ప్రతిపాదించాడు. దీంతో ఒరియన్‌ప్రో కంపెనీలో ఉద్యోగిగా, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రీలాన్సింగ్ చేస్తున్నట్లుగా నకిలీ పత్రాలు సృష్టించాడు. ప్రతి నెలా అతడే నకిలీ అటెండెన్స్ సమర్పించేవాడు. ఇలా 2019 జనవరి నుంచి 2020 సెప్టెంబర్ వరకు పూనమ్ దీక్షిత్‌కు చెందిన వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లలో జీతం రూపంలో రూ.37,54,405 జమ అయ్యాయి. ఇలా పెద్దమొత్తంలో లంచంగా సంపాదించాడు. ఈ తంతంగంపై రాజస్థాన్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీంతో న్యాయస్థానం ఏసీబీ విచారణకు ఆదేశించింది. అధికారుల దర్యాప్తులో భాగంగా ప్రద్యుమ్న దీక్షిత్ నకిలీ ఉద్యోగం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# సంక్షిప్తంగా..

## బాలీవుడ్ యువ నటుడు సచిన్ ఆత్మహత్య



**ముంబై, అక్టోబరు 27:** బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. యువ నటుడు సచిన్ చాంద్‌వడే (25) ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. ఈ ఘటన కొన్ని రోజుల క్రితం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలో ఉందిర్‌ఖేడ్‌లోని తన ఇంట్లో ఈ నెల 23న ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో.. మరుసటిరోజు ఇంకో ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకున్నా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూనే సచిన్ ఈ నెల 24న మృతి చెందినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణం తెలియాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన సచిన్.. నటన పై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి వచ్చారు. 'జాంతాఢా 2' వెబ్‌సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు.

## బ్రిటన్‌లో మరో సిక్కు యువతిపై లైంగిక దాడి


**లండన్, అక్టోబరు 27:** బ్రిటన్‌లో భారతీయ మూలాలున్న మహిళలపై జాత్యహంకార ప్రేరేపిత లైంగిక దాడులు పెరుగుతున్నాయి. గత నెలలో సిక్కు మహిళపై జరిగిన దారుణ ఘటన మరవక ముందే తాజాగా మరో 20 ఏళ్ల భారతీయ యువతిపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. పశ్చిమ మిడ్‌లాండ్‌లోని వాల్సల్ ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకోగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. యూకే కాలమానం ప్రకారం శనివారం రోజు సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగిన రోజే వాల్సల్ ప్రాంతంలో ఒక యువతిపై లైంగిక దాడి జరిగినట్లు వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆపై దర్యాప్తు చేపట్టారు.

## మరణశిక్ష విధించినా సమ్మతమే :దర్శన్ తరపు న్యాయవాది



**బెంగళూరు, అక్టోబరు 27:** చిత్రదుర్గకు చెందిన రేణుకాచార్య హత్య కేసులో నిందితుడు దర్శన్‌పై ఉన్న ఆరోపణలపై విచారణ పూర్తి చేసి, మరణశిక్ష విధించినా సమ్మతమేనని ఆయన తరఫు న్యాయవాది సునీల్ ఉన్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కారాగారంలో ఖైదీలకు ఇవ్వవలసిన కనీస సదుపాయాలను దర్శన్‌కు కల్పించలేదని వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 20 సార్లు బెయిలుకు అర్జీ వేసుకున్నా పరిగణనలోకి తీసుకోలేదని, కనీస సదుపాయాలు కల్పించాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. విచారణ త్వరగా పూర్తి చేస్తే దానికి అనుగుణంగా శిక్షను అనుభవించేందుకు దర్శన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. వెన్నునొప్పి సమస్య తిరగబెట్టిందని, తనకు సైనేడ్ ఇస్తే తిని ఆత్మహత్య చేసుకుంటానని దర్శన్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

## ఢిల్లీలో పెరుగుతున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం రోజు రోజుకు పెరుగుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ, ఎన్‌సిఆర్ ప్రాంతం వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణేశ్‌పూర్ వద్ద 318, జిటిబి నగర్‌లో 302, కశ్మీర్‌గేట్ ఐఎస్‌బిటి ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఎక్యూఐ నమోదైంది.

## తోబుట్టువుల అశ్లీల చిత్రాలతో బెదరింపులు: యువకుడి ఆత్మహత్య

**హర్యానా, అక్టోబర్ 27:** సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ఓ యువకుడు బలయ్యాడు. తన తోబుట్టువులకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు పంపించి డబ్బులు డిమాండ్ చేయడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫరీదాబాద్‌కు చెందిన రాహుల్ భారతి (19) అనే యువకుడికి రెండు వారాల క్రితం సైబర్ నేరగాళ్లు పలు చిత్రాలు పంపారు.

అందులో అతడి ముగ్గురు తోబుట్టువుల చిత్రాలు మార్ఫింగ్ చేసి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. నాటి నుంచి సైబర్ నేరగాళ్లు అతడికి పలుమార్లు కాల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# శివనామ స్మరణ తో కళకళలాడిన శివాలయాలు

**ఆగిరిపల్లి అక్టోబర్ 27. ప్రభాతవార్త :** కార్తీక మాస మొదటి సోమవారం పురస్కరించుకొనిమండలంలోని ఆలయాలకు భక్తుల శివనామ స్మరణతో కళకళలాడాయి. స్థానిక శోభనగిరిపై శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో, బస్టాండ్ వద్దగల గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర దేవాలయంలో,వరాహ పుష్కరిణి సమీపంలో గల శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో వేకువజాము నుండి మహాన్యాస పూర్వక రుద్ర అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించడం జరిగింది. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారినిదర్శించుకున్నారు.



పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు


## 83తుఫాను సహాయక కేంద్రాలు ఏర్పాటు.

**ఏలూరు, అక్టోబర్, 27 : ప్రభాతవార్త :** 'మొంథా' పెను తుఫాన్ ఈనెల 28వ తేదీ రాత్రిలోగా మచిలీపట్టణం-కళింగపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ సమయంలో తీవ్రమైన వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి మరియు తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో జిల్లా యంత్రాంగం తీసుకున్న తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ లతో కలిసి తెలియజేసారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకున్నదన్నారు. ముంపు ప్రాంతాలలోని ప్రజలను తరలించేందుకు 82 తుఫాన్ సహాయక కేంద్రాలను గుర్తించడం జరిగిందని, వాటిలో కలిదిండి లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి 42 కుటుంబాలను తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులు సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని, వాటిలో 129 మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. వీటి వద్ద సిబ్బందిని ఏర్పాటుచేసి, ప్రమాదానికి మించి నీటి ప్రవాహం వస్తే గండి కోట్లే చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో



పెనుగాలులు వీచే అవకాశం ఉన్న దృష్ట్యా జిలాల్లో 763 హోర్డింగ్లు తొలగించడం జరిగిందన్నారు. తుఫాన్ ముంపు గ్రామాలలో 100 మంది గజఈతగాళ్లను సిద్ధం చేశామని, 123 మంది గర్భిణీలను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. 11 లంక గ్రామంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కల్వర్టులు, కాజ్ వే ల వద్ద రెవిన్యూ, పోలీస్ సిబ్బందిని పహారా ఉంచామన్నారు. తుఫాన్ సమయంలో చెట్లు కూలిపోయిన కారణంగా రవాణా వ్యవస్థకు ఎటువంటి ఇబ్బందిలేకుండా ఉండేలా చెట్లు తొలగించేందుకు చెట్లు కట్ చేసే యంత్రాలు, జెసిబి లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిలాల్లో శిధిలావస్థలో ఉన్న భవనాలు, పూరిళ్లు 7279 గా గుర్తించడం జరిగిందని, వాటిలో ప్రజలను తుఫాన్ ప్రమాదం తగ్గే వరకు వారి బంధువుల ఇళ్లకు గాని, లేదా ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక కేంద్రాలకు రావలసిందిగా కోరడం జరిగిందన్నారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు

7వ పేజీలో



# తుఫాన్.. తుఫాన్.. తుఫాన్

- తీర గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు పర్యటన
- నిత్యవసర వస్తువులు పంపిణీకి సర్వం సిద్ధం
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- పలుచోట్ల సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- 24 గంటల నుంచి కురుస్తున్న వర్షం



**ప్రభాతవార్త నరసాపురం :** తుఫాన్ ప్రభావిత ప్రాంతంలో అధికారులు ప్రత్యేక అధికారులు కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లు అటు ఏలూరు ఇటు పశ్చిమ జిల్లాలో గత రెండు రోజుల నుండి పర్యటిస్తూ అవసరమైన చర్యలను చేపట్టారు. నరసాపురం పాలకొల్లు భీమవరం ప్రాంతాలలో సోమవారం ఉదయం ఏడు గంటలకు మొదలైన వర్షం సాధారణ స్థాయి నుండి భారీగా మారి కురుస్తూనే ఉంది. తుఫాను తీవ్రత తప్పదని రైతులు గ్రహించారు. సార్వా వరి పంటపై ఆశలు వదులుకున్నారు. గత వారంలో కురిసిన దాదాపు 20 నుండి 25 సెంటీమీటర్ల వర్షపాతం ఇంకా తగ్గక ముందే తిరిగి మొందా తుఫాను రావడంతో పట్టణ గ్రామీణ ప్రాంతాలలో రహదారులు మరింత దారుణంగా మారాయి. పారిశుధ్య పరిస్థితి మరీ హీనంగా తయారైంది. మంగళవారం బుధవారాలకు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయం భయంగా తుఫాను బీభత్సాన్ని ఊహించుకుని భీతితో ఉన్నారు. సోమవారం నుండి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పనులు నిలిచిపోయాయి. గత వారం నుండి కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. ముసురు ముంపు తుఫాను మధ్యతరగతి బతుకులను ఏ గట్టుకు చేరుస్తుందని భయపడుతున్నారు. అసలే పనులు అంతంత మాత్రం. ఉన్న కొద్దిపాటి పనులు చేసుకునేందుకు కూడా వాతావరణం కలిసి రాకపోవడంతో ఆర్థిక పరిస్థితి ఘోరంగా మారింది. మొందా ఏ మేరకు



నాయకర్ పర్యటన

ముంచుతుందోనని భయపడుతున్నారు. ఆక్వా రైతులు చెరువు గట్లు తెగిపోకుండా కాపాడుకునేందుకు నాన తంటాలు పడుతున్నారు. 300 నుండి పైకి గల కౌంట్ రొయ్యలు అప్పుడే సెలవు తీసుకున్నాయి. ముసురు రొయ్య రైతులు ముంచేసింది. ఏ నష్టం ముందుందో ఏ కష్టం దాగుందో బ్రతుకులు ఎలా తెల్లారుతాయోనని అదిరిపోతున్నారు.

# భక్తులతో పోటెత్తిన శివాలయాలు

**అత్తిలి -అక్టోబర్ 27( ప్రభాత వార్త ):**కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా అత్తిలి మండలంలోని శివాలయాలు భక్తులతో కిట కిట లాడా యి.తెల్లవారుజామున భక్తులు శివాలయాలను దర్శించి కార్తీకదీపాలను వెలిగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్తిలిలో ప్రసిద్ధి చెందిన ఉమా సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి కాశీ ఆధ్వర్యంలో రాజశేఖర్ శర్మ తదితరులు అభిషేకాలు జరిపారు. భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక బారికేడ్లు నిర్మించారు.



# మా జీవితాల్లో కొత్త వెలుగును ప్రసాదించారు.....

## మంత్రి రామానాయుడును సన్మానించిన డీఎస్సీ ఉపాధ్యాయులు.



**పాలకొల్లు ప్రభాతవార్త:** మా జీవితాల్లో కొత్త వెలుగును ప్రసాదించారని..... మీ వల్లే మేమంతా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించామని, మాకు కనిపించే దేవుడు మీరేనంటూ జీవితాంతం రుణపడి ఉంటామంటూ మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 40 మంది ఉపాధ్యాయులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను మంత్రి రామానాయుడు సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా తమ రామానాయుడు ను ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనకు పాట రూపంలో కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ముందుగా మంత్రి అందరితో కలిసి కేక్ కట్ చేయించి స్వయంగా తినిపించారు. బాణాసంచా కాల్చారు. ఉద్యోగలు పొందిన ఉపాధ్యాయులంతా తమ కుటుంబ సభ్యులతో సహా వచ్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గం లో మంత్రి రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 133 రోజులు 600 మందికి %ఉచిత కోచింగ్ నిర్వహించారన్నారు. దాదాపు సుమారు రెండు కోట్లు ఖర్చుపెట్టి డీఎస్సీ కోచింగ్ లో అభ్యర్ధులకు అన్ని సదుపాయాలు సమకూర్చడంతోపాటు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించారు. రోజంతా టిఫిన్, భోజనాలు, బాదంపాలు వంటివి ఏర్పాటు చేశారు. రోజువారీ పరీక్షలతో పాటు గ్రాండ్ పరీక్షలో నిర్వహించి రామంతా డీఎస్సీలో విజయం సాధించేలా మార్గం చూపించారు. అందువల్లనే ఒక పాలకొల్లు నియోజకవర్గంలోనే 40 మంది వరకు ఉద్యోగాలు సాధించామని ఇది ఒక చరిత్ర అన్నారు. ఇదొక్కటే కాదు.



మంత్రి రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా పేద మధ్యతరగతి వర్గాలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆయన మానవత్వానికి నిదర్శనం అన్నారు. పాలకొల్లు నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన ఆయన ప్రజల మనిషిని, నేడు మంత్రిగా రాష్ట్ర ప్రజల అందరివాడు అయ్యారని కొనియాడారు. కొందరైతే భావోద్వగంతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పూర్ణచంద్రరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకొల్లు ఐసిడిఎస్ పరిధిలో పది ఖాళీలు

## నవంబర్ 5 వరకు దరఖాస్తులు ఆహ్వానం

**పోడూరు, అక్టోబర్ 27, ప్రభాత వార్త:** పాలకొల్లు ఐసిడిఎస్ పరిధిలో పది అంగన్వాడీ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి ఆదేశాల మేరకు, పాలకొల్లు సిడిపిఓ ఎం. ఉమా సోమవారం ఈ ప్రకటన విడుదల చేశారు.ఈ నియామకాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్ల స్థానాలు ఉన్నాయి. మంగళవారం అక్టోబర్ 28 నుండి నవంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. స్థానిక మహిళలకు ఉపాధి అవకాశమివ్వాలన్న లక్ష్యంతో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు సిడిపిఓ ఉమా తెలిపారు.పాలకొల్లు పట్టణం దేవునితోటలో సహాయకురాలు,దగ్గులూరు మండలంలోని కందపెరడులో సహాయకురాలు, పోడూరు మండలంలోని వద్దిపర్రులో అంగన్వాడీ కార్యకర్త, వేడంగి సహాయకురాలు -,పెనుమదం సహాయకురాలు, వేడంగి సహాయకురాలు, యలమంచిలి మండలంలోని పెనుమర్రు-2 సహాయకురాలు, పెదలంక-2 సహాయకురాలు, చించినాడ%-%4 సహాయకురాలు, ఆర్యపేట-1 సహాయకురాలుగా ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ పోస్టులకు ఆయా గ్రామ పరిధిలోని స్థానిక మహిళలు మాత్రమే అర్హులు. వయస్సు 1 జూలై 2025 నాటికి 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.విద్యార్హత కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. అభ్యర్థులు తమ సంబంధిత పత్రాలతో పాటు దరఖాస్తులను పాలకొల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సమర్పించాలి. పూర్తి వివరాల దరఖాస్తు నమూనా కోసం కార్యాలయాన్ని సంప్రదించాలని సిడిపిఓ ఉమా విజ్ఞప్తి చేశారు.

# విస్తృతంగా పర్యటించిన పోలీసు అధికారులు.

**ఆగిరిపల్లి అక్టోబర్ 27 ప్రభాతవార్త:** ఆగిరిపల్లి మండలం మంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ పోలీస్ అధికారులు పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. పలు ప్రాంతాలలో వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలలో నివసిస్తున్న కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి నీ సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ ఆగిరిపల్లి ఎస్ఐ లు వసతి ,భోజన సదుపాయాలను కల్పించినారు ఈ సందర్భంగా నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణమాట్లాడుతూ తుఫాన్ సమయంలో భద్రతా చర్యలపై అవగాహన కల్పిస్తూ, ప్రజలు సమీప పునరావాస కేంద్రాలకు వెళ్ళాలని సూచించారు. స్థానిక ప్రజలు కూడా అధికారుల



పిలుపుకు స్పందించి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాణ భద్రతను ప్రాధాన్యంగా చూడాలని అధికారులు సూచించారు.

# మొంథా తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

**ప్రాణ నష్టం సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి**
**చేప,రొయ్యల రైతులు అప్రమత్తంగా ఉండాలి**
**కైకలూరులో పోలీస్ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్న ఎస్పీ శివ ప్రతాప్ కిషోర్**

కైకలూరు అక్టోబర్ 27(ప్రభాతవార్త): మొంథా తుపానును ఎదుర్కొనేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా చేప,రొయ్యల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదని ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. సోమవారం కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తుఫాను ఎదుర్కొనేందుకు సర్కిల్ పరిధిలోని పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా చేప, రొయ్యల రైతులు చెరువు



మీద కాపలాగా ఉండే వ్యక్తులను యజమానులు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. లేకుంటే చెరువు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండి అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎస్పీ దిశ, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు టౌన్ సిఐ రామకృష్ణ, రూరల్ సీఐ వి రవికుమార్, టౌన్ ఎస్సైలు వెంకట్ కుమార్, ఆర్ శ్రీను, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రామయ్య చెరువుకు మరమ్మతులు

**-గండి పడుతుందని ఆందోళనలో రైతులు**
**- స్వచ్ఛందంగా పనులు**

చాట్రాయి, అక్టోబరు 27, ప్రభాతవార్త : చాట్రాయి మండలం, జనార్ధనవరం గ్రామంలో కురుస్తున్న వర్షాలకు రామయ్య చెరువు (కొత్త చెరువు) కట్టతెగే పరిస్థితి ఏర్పడటంతో మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే మరమ్మతులు చెప్పటంతో ఆయన ఆదేశాల మేరకు పనులు చేపట్టారు. చెరువుకట్టన నడిచే వీలులేకుండా ఉండటంతో రైతులతో కలసి నీటిసంఘం అధ్యక్షులు వంగల సుబ్బారావు,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మదాసు చిన్న పుల్లయ్య వ సొంత నిధులతో రామయ్య చెరువు (కొత్త చెరువు )కట్ట తెగకుండా, ముళ్ళపొదలను తొలగించి రైతులు నడిచే వీలుగా మరమత్తులు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి బలువూరి రత్తయ్య టిడిపి నాయకులు పుచ్చకాయల వేంకటేశ్వరరెడ్డి, బొరిగొర్ల తిరపతిరావు, బండారు శ్రీమన్నారాయణ, అడిమెల్లి మోష, బండారు నాగరాజు, గొడవర్తి ఈశ్వర్ పలువురు రైతులు పాల్గొన్నారు.



**తుఫాను ప్రాంతాల్లో ప్రత్యేక అధికార ప్రసన్నకుమార్ పర్యవేక్షణ**
**ప్రభాతవార్త నరసాపురం**

# ప్రజలకు అందుబాటులో అధికారులు

## - సిద్ధాంతం పంచాయతీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**పెనుగొండ, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవసరమైన సేవలు, సమాచారం అందించేందుకు సిద్ధాంతం పంచాయతీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వై. కిషోర్‌బాబు మాట్లాడుతూ, తుపాన్ సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా జనరేటర్‌ను సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులు స్పందిస్తారని తెలిపారు.ప్రజలు నిరభ్యంతరంగా అవసరమైన సహాయం కోసం పంచాయతీ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాన్ ప్రభావం ఉన్నంతకాలం అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

# మొంథా తుఫాను నిమిత్తం

## 19 పునరావాస కేంద్రాలు ఏర్పాటు.

అత్తిలి- అక్టోబర్27 (ప్రభాతవార్త): మొంథా తుఫాను సందర్భంగా అత్తిలి మండలంలో 19 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అత్తిలి తాసిల్దార్ దశి క వంశీ తెలిపారు. తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో తుపాను ముందస్తు చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. తుఫాను దృష్ట్యా భారీ వర్షాలు కురవ వచ్చుని అంచనా వేసినట్టు తెలిపారు. 28న 176 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగలదని భావిస్తున్నట్లు తెలిపారు. మంగళ, బుధవారంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, నిత్యవసర వస్తువులు, కూరగాయలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలను కోరారు. మండలంలో 19 మంది గర్భిణీలను గుర్తించామని వారిని ఆసుపత్రులలో చేర్చాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్,సచివాలయ ఉద్యోగుల సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. అత్తిలి లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. తుఫాను దృష్ట్యా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఎంపీడీవో పి శామ్యూల్,ఎస్ ఐ. పి. ప్రేమ రాజు, వ్యవసాయ అధికారి టి కే రాజేష్,పంచాయతీరాజ్, ఐసిడిఎస్, అగ్రిమాపక తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం తాసిల్దారు దర్శక వంశీ అత్తిలి మండలంలో తిరుపతిపురం ,వ రి గే డు, స్కిన్నెర పురం గ్రామాలలో పర్యటించారు. పంట బోదెలు పూడిక తీయించాల్సి ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఎర్ర కాలువ ప్రమాద స్థితిలో లేదని భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన చర్యలపై తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# జిల్లా వ్యవసాయధికారి పర్యటన

**అత్తిలి - అక్టోబర్ 27 ( ప్రభాత వార్త ):**జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు ప్రస్తుత తుఫానుపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అత్తిలి గ్రామంలోని బల్లిపాడు రోడ్ లో గల రైతులతో తుఫాను గురించి చర్చించి రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండల వ్యవసాయధికారి టి కే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# 25 కేజీల చింతకాయలతో అమ్మవారికి అలంకరణ



భీమవరం అక్టోబర్ 27 ప్రభాతవార్త :కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి 25 కేజీల చింతకాయలతో పూజ చేసి అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ చే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణానికి చెందిన చినమిల్లి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దంపతులచే కుంకుమార్చన, నక్షత్రమాల, కాకర్ల భరత్ శ్రీరామ్, సూర్య మాధవి దంపతులచే అమ్మవారికి 25 కేజీల చింతకాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు బాలత్రిపుర సుందరి మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# చనుబండ లో వైఎస్ఆర్సిపి కోటి సంతకాల సేకరణ



చాట్రాయి అక్టోబర్ 27, ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ ప్రైవేటీకరణకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి మండలం చనుబండ గ్రామంలో మండల పుచ్చకాయల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కోటి చుట్టారు.నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ప్రభుత్వం మెడికల్ కళాశాలల జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చాట్రాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంతకాల సేకరణకు శ్రీకారం మేక ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో చాట్రాయి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రచ్చబండ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ చేయాలని చూడటం ప్రజలను మోసం చేయడమేనని ఆయన అన్నారు. ప్రతి కార్యకర్త కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు పాలెం ఎంపిటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ వంకిణి వెంకటేశ్వరరావు, చనుబండ గ్రామ ఉపసర్పంచ్ దిరిశాల సత్యనారాయణ,చిన్న బాబు,వనమా వాసు,దారా రాజు విస్సంపల్లి రామకృష్ణ, రమణ నెహ్రూ వాసం కోటేశ్వరరావు వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటలను పరిశీలించిన అధికార బృందం



చాట్రాయి, అక్టోబర్ 27, ప్రభాతవార్త : తుఫాన్ కారణంగా వరి కోతలు ఆపాలని రైతులకు తెలియజేసినందున పంటల పరిస్థితి పరిశీలించేందుకు వాతావరణ శాఖ సూచనల మేరకు మండలంలో అధికార బృందం పర్యటించారు. మండల వ్యవసాయ అధికారి శివశంకర్, ప్రత్యేక అధికారి పి వెంకటరత్నం, ఎం.డి.ఓ బి. సత్యనారాయణలు మండలంలో పలు గ్రామాలలో పర్యటించి పంటలను పరిశీలించారు. రాబోయే రెండు రోజుల్లో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని రైతులు గమనించి కోతల పోయకుండా ఉండాలని చెప్పారు. కోసిన పంటను కార్బలిన్ పట్టాలు వేసి జాగ్రత్త చేసుకోవాలని వారు సూచించారు.

# ఎలాంటి విపత్కరన్నైనా ఎదుర్కొటాము, అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

## కోస్తాజిల్లాల తుఫాను ప్రత్యేక అధికారి -ఆర్.పి. సిసోడియా



భీమవరం అక్టోబర్ 27 ప్రభాతవార్త : మొంతో తుఫాన్ విపత్తు ఎదుర్కొందుకు జిల్లాప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోస్తా జిల్లాల తుఫాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్.పి సిసోడియా భీమవరం కలెక్టరేట్ కువచ్చారు. జిల్లా తుఫాన్ ప్రత్యేక అధికారి ప్రసన్నకుమార్, కలెక్టర్ చదలవాడనాగరాణి, ఎస్పీ. నాయిమ్ అస్మి తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తుఫాన్ లో సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా కీలకమైనదని,కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చునని,కమ్యూనికేషన్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు.దీనిలో భాగంగామొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.మొంథా తుఫాన్ కాకినాడకు 500 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరం దాటి అవకాశం ఉన్నదన్నారు.మంగళవారం రాత్రికి వాయుగుండం కాకినాడ మచిలీపట్నం మధ్య ఎక్కడైనా తీరం దాటే అవకాశం ఉందన్నారు.తుఫాన్ తీవ్రతను బట్టి 90 నుండి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది, డివైడర్ల మధ్యలో హెూర్డింగ్స్ ను తొలగించాలని ఆదేసించినట్లు చెప్పారు.మంగళవారం సాయంత్రం రోడ్లమీద ప్రైవేట్ వెహికల్స్ తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కి ఆదేశాలు జారిచేసినట్లు చెప్పారు. జిల్లాకలెక్టర్ నాగరాణిపశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం ను తుఫాను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకుసిద్ధంచేశారన్నారు. నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందిచెప్పారు. జిల్లాలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, 26 పక్కా భవనాలను పునరావాస కేంద్రాల నిర్వహణకు సిద్ధం చేయడం జరిగింది, ఒక ఎన్డీఆర్ బృందం నరసాపురంలో సిద్ధం చేయడం జరిగింది, దీనితోపాటు 68 జేసీబీలు, 57 పవర్ సాసర్లు సిద్ధం చేసామని, ముఖ్యంగాగర్భిణీ స్త్రీలను, వృద్ధులను స్థానిక వీహెచ్సీలకుముందస్తు జాగ్రత్త గా తరలించడం జరిగిందిచెప్పారు.

# ఈనెల 29న 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞం



భీమవరం అక్టోబర్ 27 ప్రభాతవార్త :లోక శాంతి కోసం ఈనెల 29 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు జరిగే 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద యజ్ఞ కమిటీ ఆధ్వర్యంలో 5 రోజులపాటు జరిగే మహాయజ్ఞ పోస్టర్ ను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణ, లోక శాంతి కోసం యజ్ఞ యాగాదులు పురాతనకాలం నుంచి నిర్వహిస్తూ వస్తున్నారని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా గాయత్రీ మహా యజ్ఞం మన ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. గాయత్రీ పరివార్ యజ్ఞ కన్వీనర్ రమేష్ వర్మ, కమిటీ సభ్యులు నడింపల్లి బంగార్రాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, రాష్ట్ర కన్వీనర్ రఘురాం (హైదరాబాద్) మాట్లాడుతూ భీమవరం – పెద అమిరం లోని మాజీ ఎంపీ గోకరాజు గంగ రాజుగారి ప్రాంగణంలో ఈనెల 29వ తేదీ నుంచి నవంబర్ 2 వరకు 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 29న ఏఎస్ఆర్ నగర్ రామాలయం నుంచి యజ్ఞ స్థలం వరకు వ్యసన విముక్తి గ్రామ ప్రదక్షిణ, శోభాయాత్ర, 30న మూడు (స్థూల, సూక్ష్మ, కారణ) శరీర సాధన, మావుళ్ళమ్మ ఆలయం నుంచి యజ్ఞ స్థలం వరకు శోభ కలశ యాత్ర, కలశ పూజనం, 31న ఉదయం సర్వ దేవతా ఆవాహనం, సాయంత్రం దీప మహా యజ్ఞం, రాత్రి 7.30 గంటలకు డా చిన్మయ పాండ్య ప్రవచనం, నవంబర్ 1న జ్ఞాన గాయత్రీ మహా యజ్ఞం, మధ్యాహ్నం డివైన్ కళాశాల నుంచి యజ్ఞ స్థలం వరకు పర్యావరణ పరిరక్షణ గ్రామ ప్రదక్షిణ, సాయంత్రం 6.30 గంటలకు సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు, 2వ తేదీన గాయత్రీ సాధన దీక్ష, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని వారు కోరారు.

# మొంథా తుఫాన్ ప్రత్యేకధికారి ప్రసన్న వెంకటేష్ కలెక్టర్ నాగరాణి, జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి తో సమీక్ష

భీమవరం అక్టోబర్ 26 ప్రభాతవార్త :మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించిన ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వి.ప్రసన్న వెంకటేష్ ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు.ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు ప్రత్యేక అధికారి వి.ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డితో సమావేశమై జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు, ముందస్తుగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రత తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అక్టోబర్ 28న "మొన్థా" తీవ్ర తుఫాను రూపంలో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అప్రమత్తమైయి రాష్ట్రంలోని అన్ని తీర ప్రాంత జిల్లాలన్నింటికీ సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. వీరు తక్షణమే తమ తమ జిల్లాలకు చేరుకొని ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుచేసి, కలెక్టర్లతో సమన్వయంగా చర్యలు తీసుకుంటారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు వి.ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. వీరు తుఫాను సమయంలో ఉపశమన, రక్షణ, సహాయక చర్యలను సమన్వయం చేయనున్నారు. ప్రతి బాధిత కుటుంబానికి సాయం చేరేలా పర్యవేక్షిస్తారు. తుఫాను అనంతరం నష్టాల అంచనా, పరిహారం పంపిణీ, సాధారణ జీవనం పునరుద్ధరణ వరకు వీరి తమ బాధ్యతలు కొనసాగిస్తారు. వీరు అన్ని శాఖల మధ్య రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇంధనం, రోడ్లు %భవనాలు, నీటిపారుదల, ఆరోగ్యం సమన్వయంతో పర్యవేక్షిస్తారు. ప్రకృతి వైపరీత్య ప్రాంతాల ప్రజలు ఏదైనా సమాచారాన్ని ప్రత్యేక అధికారికి తెలియపరచవలసిన ఉంటే ఈ నెంబర్ కు 8639541520 సంప్రదించాలని తెలిపారు.

# నోబెల్ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సంజీవ్ కుమార్



చాట్రాయి, అక్టోబర్ 27, ప్రభాతవార్త : నోబెల్ టీచర్స్ అసోసియేషన్ చాట్రాయి మండల అధ్యక్షుడిగా జి సంజీవ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఏలూరు జిల్లా నోబెల్ టీచర్స్ యూనియన్ నాయకులు ఏ.ఎస్.రామాకృష్ణ, మరియు సుభాష్ చంద్రబోస్ ల ఆధ్వర్యంలో జరిగిన సర్వ సభ్య సమావేశం లో చాట్రాయి మండల కార్యవర్గం ను ఎన్నుకొని ప్రకటించారు. దీనిలో భాగంగా నోబెల్ టీచర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా గడిదేసి సంజీవ్ కుమార్ మరియు జనరల్ సెక్రెటరీగా పి.శేఖర్, ట్రెజరర్ గా ఎస్. కిరణ్ కుమార్ లు ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. చాట్రాయి మండల కమిటీ సభ్యులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జగాని .వెంకటేశ్వరరావు,మాజీ ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్,మరిది చిట్టి బాబు, చనుబండ సహకార సంఘ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు,బొట్టు లక్ష్మణ రావు, అత్తులూరి శ్రీనివాసరావు, నక్కా రాము,మండపాటి బసవ రెడ్డి, మండల ఎన్ టి ఏ తరుపున ఎన్నిక కాబడిన వారిని అభినందించారు.

# ఏలూరు జిల్లాలో 27 సహాయక కేంద్రాలు

## మంత్రి నాదెండ్ల



ప్రభాతవార్త ఏలూరు, అక్టోబర్, 27 : ఏలూరు జిలాల్లో 27 తుఫాన్ సహాయక కేంద్రాలకు 534 మంది ప్రజలను తరలించామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఏలూరు జిల్లాలో తుఫాన్ సహాయక చర్యలను గురించి మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మొంథా తుఫాను ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్దమైనదన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అందరూ వారికి కేటాయించిన విధులలో నిమగ్నమయ్యారని, జిల్లాలో ఇంతవరకు 27 తుఫాన్ సహాయక కేంద్రాలు ఏర్పాటుచేసి, 534 మంది ప్రజలను తరలించడం జరిగిందన్నారు. జిల్లాలోని 408 గ్రామ/వార్డ్ సచివాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది వాస్తవ పరిస్థితులు తెలియజేస్తున్నారని, దానిని అనుసరించి జిల్లా యంత్రాంగం సహాయక చర్యలు తీసుకుంటున్నదన్నారు. వాగులు, చెరువులు, మైనర్ ఇరిగేషన్ చెరువులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిలాల్లోని 1123 రేషన్ షాపులున్నాయని, వాటిలో 583 రేషన్ షాపులలో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలను సిద్ధం చేశామన్నారు. మిగిలిన రేషన్ షాపులలో రేపు మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో నిల్వ చేస్తామన్నారు. అన్ని రేషన్ షాపులలో 20 శాతం అదనంగా సరుకులను బఫర్ స్టాక్ గా ఉంచుతామన్నారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఎటువంటి అధైర్యపడొద్దన్నారు. గత సంవత్సరం సేకరించినవిధంగానే ధాన్యం సేకరణ చేస్తామన్నారు. జిల్లాలోని 234 రైతు సేవా కేంద్రాలున్నాయని, వాటిలో 30 చొప్పున జిల్లాలో టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. సోమవారం సాయంత్రానికి జిల్లాలో 25. 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, మంగళవారం మధ్యాహ్నం నుండి తుఫాన్ తీవ్రత పెరుగుతుందన్నారు. జిల్లాలోని కలెక్టరేట్, అన్ని మండల కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుండి తీవ్రమైన గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావద్దన్నారు. కైకలూరు, నూజివీడు, ఉంగుటూరు మండలంలో తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆయా ప్రాంతాలలో సమస్యాత్మకమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. తుఫాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్దరణకు గాను 2 వేల విద్యుత్ స్థంబాలు, 500 ట్రాన్స్ఫార్మర్లు సిద్ధంగా ఉంచామన్నారు. సమాచార వ్యవస్థకు అంతరాయం లేకుండా సెల్ ఫోన్ టవర్ల వద్ద జనరేటర్ లు ఏర్పాటుచేయాలని, వాటికి అవసరమైన డీజిల్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# మెందా తుఫాను నిమిత్తం కంట్రోల్ రూములు ఏర్పాటు



.అత్తిలి– అక్టోబర్ 27 (ప్రభాత వార్త):అత్తిలి : మండలంలో మెందా తుఫాను నిమిత్తం మండల, సచివాలయ స్థాయిలలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి. శామ్యూల్ తెలిపారు. కంట్రోల్ రూములో పనిచేసే సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. మండలంలో రక్షిత నీటి సరఫరా, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. పాడుబడిన గృహాల్లో నివాసం లేకుండా చూడాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. క్లోరినేషన్ కలిపిన మంచినీటినే పంచాయతీలు సరఫరా చేయాలని అన్నారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని,మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలని ఆదేశించారు. తుఫాను వల్ల చెట్లు కూలితే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# నానాజీ జయంతి సందర్భంగా పెనుగొండలో ఘన నివాళులు

## డిసిసిబి మాజీ డైరెక్టర్



పెనుగొండ,అక్టోబర్ 27( ప్రభాతవార్త ): డిసిసిబి మాజీ డైరెక్టర్ కూనవరెడ్డి లక్ష్మీనాయుడు (నానాజీ) జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకుంటూ అభిమానులు, బంధుమిత్రులు ఘనంగా నివాళులర్పించారు. నానాజీ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో పెనుగొండ శివాలయం వీధిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. సుమారు 200 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ,1500 మందికి అన్న సమారాధన మినర్వా థియేటర్



వద్ద జోరు వానలోనూ భారీగా హాజరైన ప్రజలు అదే విధంగా నానాజీ నివాసంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన సేవా కార్యక్రమాలను స్మరించుకుంటూ జయంతిని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో తోట మెహర్, సూర్నీడి కృష్ణ, బండారు నాయుడు, గాజుల బులిపుల్లారావు, పోడూరి రామయ్య, మినర్వా థియేటర్ యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుంది



కైకలూరు అక్టోబర్ 27(ప్రభాతవార్త):మొంథా తుపాను ప్రభావం రానున్న 2 రోజులు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అప్రమత్తం చేశారు. సోమవారం ఉప్పుటేరు,కొల్లేరు తీర గ్రామాలైన కలిదిండి మండలం సున్నంపూడి, దుంపలకోడిదిబ్బ,కైకలూరు మండలం పెంచికలమర్రు, వడ్లకూటి తిప్ప, శృంగవరపాడు, గుమ్మల్లపాడు, కొల్లేటికోట తదితర గ్రామాల్లో జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ వెంకటరమణ పర్యటించి మైక్ ద్వారా వాతావరణ శాఖ సూచనలను తెలియజేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో తుపాన్ ప్రభావంతో 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని,బారీ వర్షం చోటు చేసుకుంటుందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండి విద్యుత్ స్తంభాలు, తీగలు, సెల్ టవర్లు, చెట్లు కింద ఉండవద్దని జాగ్రత్తలు చెప్పారు. ఆస్తి, ప్రాణ నష్టం ఎక్కడ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి లోతట్టు ప్రాంతాల్లో ముంపు బారిన పడే చోట లేకుండా సురక్షిత భవనాల్లో ఉండాలని సూచించారు. ఈ రెండు రోజులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళొద్దని, ముఖ్యంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని కోరారు. ప్రతి ఒక్కరు వాతావరణ శాఖ హెచ్చరికలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు. కలిదిండి,చిన్నతాడినాడ గ్రామాల్లో తుఫాన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల కోసం అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మొంథా తుపాను హెచ్చరికలతో సిద్ధాంతం లో కదలిక

## రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖల కలయిక

పెనుగొండ అక్టోబర్ 27( ప్రభాతవార్త ): మొంథా తుపాను ప్రభావంతో తీరప్రాంతాల్లో భారీ గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సిద్ధాంతం కాలువ గట్టు పక్కన తాటాకు ఇళ్లల్లో నివసిస్తున్న 13 కుటుంబాలను రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా కలసి సురక్షిత ప్రాంతానికి తరలించారు.ప్రభుత్వ సత్రంలో ప్రత్యేక పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడే ఉండాలని ప్రజలను కోరారు. ప్రజలు రోడ్లపైకి రాకుండా, ఇళ్లలోనే ఉండేలా మైకుల ద్వారా సమాచారాన్ని అందిస్తున్నట్లు సర్పంచి గనిరాజు తెలిపారు. తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, అవసరమైతే హైస్కూల్ భవనాల్లో కూడా పునరావాస ఏర్పాట్లు చేయనున్నట్లు కార్యదర్శి వై. కిషోర్బాబు వెల్లడించారు. ఈ చర్యల్లో వీఆర్వో జి. నవ్య, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రజల భద్రతే ప్రథమమని అధికారులు స్పష్టం చేశారు.

# టాక్సీ అసోసియేషన్ భగవాన్ చేసిన సేవలు ఎనలేనివి

భీమవరం అక్టోబర్ 27ప్రభాతవార్త :ట్యాక్సీ డ్రైవర్ల సంక్షేమ కోసం విద్యా వైద్యం కోసం సుమారు రూ 6 లక్షలతో భగవాన్ చారిటబుల్ ట్రస్ట్ ను వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం రెండో పట్టణంలోని ట్యాక్సీ స్టాండ్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం అసోసియేషన్ దివంగత అధ్యక్షులు వేగి శ్రీభగవన్నారాయణ సంతాప సభను సోమవారం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్నం, ఆకుల శ్రీను మాట్లాడుతూ ఒక దశలో టాక్సీ డ్రైవర్ లకు స్టాండ్ లేకపోవడంతో భగవాన్ అప్పటి పెద్దలతో సంప్రదించి ఈ కాల్వ గట్టుపై టాక్సీ స్టాండ్ ఏర్పాటు చేశారని, వారి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భగవాన్ కుటుంబ సభ్యులు వారి తండ్రి పేరిట సుమారు రూ 6 లక్షల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, డ్రైవర్లకు విద్య వైద్యం అందించడానికి ఈ ట్రస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భగవాన్ విగ్రహాన్ని ట్యాక్సీ స్టాండ్ లో ఏర్పాటు చేయాలని పలువురు డ్రైవర్లు కోరారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్:9704502377

# మావుళ్ళమ్మా దీక్ష ధారణ




భీమవరం అక్టోబర్ 27ప్రభాతవార్త :మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి మండలి దీక్షా మాలధారణ కార్యక్రమం అశ్వయుజ పౌర్ణమి నాడు మండలం దీక్షలు ప్రారంభం కాగాసోమవారం అర్ధమండల దీక్ష కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ కలశస్థాపన పూజ జరిపి, ప్రారంబించారు. 320 మంది భక్తులు దీక్షా మాలధారణ ధరించారని, అఖరుగా పాదమండల దీక్ష వచ్చే నెల 6 న ప్రారంభం కానుందని, భక్తులు సిద్ద పడాలని తెలిపారు దీక్ష విరమణ మహాపూర్ణాహుతి వచ్చే నెల 16 ఆదివారం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియచేసినారు..

# మొందా తుఫానుపై మండల స్థాయి అధికారుల సమావేశం.



అత్తిలి /ఇరగవరం అక్టోబర్ 27 (ప్రభాత వార్త) : మొందా తుఫాను వల్ల ఇరగవరం మండలంలోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు సురక్షిత నీరు అందించాలని, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. తాసిల్దార్ ఏ.సుందరరాజు మాట్లాడుతూ తుఫాను వల్ల విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు కూలే అవకాశం ఉన్నందున రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ వారు పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# యువర్ ఎటెన్షన్ ప్లీజ్....




(ప్రభాతవార్త):నైరుతి,పశ్చిమమధ్య బంగాళాఖాతంలో మొంథా తుపాన్ గడిచిన 3గంటల్లో గంటకు 18కి.మీ వేగంతో కదిలిన మొంథా తుపాన్ ప్రస్తుతానికి చెన్నైకి 600కి.మీ, విశాఖపట్నంకి 710 కి.మీ, కాకినాడకి 680 కి.మీ దూరంలో కేంద్రీకృతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ రేపు ఉదయానికి తీవ్రతుపానుగా మారే అవకాశం తీరం వెంబడి గంటకు 90–110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వాతావరణం ప్రశాంతంగా ఉందని అశ్రద్ధగా ఉండకండి నిశితంగా వేచి చూడండి ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలి నేడు కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ది ప్రఖర్ జైన్, ఎండీ, విపత్తుల నిర్వహణ సంస్థ.

# సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నదన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ 'మొంథా' పెను తుఫాన్ ప్రభావంతో మంగళవారం జిల్లాలోని 13 మండలంలో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో హై అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో గాలితీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో జిల్లాలోని 763 హెూర్డింగ్స్ ను తొలగించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలెవ్వరూ నదులు, చెరువులు ఈతకు వెళ్లవద్దని, బయటకు రావద్దని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్ధరణకు గాను 2 వేల విద్యుత్ స్థంబాలు, 500 ట్రాన్స్ఫార్మర్లు, 1200 మంది విద్యుత్ సిబ్బందిని అత్యవసర సేవల నిమిత్తం సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ సహాయక చర్యలకు గాను 59 జేసీబీలు, 37 చెట్లు కట్ చేసే యంత్రాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బృందం ను సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ గాలి తీవ్రత, భారీ వర్షాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తుఫాన్ సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలెవ్వరూ బయటకు రావద్దని, జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# 'కృష్ణ లీల' మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా.. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత సురేష్ బాబు



యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచరల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్ పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ కి కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మాజీ సిబిఐ జే.డి.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, యువతరం ఏది చేసినా ప్యాషన్ తో చేయమని చెబుతుంటాను. అలాంటి పాషన్‌తో వర్క్ చేస్తున్న దేవన్‌ని చూసిన తర్వాత ఎలాగైనా ఈ అబ్బాయిని సపోర్ట్ చేయాలనిపించింది. రామానాయుడు తెలుగు సినిమాకి చేసిన సేవలు అమోఘం ఆయన మూవీ మొఘల్. చదువుకున్న రోజుల నుంచి ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. సురేష్ బాబు ఈ ట్రైలర్‌ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. రైటర్ కిరణ్ కుమార్ మాకు మంచి ఫ్రెండ్. ఆయన ఆలోచనలు చాలా బాగుంటాయి. ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ, . అనిల్ చాలా అద్భుతంగా ఈ స్టోరీ ని రాశారు. చాలా పాజిటివ్ గా ఉంది. నిర్మాత జోష్ణకి బెస్ట్ విషెస్. దేవన్ హీరోగా డైరెక్టర్ గా వస్తున్నారు, చాలా పాషన్ తో తీశారు. తప్పకుండా సినిమాకి మంచి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. ఈవెంట్ కి వచ్చి జెడికి థాంక్యూ. సినిమాకి పాజిటివ్ రిజల్ట్ ఉంటుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. హీరో దేవన్ మాట్లాడుతూ, సురేష్ బాబుకి లక్ష్మినారాయణకి కృతజ్ఞతలు. సురేష్ బాబు గారు మాకు చాలా సపోర్ట్ చేశారు. అలాగే ఇండస్ట్రీలో చాలామంది పాజిటివ్‌గా రెస్పాండ్ అయ్యారు. హానెస్ట్‌గా సినిమా తీస్తే అందరూ సపోర్ట్ చేస్తారని మా కృష్ణలీల సినిమా మరోసారి ప్రూవ్ చేసింది. కృష్ణ లీల ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ప్రేమంటే ఒక త్యాగం ప్రేమంటే ఒక యుద్ధం. మనం ప్రేమించిన వారి కోసం మనం ఎంత దూరం వెళ్తాం ఏ స్థాయి వరకు వెళ్తామనేది అసలైన ప్రేమ. ప్రేమ కోసం ఎన్ని త్యాగాలైనా యుద్ధాలు అయినా చేస్తూనే ఉండాలి చివరిగా ప్రేమను గెలిపించడమే నిజమైన ప్రేమ. ఆ ప్రేమని కృష్ణ లీలలో చాలా వండర్ఫుల్‌గా థ్రిల్లింగ్ గా చూపించాం. ఈ సినిమాకి రండి. వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థాంక్యూ.హీరోయిన్ ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ, సురేష్ బాబుకి, జెడి లక్ష్మీనారాయణకి హృదయపూర్వక కృతజ్ఞతలు. చాలా సిన్సియర్‌గా తీసిన సినిమా ఇది. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా సినిమా తీశారు. దేవన్ చాలా హార్డ్ వర్క్ తో ఈ ప్రాజెక్ట్ ని మీ ముందుకు తీసుకు వస్తున్నాడు. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. నిర్మాత జ్యోత్స్న మాట్లాడుతూ, ఇది టీం వర్క్. మా నటీనటులు టెక్నికల్ టీం చాలా అద్భుతంగా వర్క్ చేశారు. దేవన్ చాలా అద్భుతంగా సినిమాని ముందుకు తీసుకెళ్లారు. ధన్య చాలా చక్కగా నటించారు. ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది.రైటర్ అనిల్ కిరణ్ మాట్లాడుతూ. ప్రేమనేది ఒక త్యాగం. ఒకరపట్ల మంచి భావం. ఇలాంటి గొప్ప లక్షణాల్లో ఎవరు కలిగి ఉంటారో వాళ్ళే ఈ ప్రేమ అనే ఫీలింగ్ ని మరొకరికి ఇవ్వగలరు. ఇందులో ప్రేమ కథ రెగ్యులర్ ఫార్మెట్ లో కాకుండా చాలా కొత్తగా ఉంటుంది. కచ్చితంగా ఈ జనరేషన్ పై ఈ ప్రేమ కథ చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. దేవన్ అద్భుతంగా నటించారు.చాలా హార్డ్ వర్క్ చేశారు. ఇక్కడికి సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.నటీనటులు: దేవన్, ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్, పృధ్వి (పెళ్లి), రవి కాలే, తులసి, 7ఆర్ట్ సరయు, ఆనంద్ భరత్,సిబ్బంది:దర్శకత్వం : దేవన్, నిర్మాత : జ్యోత్స్న బ్యానర్: మహాసేన్ విజువల్స్ కథ,సంభాషణలు అనిల్ కిరణ్ కుమార్ జి డీవోపీ : సతీష్‌ముత్యాల,సంగీతం: భీమ్స్: సిసిరోలియో .

# వెంకీ అట్లూరి సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ రవీనా టండన్



వెంకీ కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్ లో వెంకీ అట్లూరి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా సెట్స్ మీద కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్‌లో వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమా సెట్స్ మీద ఉంది. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుంది. ఐతే సినిమాలో బాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ నటిస్తున్నట్టు తెలుస్తుంది. రవీనా టాండన్ తెలుగు ఆడియన్స్‌కు సుపరిచితురాలే. బాలకృష్ణతో బంగారు బుల్లోడు, నాగార్జునతో ఆకాశవీధిలో సినిమాలు చేసింది రవీనా. అప్పట్లోనే తన గ్లామర్ తో తెలుగు ఆడియన్స్ మనసులు గెలుచుకుంది. రవీనా టాండన్.. హీరోయిన్‌గా సినిమాలు చేయకపోయినా సినిమాలు, వెబ్ సీరీస్ లతో తన ప్రెజన్స్‌తో సర్ ప్రైజ్ చేస్తుంది. యష్, ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన కె.జి.ఎఫ్ 2లో నటించింది రవీనా టాండన్. .ఐతే ఇన్నాళ్లకు రవీనా మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతుంది.

ఈ సినిమాలో ఆమె పాత్ర కూడా ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. తొలిప్రేమ, సార్, లక్కీ భాస్కర్ సినిమాలతో సక్సెస్ అందుకున్న డైరెక్టర్ వెంకీ అట్లూరి ఈసారి సూర్యతో మరో డిఫరెంట్ కథతో రాబోతున్నారు. ఈ సినిమాలో రాధికశరత్ కుమార్ కూడా మరో ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తున్నారు.

మెగాస్టార్‌చిరంజీవి'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్



మీసాల పిల్ల వైరల్ సెన్సేషన్, 36 మిలియన్ వ్యూస్‌తో గత 13 రోజులుగా ఇండియాలో నంబర్ 1 ట్రెండింగ్ మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ

# 36 మిలియన్ వ్యూస్‌తో 13 రోజులుగా ఇండియాలో నంబర్ 1 ట్రెండింగ్

చిత్రం ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో మెగాస్టార్ చిరంజీవి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మెలోడీ ఇన్సంట్ చార్ట్‌బస్టర్‌గా మారడమే కాకుండా, తెలుగు పాటకు దేశవ్యాప్తంగా అరుదైన ఘనతను సాధించింది.విడుదలైన కొద్ది రోజుల్లోనే, మీసాల పిల్ల యూట్యూబ్ మ్యూజిక్ ఇండియాలో నంబర్ 1 స్థానానికి చేరుకుంది, వరుసగా 13 రోజులు అగ్రస్థానాన్ని కొనసాగించి 36 మిలియన్లకు పైగా వ్యూస్ సంపాదించింది. ఈ పాట పాన్‌ఇండియా సంచలనంగా మారింది, నేషనల్ మ్యూజిక్ స్టేజ్ పై తెలుగు సినిమాకు ఇది ప్రౌడ్ మూమెంట్.మన శంకర వర ప్రసాద్ గారు పండుగ వాతావరణంలో కుటుంబ భావోద్వేగాలు, వినోదం, నాస్టాల్జియాతో నిండిన ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది.'మీసాల పిల్ల' పాట చిరంజీవి టైమ్‌లెస్ చార్మ్, అద్భుతమైన డాన్స్ మూవ్స్, హ్యూమర్ తో ఆకట్టుకుంటోంది. ఇందులో హీరోయిన్‌గా నటించిన నయనతారతో ఆయన కెమిస్ట్రీ కొత్తదనాన్ని తీసుకొచ్చింది.ఈ పాటలోని ఎనర్జిటిక్ బీట్‌లు సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో అద్భుతంగా సమకూర్చారు. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ పాటకు నాస్టాల్జిక్ టచ్ ఇచ్చి అందరికీ ఒకేలా కనెక్ట్ అవుతోంది.

ఈ పాటలోని క్యాచీ హుక్ స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానులు పెద్ద ఎత్తున రీ క్రియేట్ చేస్తున్నారు.విక్టరీ వెంకటేశ్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి కీలక పాత్రలో కనిపించనుండటం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లోని భారీ సెట్‌పై వేగంగా సాగుతోంది.

సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 సంక్రాంతి గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది.

# 'జటాధర 'ఖచ్చితంగా గ్రేట్‌ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది: శిల్పా శిరోద్కర్



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచరల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో తెలుగులో రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది ?**

బ్రహ్మ తర్వాత ఈ సినిమాతో మళ్లీ తెలుగులోకి వస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. ఇందులో శోభ అనే క్యారెక్టర్ కనిపిస్తాను. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. తనకి డబ్బంటే అత్యాశ. ఎలాగైనా సరే రిచ్ అయిపోవాలి అనుకునే క్యారెక్టర్. సినిమాలో చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది.ఈ క్యారెక్టర్ ప్లే చేయడం చాలా చాలెంజింగ్ గా అనిపించింది.జటాధరతో రీఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

**సుధీర్ బాబుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?**

సుధీర్ బాబుతో కలిసి వర్క్ చేయడం మంచి ఎక్స్పీరియన్స్. ఈ జనరేషన్ యాక్టర్స్ నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. సుదీర్ బాబుచాలా డెడికేషన్ తో ఈ ప్రాజెక్టు చేశారు. తన 100 ఎఫర్ట్ పెట్టారు. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్.

**జటాధర ఎలాంటి సినిమా?**

ఇది మంచి సూపర్ నేచరల్ థ్రిల్లర్. స్టన్నింగ్ విజువల్స్ ఉంటాయి. ఎమోషన్స్ కూడా చాలా అద్భుతంగా ఉంటాయి. మంచి మ్యూజిక్ ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఖచ్చితంగా ఆడియన్స్ కి చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

**వెంకట కళ్యాణ్ అభిషేక్ డైరెక్షన్ గురించి?**

వెంకట్ అభిషేక్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్స్. యాక్టర్స్ నుంచి ఏం కావాలో వాళ్ళకి తెలుసు. ప్రతి యాక్టర్ నుంచి మంచి పెర్ఫార్మెన్స్ ని రాబట్టుకున్నారు.

**హిందీలో ఎలాంటి రెస్పాన్స్ ఉంది?**

సినిమా కోసం తెలుగు హిందీ అన్నిచోట్ల చాలా క్యూరియస్ గా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అంచనాలు మరింతగా పెరిగాయి. నవంబర్ 7న ఖచ్చితంగా ఒక అద్భుతమైన సినిమాని చూడబోతున్నారు.

**మీకు ఇష్టమైన జానర్, డ్రీం రోల్?**

నాకు రొమాంటిక్ కామెడీలు ఇష్టం, మంచి సినిమాలు చేయడమే నా డ్రీం.

# '12ఎ రైల్వే కాలనీ' నవంబర్ 21న రిలీజ్



అల్లరి నరేష్ నటించిన యూనిక్ థ్రిల్లర్ '12ఎ రైల్వే కాలనీ' ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుంది. పొలిమేర, పొలిమేర 2 చిత్రాలతో గుర్తింపు తెచుకున్న డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి షోరన్నర్‌గా వ్యవహరిస్తూనే కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ప్రతిష్టాత్మక శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రంలో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే ఎడిటర్.ఈరోజు ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. 12ఎ రైల్వే కాలనీ నవంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా బిగ్ స్క్రీన్‌లలోకి రానుంది. ఆ వారంలో బిగ్ రిలీజెస్ ఏవీ లేకపోవడంతో ఈ చిత్రంకు బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ ఎడ్వాంటేజ్ కానుంది.రిలీజ్ డేట్ పోస్టర్‌లో అల్లరి నరేష్ ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫోజ్‌లో డ్యాన్సర్స్ గ్రూప్‌తో కలిసి కనిపిస్తున్నారు. మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ వీడియో ఆకట్టుకుంది.ఈ సినిమా టైటిల్ టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అల్లరినరేష్ ఈ చిత్రంలో డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్నారు. పొలిమేర సిరీస్‌లో ఆకట్టుకున్న డాక్టర్ కామాక్షి భాస్కర్ల ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.కుశేంద్ర రమేష్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.విడుదల తేదీని ప్రకటించడంతో, మేకర్స్ త్వరలో ప్రమోషనల్ కాంపైయన్‌ని వేగవంతం చేయడానికి సిద్ధమవుతున్నారు.నటీనటులు: అల్లరి నరేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల, సాయికుమార్, వైవాహర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్‌కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి.సాంకేతిక సిబ్బంది:బ్యానర్: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్‌నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, సమర్పణ: పవన్ కుమార్‌కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్,షోరన్నర్: డాక్టర్ అనిల్ విశ్వనాథ్‌ఎడిటర్,డైరెక్టర్: నాని కాసరగడ్డ, డిఓపి: కుశేందర్ రమేష్ రెడ్డి,సంగీతం: భీమ్స్ సిసిరోలియోవిఎఫ్ఎక్స్: త్రివేణి కాసరగడ్డ (నియో స్టూడియోస్)సౌండ్ డిజైన్: రఘునాథ్‌డిఐ: అన్నపూర్ణ స్టూడియోస్,కలరిస్ట్ : రఘు తమ్మారెడ్డిసౌండ్‌మిక్స్ ఇంజనీర్: కృష్ణ రాజ్ .

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' నుంచి అందమైన ఫిగరు నువ్వా సాంగ్ రిలీజ్



హీరో నాగశౌర్య కంప్లీట్‌యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్‌బాయ్ కార్తీక్‌లోపవర్‌ఫుల్ పాత్రలో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవిఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అందమైన ఫిగరు నువ్వా సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. హారిస్ జయరాజ్ రొమాంటిక్ ఫుట్ ట్యాపింగ్ నెంబర్ గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి. సాంగ్‌లో నాగ శౌర్య, విధి కెమిస్ట్రీ అదిరిపోయింది. ఈ సాంగ్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈచిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు. రామాంజ నేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. నటీనటులు: నాగ శౌర్య, విధి, సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ నెల్లూలు


# ట్రాలాలా ప్రొడక్షన్ నెం.2గా 'మా యింటి బంగారం' ప్రారంభం

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.2గా ప్రారంభమైన 'మా ఇంటి బంగారం ' ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2గా మా ఇంటి బంగారం'ను సగర్వంగా ప్రారంభించినట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది బ్యానర్ నుంచి వచ్చిన 'శుభం'సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. 'మా ఇంటి బంగారం సినిమాలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలు. ఓ బేబి వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ఇది. ఈ చిత్రానికి ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా... సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సీతా మీనన్. వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. పల్లవి సింగ్ కాస్ట్యూమర్, ఉల్లాస్ హైదర్ ప్రొడక్షన్ డిజైనర్, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్‌చేస్తున్నారు.సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో సినిమా ప్రారంభమైంది. మూవీ ఫస్ట్ లుక్‌ను గమనిస్తే గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా అనిపించింది. అద్భుతమైన యాక్షన్ బ్యాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తామని ఈ సందర్భంగా మేకర్స్ తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభమైందని, మరిన్ని వివరాలను తెలిజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు.



# 'సంతాన ప్రాప్తిరస్తు' మ్యూజికల్ హిట్ అవుతుంది సాంగ్ లాంచ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ సురేష్ బాబు

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు "సినిమా నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా నుంచి తెలుసా నీ కోసమే లిరికల్ సాంగ్ ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు అతిథిగా రిలీజ్ చేశారు. "ఆయ్", "సేవ్ ది టైగర్స్ "వంటి సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్స్ కు వర్క్ చేసిన టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ తెలుసా నీ కోసమే. పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. శ్రీమణి ఆకట్టుకునే లిరిక్స్ అందించగా.. అర్మాన్ మాలిక్ మనసుకు హత్తుకునే పాడారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో.. స్క్రీన్ ప్లే రైటర్‌షేక్ దావూద్. జి. మాట్లాడుతూ, జనాభాలో భారత్ చైనాను దాటేసింది. మనది ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం. మరోవైపు ఐవీఎఫ్, ఫర్టిలిటీ సెంటర్స్ చాలా పెరిగాయి. ఎందుకు అనే పాయింట్ ను డిస్కస్ చేస్తూ ఎంటర్ టైనింగ్ వే లో రాసుకున్న స్టోరీ ఇది. 'సంతాన ప్రాప్తిరస్తు' మంచి ఎంటర్ టైనింగ్ మూవీ. మీరంతా ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. ఈ చిత్రంలో మంచి వినోదం ఉంటుందని మేమంతా గట్టిగా చెప్పగలం. మా సినిమాకు మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.వప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో పెద్ద సంఖ్యలో ఫర్టిలిటీ సెంటర్స్ ఉన్నాయి. ఈ పాయింట్ నుంచే కథ మొదలైంది. పిల్లలు పుట్టకపోవడం అనేది బిజీ లైఫ్ లో ఉన్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్స్‌గానీ ఇతర ప్రొఫెషన్స్‌లో ఉన్న వాళ్ల జీవితాల్లో పెద్ద సమస్యగా మారింది. ఆయనకు టీజర్, ట్రైలర్ చూపించాం. "సంతాన ప్రాప్తిరస్తు సినిమా కాంటెంపరరీగా ఉంటూ ఎంటర్ టైన్ చేస్తుంది, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. తెలుసా నీ కోసమే బ్యూటిఫుల్ సాంగ్, కథలోనుంచి వచ్చిన పాట ఇది. తప్పకుండా ఛాట్ బస్టర్ అవుతుంది. డైరెక్టర్ సంజీవ్ సిన్సియర్‌గా వర్క్ చేస్తారు. ఏబీసీడీ మూవీ నుంచి మేము కలిసి ట్రావెల్ చేస్తున్నాం. ఈ కథకు మంచి హీరో కావాలని చాలా రోజులు చూశాం. మాకు విక్రాంత్ దొరికాడు.నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ, 'సంతాన ప్రాప్తిరస్తు'టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా.ఆయన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ నుంచి ప్రొడ్యూసర్‌గా మారారు. సినిమా అంటే ఎంతో ప్యాషన్ తో ఉంటారు. ఆయన ఎఫర్ట్స్ ఎప్పుడూ ఫెయిల్ కాలేదు. 'సంతాన ప్రాప్తిరస్తు' సాంగ్స్ చాలా బాగున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ కు కంగ్రాట్స్. ఈ సినిమా మంచి మ్యూజికల్ హిట్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు.



# బొమ్మలతో అంతర్జాతీయ గుర్తింపు



సరైన శిక్షణ దొరకలేదు. తగిన అవకాశం దక్కలేదు. ఇలా ప్రతిదానికీ కారణాలు వెతుక్కునే వాళ్లకి షాలినీ గుప్తాని చూపించాలి. అందరూ సందిగ్ధంలో ఉన్న సమయంలో ఆమె తనను తాను తీర్చిదిద్దుకుంది. అంతర్జాతీయ గుర్తింపుని సాధించింది. ఇంతకీ ఆమెవరు? ఏం చేసిందంటే...

2020 లాక్డౌన్ దీనికితోడు కరోనా భయం. దీంతో అందరూ ఇంటికే పరిమితమయ్యారు. కానీ ఖాళీగా భయపడుతూ కూర్చోవడం నచ్చలేదు షాలినీకి. అందుకే ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకుంది. ఈమెది రాజస్థాన్‌లోని అల్వార్. తనకు బొమ్మలు గీయడమంటే ఇష్టం. కానీ ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. లాక్‌డౌన్‌లో దానిపై దృష్టి పెట్టింది. ఆన్‌లైన్‌లో నిపుణుల వీడియోలు చూస్తూ పోర్ట్రెయిట్‌లు గీయడం సాధన చేసింది. ఓ వైపు చదువుకుంటూనే హాబీనీ కొనసాగించింది. కొద్దిరోజుల్లోనే పట్టు సాధించిన షాలిని జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల బొమ్మలు గీసింది. వాటిని సోషల్‌మీడియాలో ఉంచడమే కాదు, దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్లనూ పెట్టింది. వాటికి ఫాఓయర్లు పెరగడమే కాదు.. ప్రముఖుల నుంచీ ప్రశంసలొచ్చాయి. యూనియన్ మినిస్టర్ భూపేంద్ర యాదవ్, రాజస్థాన్ అటవీశాఖ మంత్రి సంజయ్ శర్మ ఆమె చిత్రాలను స్వయంగా మెచ్చుకున్నారు. దీంతో ఆమె వేసే పోర్ట్రెయిట్‌లకు ఆదరణ బాగా పెరిగింది. దేశీయంగానే కాదు, విదేశాల నుంచీ ఆర్డర్లు మొదలయ్యాయి. నా కోరిక చెప్పినప్పుడు అమ్మ ప్రోత్సహించింది. అందుకే ఉత్సాహంగా చిత్రాలు గీయడం మొదలుపెట్టా. ఒక్కోటీ వేయడానికి 45 రోజుల వరకూ పడుతుంది. కొంత మొత్తం తీసుకుని వీటిని వేసిస్తా. అందరూ మెచ్చుకుంటోంటే ఆనందంగా అనిపిస్తోంది. నా స్ఫూర్తితో మరికొందరు తమకు నచ్చింది చేసినా చాలు. తల్లిదండ్రులూ మా అమ్మలా పిల్లల ఆసక్తులను గమనించి వాళ్లు కోరుకునే క్రియేటివ్ రంగంలో ప్రోత్సహించాలి అంటోంది 24 ఏళ్ల షాలిని. ఆలోచించాలే కానీ కష్టకాలంలోనూ అవకాశాలను దక్కించుకోవచ్చు అన్న పాఠం ఈ అమ్మాయి ప్రయాణం ద్వారా నేర్చుకోవచ్చు అంటే అతిశయోక్తి కాదేమో కాదూ. □

# దివ్యాంగులు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తూ..



**28 ఏళ్లకే మూడు ఓపెన్ హార్ట్ సర్జరీలు జరిగినామెకు. ఇంకొకరైతే భవిష్యత్తు గురించిన బెంగతో కాలం గడిపేవారేమో! కానీ, హైమావతి పాతిన అలా కాదు. సేవ వైపు అడుగులు వేశారు. ఇప్పటికే 'కేర్ అండ్ లవ్' సంస్థ ద్వారా మానసిక దివ్యాంగులు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న ఆమె... తాజాగా 'హర్ సేఫ్' సంస్థను ప్రారంభించి మహిళా సాధికారత దిశగా కృషి చేస్తున్నారు. ఆంత్రప్రెన్యూర్గా, ఫిలాంత్రపిస్టా రాణిస్తున్నారు. ఆ ప్రయాణం తెలుసుకుందాం..**

కాలం అనుకోని సవాళ్లను ఇవ్వొచ్చు. కానీ, వాటిని జయించి ముందుకెళ్తేనే ఏదైనా సాధించగలం అని నమ్ముతాను. మా సొంతూరు శ్రీకాకుళం జిల్లా, పొందూరు. నా పన్నెండో ఏట గుండె సంబంధిత సమస్యలున్నట్లు వైద్యులు నిర్ధారించారు. 28ఏళ్లు వచ్చేసరికి మూడు హార్ట్ సర్జరీలు జరిగాయి. డిప్రెషన్‌కి వెళ్లా. కానీ, ఎన్నాళ్లు... జీవితానికి ఓ అర్థాన్ని సృష్టించుకోవాలనుకున్నా, సర్జరీ సమయంలో 'ఇక నేను బతకను అనుకున్నా. ఒకవేళ బతికి బయటపడితే ఎవరికైనా సాయం చేయాలని నిర్ణయించుకున్నా. కోలుకున్నాక... ఏం చేద్దాం అని ఆలోచిస్తున్నప్పుడు మానసిక దివ్యాంగుల గురించి తెలిసింది. ఆహారం దగ్గరపెట్టినా కూడా తమంత తాము తినలేని పరిస్థితి వారిది ఇలాంటి వాళ్లకు సాయం చేయాలనుకున్నా. అలా 14ఏళ్ల క్రితం మానసిక దివ్యాంగులు, అనాథలకోసం విశాఖపట్నంలో 'కేర్ అండ్ లవ్' హోమ్‌ని ప్రారంభించారు. బ్లడ్ క్యాన్సర్ ఉన్న ఓ పాప గురించి తెలిసింది. చికిత్సకి రూ. 45"లక్షలు ఖర్చవుతాయన్నారు వైద్యులు. నిరుపేద కుటుంబం వాళ్లది. అప్పటికి నేను ఉద్యోగం చేయట్లేదు. భర్త, అమ్మానాన్నల సాయంతో సంస్థను నడిపిస్తున్నా. తనికి రూ. లక్ష దాకా మాత్రమే ఇవ్వగలిగాను. అప్పుడనిపించింది. నేను కూడా సంపాదిస్తే, ఇంకా ఇచ్చేదాన్ని కదా అని దాంతో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నా. మావారు కూర్మారావు సాయంతో యూఎస్ వ్యాపారం ప్రారంభించాను. అలా వచ్చిన డబ్బు, స్థానిక దాతల సాయంతో సంస్థను నడిపిస్తున్నా. ప్రస్తుతం 200 మంది పిల్లలు సాయం పొందుతున్నారు. 25 మంది దాకా పూర్తి సమయంలో హోమ్‌లోనే ఉంటారు. వాళ్లకు వైద్యం ఆహారం విద్య నివాసం. వంటి సౌకర్యాలు కల్పిస్తున్నా. ఇదొక్కటే కాదు. మొదట్లో నలుగురు పిల్లల్ని దత్తత తీసుకుని వాళ్లకు నెలనెలా స్పాన్సర్‌షిప్ ఇచ్చి ఇంజినీరింగ్ వరకూ చదివించా. ఊళ్లో ఎవరికి అనారోగ్య సమస్యలు ఉన్నా చేతనైనంత సాయం చేస్తుంటా. నా భర్త, అమ్మ లక్ష్మి, నాన్న పిఎస్.రావు వద్దతు లేకపోతే ఇదంతా అసాధ్యం అనిపిస్తుంటుంది.



**హర్ సేఫ్'తో...**మూడో ఓపెన్ హార్ట్ సర్జరీ సమయంలో వాడిన మందుల వల్ల నాకు అనారోగ్య సమస్యలు వచ్చాయి. హిమోగ్లోబిన్ స్థాయులు పడిపోయేవి వీటన్నింటి నుంచీ కోలుకునేందుకు జీవనశైలి. మార్చుకున్నా ధ్యానం, వ్యాయామం.. తాత్కాలిక చేశా. నిజానికి 30, 40ల్లోకి అడుగుపెట్టిన మహిళల రక్తహీనత, హార్మోన్లలో మార్పులు, కాల్షియం లోపం... వంటి సమస్యలు చుట్టుముడతాయి. అలాంటి వారికి సాయమందించాలనే సంకల్పంతో 'హర్ సేఫ్' ప్రారంభించా క్షేత్రస్థాయి నుంచి చేయాలనుకున్నా. రోడ్డు పక్కన నివసించే మహిళలకీ, మతిస్థిమితం లేని వారికీ దుస్తులు, శానిటరీ ప్యాడ్స్, సరకులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్‌లు అందజేస్తున్నా. టెన్త్‌తో చదువు ఆపేసిన మహిళలు, గృహిణులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, వీడియో ఎడిటింగ్ వంటివి నేర్పిస్తున్నా. మానసిక దివ్యాంగుల్లో... కొంచెం మెరుగ్గా ఉన్నవాళ్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా 'హర్ సేఫ్' పేరుతో శానిటరీ ప్యాడ్లు తయారుచేయించా. త్వరలోనే వాటిని హైస్కూల్ విద్యార్థినులకీ, మురికివాడల్లోని అమ్మాయిలకూ పంపిణీ చేయనున్నాను. అన్ని దగ్గరు నేనే చేయాలన్నది నా కోరిక. అందుకే, ఏడాదిక్రితం మన దేశానికి తిరిగొచ్చా. ఇక్కడే ఏదైనా వ్యాపారం ప్రారంభించండి, ఆ సంపాదనతో సమాజానికి సేవ చేయాలని అనుకుంటున్నారా. అందుకు ఆర్థిక స్వేచ్ఛతోపాటు, ఏ పరిస్థితినైనా ఎదుర్కోగలిగే శక్తిని సంపాదించాలి. ఈ సాయాన్ని మరింతమందికి విస్తరించాలన్నది నా లక్ష్యం. 'ఇంకెన్ని రోజులు ఈ సంస్థను నడిపిస్తావ్' అని కొందరు స్నేహితులు, తెలిసిన వాళ్లు అడుగుతారు. 'నా గుండె లయ ఉన్నన్ని రోజులు' అని సమాధానరమిస్తుంటా. □

# కరివేప్యాక్!

కూరల్లో కరివేపాకు కనిపించగానే.. పక్కన పడేస్తుంటారు. కానీ, అనేక ఔషధ గుణాలున్న కరివేపాకు.. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెడుతుంది. ఆయుర్వేదంలోనూ విరివిగా ఉపయోగపడుతుంది. అయితే.. అందాన్ని మెరుగుపరచడంలోనూ కరివేపాకు ముందుంటుంది. కరివేపాకు ఫేస్ ప్యాక్..మచ్చలేని, కాంతిమంతమైన చర్మాన్ని అందిస్తుంది. కరివేపాకులో యాంటి ఆక్సిడెంట్లు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు, యాంటి మైక్రో బయల్ వంటి గుణాలు పుష్కలం. ఇవి చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. చర్మాన్ని మెరిసేలా చేయడంలోనూ సాయపడతాయి. కరివేపాకులో ఉండే ఔషధ గుణాలు.. చర్మానికి తేమను అందిస్తాయి కూడా!



కొన్ని కరివేపాకులను నీటిలో వేసి ఉడకబెట్టాలి. చల్లారాక.. మిక్సీలో వేసి పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పేస్ట్‌కు తేనె కలిపి.. ముఖం, మెడ, చేతులకు ప్యాక్‌లా రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే.. ముఖంపై మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. వారంలో రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే.. ముఖం ప్రకాశవంతం గా తయారవుతుంది. కరివేపాకు పేస్ట్‌లో రెండుమూడు నిమ్మరసం చుక్కలు వేసి.. ముఖానికి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత ముఖాన్ని కడిగేసుకుంటే.. చర్మం కాంతిమంతం గా మారుతుంది. కరివేపాకు పేస్ట్‌కు, కొద్దిగా పాలు కలిపిముఖానికి ప్యాక్ వేసుకున్నా.. మచ్చలు, ముడతలు తగ్గుతాయి. □

# సీతాఫలంతో ఎన్నో లాభాలు..



ఏ రుతువులో లభించే పండ్లను ఆయా రుతువుల్లో తప్పకుండా తినాలన్న విషయం తెలిసిందే వివిధ కారణాల వల్ల చాలామంది ఈ సూత్రాన్ని అంతగా పాటించరు. ఆశ్వయుజ, కార్తిక మాసాల్లో సమృద్ధిగా లభించే సీతాఫలం, ఆకుపచ్చగా, తియ్యగా ఉండే ఈ అమృత ఫలం శరీరానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది. సీతాఫలంలో క్యాల్షియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు ఆరోగ్యంగా, బలంగా ఉంచేందుకు దోహదపడతాయి. ఇందులో విటమిన్ బి6 కూడా ఎక్కువగా ఉంటుంది. మధుమేహం, ఉన్నవాళ్లు కూడా సీతాఫలాన్ని మొహమాటం లేకుండా తినొచ్చు. దాదాపు ఎక్కువగా ఉండే పదార్థ మధుమేహం వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. సీతాఫలం మూడ్ను, రోగాన్నిస్తుంది. వాతాన్ని నివారిస్తుంది. కండ్లు, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. అజీర్తిని అరికడు తుంది. అల్బర్లు, ఎసిడిటీని నివారిస్తుంది. చర్మానికి మునుపుదనాన్ని ఇస్తుంది. మెదడును ఆరోగ్యం గా ఉంచుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులను పెంచుతుంది. ఊబకాయం, క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. పండ్లను భోజనం తర్వాత కానీ, భోజనంతోపాటు కానీ తినకూడదని పోషకాహార నిపుణుల సూచన. ఉదయం 11, సాయంత్రం 4 గంటల సమయంలో తినాలట, ఒకసారి ఒక రకం పండును తింటే మంచి రసం తీయడం కంటే పండుగ తింటేనే ఎక్కువ ప్రయోజ నం. సీతాఫలాన్ని పండుగనే కాకుండా బాసుంది ఫోర్, ఐస్క్రీం, హల్వా, కేకుల్లో కూడా వాడుకోవచ్చు. □

# ఎగ్ అందానికీ, శిల్పాలకు ..

**అందంగా, ఆకర్షణీయంగా కనిపించడానికి అమ్మాయిలు రకరకాల క్రీములు ఎన్నో వాడుతుంటారు.** కానీ, మేనికి అందాన్ని తేవడంలో సహజ పదార్థాలకు మించినవి లేవనడం అతిశయోక్తి లేదు. అలాంటి వాటిలో కోడిగుడ్డు కూడా ఒకటి.చర్మం, శిరోజాల సంరక్షణకు భలేగా పనిచేస్తుంది. గుడ్డులోని తెల్లసొనలో కాస్తంత మొక్కజొన్నపిండి, చిటికెడు పంచదార కలిపి, మెత్తని పేస్టులా తయారుచేసి ముఖానికి రాసుకుంటే సరి. ముఖం, పై పెదవి మీద ఉంటే అవాంచిత రోమాలు తొలగిపోతాయి. చర్మం బిగుతుగా తయారై, నల్లమచ్చలనీ తొలగిస్తుంది. దీన్లో ఉండే విటమిన్లు, మల్టీ విటమిన్లు చర్మానికి తేమనందించి మృదువుగా ఉండేలా చేస్తాయి.





కళకు అనర్హం అన్నట్లుగా కోడిగుడ్డు పెంకులతో అనేక కళాఖండాలు తయారు చేస్తున్నారు. మొజాయిక్ ఆర్ట్‌లో రకరకాల జంతువులు, పక్షులు, మొక్కల్లాంటి అందమైన చిత్రాలు, అద్భుతమైన శిల్పాలుగానూ మారుస్తు న్నారు. ఇక సూక్ష్మంగా, సున్నితంగా చేసే ఎగ్ కార్వింగ్లనూ సృజనాత్మకంగా తీర్చిదిద్దుతారు కళాకారులు. ఏది ఏమైనా గుడ్డు అందానికి అందం ఇవ్వడంతోపాటు, ఆర్ట్ రూపంలో ఆకర్షణీయ రూపాల్లోకీ మారుతోంది. □



# అల్లం-వెల్లుల్లి పేస్ట్ పాడవకుండా!

మనం రోజూ చేసుకొనే కూరలు, మాంసహార వంటకాల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయనిదే వాటి తయారీ పూర్తి కాదు. వంటకాలకు రుచిని అందించడంలో దీని తర్వాత ఏదైనా అని చెప్పచ్చు. అలాగని రోజూ దీన్ని తయారుచేసుకోవడం పెద్ద పని. అందుకే ఎక్కువ మొత్తంలో తయారుచేసుకొని నిల్వ చేసుకుంటారు చాలామంది. అయితే ఈ కోరిక ఇది పాడైపోకుండా ఎక్కువ రోజులు ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే. నిపుణులు, అమెటో తెలుసుకుందాం..

◆ .తేమ తగిలితే ఏ పదార్థమైనా త్వరగా పాడైపోతుంది. అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా అంతే! అందుకే దీని తయారీలో వాడే అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బల్ని శుభ్రం చేసినా.. పొడిగా తుడివాకే మిక్సీ పట్టుకోవాలి. ఎందుకంటే ఇది ఎక్కువ కాలం మన్నుతుంది.



◆ అల్లం వెల్లుల్ని పేస్ట్ తయారుచేసుకున్నాక.. ఈ మిశ్రమానికి ఒకటిన్నర టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు/పల్లీ/ఆలివ్ నూనె, టీస్పూన్ ఉప్పు కలిపి, గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఇవి సహజసిద్ధమైన ప్రిజర్వేటి పనిచేసి.. అల్లం వెల్లుల్ని పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేస్తుంది.

◆ అల్లంవెల్లుల్లి పేస్ట్ని గాలి చొరబడని జిల్లాక్ బ్యాగ్లో వేసి రిఫ్రిజిరేటర్లో భద్రపరిచినా ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది. అయితే దీనికి ఎలాంటి రంధ్రాలు, లీకేజీలు చూసుకోవడం ముఖ్యం.

◆ కొన్నిసార్లు అల్లం వెల్లుల్లి పేస్ట్ పైలేయర్ పసుపు లేదా ఆకుపచ్చ రంగులోకి మారడం గమనిస్తాం. ఇలా మారడం కూడా అది పాడవుతుందనడానికి ఓ సంకేతమే అంటున్నారు నిపుణులు. ఇలా జరగకుండా ఈ పేస్ట్‌లో టీస్పూన్ నిమ్మరసం వేసి.. గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.

◆ క్లింగ్ ఫిల్మ్, పార్మెంట్ పేపర్.. వీటికి బయటి వాతావరణంలోని తేమ, జిడ్డుదనాన్ని ఆపే లక్షణాలుంటాయి. అందుకే అల్లం వెల్లుల్లి పేస్ట్ని గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకొని.. ఆ గ్లాస్ జార్న క్లింగ్ ఫిల్మ్/పార్మెంట్ పేపర్‌తో మూసేయాలి. ఇది ఈ పేస్ట్ ఎక్కువ కాలం తాజాగా ఉండేందుకు సహాయపడుతుంది. మార్కెట్లో మనం కొనే చాలాపార్యూ క్లింగ్ ఫిల్మ్/మెంట్ పేపర్‌తో సీల్ చేసి రావడం మనం చూస్తుంటాం. ఆయా పదార్థాలు ఎక్కువ కాలం తాజాగా ఉండడానికే ఇలా ప్యాక్ చేస్తుంటార!

◆ అల్లం వెల్లుల్లి పేస్ట్ చిన్న చిన్న ముద్దల్లా చేసుకోవాలి. వీటిని ఫాయిల్ పేపర్/ఐస్క్యూబ్ ట్రేలో పెట్టి కొన్ని గంటల పాటు ఫ్రీజర్‌లో ఉంచాలి. దీనితో ఈ బాల్స్ గడ్డకట్టుకుపోతాయి. ఇప్పుడు వీటిని గాలి చొరబడని జిల్లాక్ బ్యాగ్లో వేసి.. ఫ్రిజ్లో పెట్టుకోవాలి. ఇలా ఫ్రీజ్ అయిన ఈ బాల్స్ కనీసం మూడు నెలల పాటు నిల్వ ఉంటాయ! కావాలనుకున్నప్పుడు ఒక బాల్ తీసుకొని నేరుగా వంటకాల్లో వేసుకుంటే సరిపోతుంది.

◆ అల్లం వెల్లుల్లి పేస్ట్ భద్రపరచుకునేలా గాలి చొరబడని గ్లాస్ జార్‌లో నింపుతాం. ఇప్పుడు ఈ పేస్ట్ పైలేయర్ మునిగేలా వెనిగర్ పోయాలి. ఆపై మూత గట్టిగా బిగించి ఫ్రిజ్లో పెట్టేయాలి. ఇలా నిల్వ చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్ కొన్ని నెలల పాటు తాజాగా ఉంటుంది.

◆ నిల్వ చేయాలనుకున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ బేకింగ్ షీట్లపై పరిచి.. 50 సెంటీగ్రేడ్ ఉండే ఉష్ణోగ్రత వద్ద కాసేపు అవెన్‌లో పెట్టాలి. దీనివల్ల అందులో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఇప్పుడు దీన్ని గాలి చొరబడని సీసాలో వేసి ఫ్రిజ్లో పెట్టుకోవాలి. ఇలా డీహైడ్రేట్ చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. □

# పోషకాలు అందించే నీళ్లు..



ఉదయాన్నే ఓ గ్లాసు గోరు వెచ్చని నీళ్ల తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే, వట్టి నీళ్ల కాకుండా అందులో పండ్లు, మూలికలు, కూరగాయలు లాంటివి వేసిన 'ఇన్ఫ్యూజ్డ్' నీటిని తాగడం అలా కొంత మంది అమ్మాయిలకు అలవాటు. ఇవి ఆరోగ్యానికి మంచిదే అయినా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. నిపుణులు.

**జ్ఞాపకశక్తి పెంచే నెయ్యి...** గోరువెచ్చని నీళ్లలో ఓ టీస్పూన్ నెయ్యి వేసుకుని పరగడుపున తీసుకుంటే మెటబలిజం మెరుగుపడుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. హార్మోన్ల క్రమం తప్పకుండా అయ్యి, పీరియడ్స్ క్రమం తప్పకుండా వస్తాయి. వయసు పైబడేకొద్దీ మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గిపోతుంటుంది. కాబట్టి, నెయ్యిని రోజూ తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. గుండె ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెరుగుతాయి. అయితే, రోజుకి ఒకటి లేదా రెండు టీస్పూన్ల కంటే ఎక్కువగా తీసుకోవద్దు అంటున్నారు న్యూట్రిషనిస్టులు, నెయ్యిని అధికంగా తీసుకుంటే బరువు పెరిగే అవకాశం ఉంది. అది కూడా ఖాళీ కడుపుతో తీసుకునేట ప్పుడు శరీరం ఎలా ప్రతి స్పందించాలో గమనించుకుని కొనసాగుతుంది.

**మెరిపించే మునగ...** మెరిసే చర్మం కోరుకోని ఆడవాళ్లు ఎవరు? అందుకే, మునగాకుని నీళ్లలో వేసుకుని తాగుతుంటారు. ఇందులో ఉండే విటమిన్ ఎ, సి, ఈ, కాల్షియం, పొటాషియంలు చేసే మేలెంతో, మునగ రక్తంలో చక్కెరస్థాయులనునియంత్రిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, గర్భధారణ సమయంలో వచ్చే భావోద్వేగాలను అదుపులో ఉంచడంలోనూ దీని పాత్ర కీలకం. తల్లుల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది. అందుకే, దీన్ని 'పోషకాల గని' అంటారు. అయితే, మునగ నీళ్ల వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందట. ముఖ్యంగా అధిక మొత్తంలో తీసుకుంటే విరేచనాలు, కడుపునొప్పి, వికారం లాంటివి వస్తాయంటున్నారు నిపుణులు.

**బ్యాక్టీరియకకాలను అరికట్టే ఉప్పు...** కొంతమంది గోరువెచ్చని నీటిలో కాస్తంత ఉప్పు వేసుకుని తాగుతారు. దీనివల్ల శరీరానికి ఎలక్ట్రోలైట్లు అందాయి నరాల పనితీరు మెరుగుపడుతుంది. ఆ నీటితో పుక్కిలిస్తే, నోట్లో ఉంటే చెడు వాతావరణం నశించి, నోటి ఆరోగ్యమూ బాగుంటుంది. అయితే, రోజుకి 5గ్రాములు(టీస్పూన్) కంటే అధికంగా ఉప్పు తినొద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మోతాదు ఎక్కువైతే వాంతులు, అధిక రక్తపోటు.. లాంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి, వీటన్నింటి వల్ల ప్రయోజనాలు, జాగ్రత్తలూ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. □

# కార్తికంలో దానం

మనం ఏ పురాణాన్ని చదివినా మానవతా దృక్పథాలు కనబడతాయి. కార్తీక పురాణములో ఒక కథ ఉంది. కార్తీక మాసంలో ఏ దానము ముఖ్యమో, ఎవరికి దానము ఇవ్వలేనో చెప్పమని జనకుడు వశిష్టమహర్షిని అడిగాడు.. అన్ని దానాలు మంచివేనంటూ దీపదానము అతిముఖ్యమని శివాలయమునగాని, వైష్ణవాలయమునగాని దీపదానం చేయటం, దీపాన్ని వెలిగించటం మంచిదని వశిష్ట మహర్షి చెప్పి, ఉదాహరణకు ఒక కథ చెబుతాడు. పూర్వము పాంచాల దేశమును పాలిస్తున్న రాజు సంతానములేక ఎన్నెన్నో యజ్ఞ యాగాదులను చేశారు. అయినా సంతానము కలుగలేదు. ఆయన విసుగు చెంది గోదావరి తీరాన తపస్సుకు కూర్చున్నాడు. పిప్పలాదుడను మునిపుంగవుడొచ్చి ఎందుకు తపస్సు చేస్తున్నావని అడిగాడు. సంతానము కొరకు అవి రాజు చెప్పాడు. ఆ ముని రాజుతో, "ఓయీ! కార్తీక మాసమున శివ సనిధిని శివదేవుని ప్రతికొరకు దీపదానము చేస్తే నీ కోరిక తీరుతుంది. అని చెప్పాడు. అత్యంత భక్తితో శివాలయమున కార్తిక మాసమంతా దీపారాధన చేసి, ఆ రాజు భార్య గర్భవతి అయి ఒక కుమారుని కన్నది మనకు కార్తీక పురాణములో కనబడే కథ. అన్ని దానాలు మంచిమే శివాలయం, వైష్ణవాలయం రెండు పుత్ర స్థలాలే. భేదం లేదు. యజ్ఞయాగాదులు చేసే సంతానం కలుగలేదు. సంతానం కొరకు తపిస్తే, సరైన మార్గదర్శి వచ్చాడు. ఏవిషయం లోనైనా తపన తపస్సు) ముఖ్యం, అది ఉంటేనే ఉద్దేశం నెరవేరుతుంది..దానము చేస్తే శివుడు ప్రతి నొందుతాడు. కోరిన వరాన్ని ఇస్తాడు. చేసే ఆ దానం నిర్లక్ష్యంతో చేయరాదు, భక్తి శ్రద్ధలతో చేయాలి విద్యుచ్ఛక్తి లేని ఆ రోజుల్లో ఊరికి కేంద్రమైన ఆలయం ప్రతి సాయంత్రం దీప కాంతులను దశ దిశల వ్యాపింప చేయాలన్న సద్భావంతో ఆలయంలో దీపాలను వెలిగించాలి అని చెప్పి ఉంటారని అర్థమవుతుంది. అంతేకాదు, ఇంట్లో దీపం కూడా వెలిగించుకోలేని పేదరికంలో మ్రగ్గుతువు వారికి ఉపకారం చేసే దృష్టితో దీప దానం చేయండి, ఇతర దానాలు చేయండి, మీకు మంచి కలుగుతుంది అని ధనవంతులకు హితవు చెప్పినట్లు తెలుస్తుంది మనం నీతిని గ్రహించి, నేటి పరిస్థితుల్లో ఎవరికి ఏది అవసరమో దాన్ని దానం చేయాలి ఋషుల ఆశయం నెరవేరుతుంది

- రాచమడుగు శ్రీనివాసులు



ఆధ్యాత్మికం

# మైక్రో-డోసింగ్ ఇప్పుడిదే ట్రెండ్ !

ఉదయాన్నే లేవాలి. జిమ్ముకు వెళ్లాలి. నడక, పరుగుకు సమయం కేటాయించాలి. మెట్లు ఎక్కి దిగాలి. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పాటుచేసుకోవాలని కోరుకోని మహిళలు ఉంటారా? ఇక కాలేజీ అమ్మాయిల విషయంలో చెప్పనక్కర్లేదు. ఫిట్‌నెస్ అంశానికి ఫిదా అయ్యి వేలకు వేలు జిమ్‌లకు కడుతున్నారు. అయితే ఈ ప్రణాళికలన్నీ మాటల్లోనే... క్షేత్రస్థాయిలోకి వచ్చేటప్పటికీ సమయం లేదు, నిద్రలేమి, అలసట, ఈరోజు వద్దులే రేపు వెళ్లాం అంటూ సరిపెట్టుకుంటున్నారు. దాంతో రోజువారీ కార్యకలాపాల్లో ఒకేచోట స్థిరంగా ఉండిపోతూ శరీరానికి కదలికలు లేక అనారోగ్యాల పాలవుతున్నాయి.




మీరూ ఆ కోవకు చెందిన వారేనా... అయితే ఇలాంటి వారందరికీ ఈ మైక్రోడోసింగ్ ట్రెండ్ సరిగ్గా సరిపోతుంది. రోజులో విడతల వారీగా శరీరానికి కావాల్సిన శ్రమను అందించడమే మైక్రోడోసింగ్. జిమ్‌కంటూ ప్రత్యేకంగా సమయం కేటాయించకుండా. డెస్క్‌లూ, ఆఫీసులూ, స్కూళ్లూ, కాలేజీలూ ఇలా ప్రాంతమేదైనా.. కూర్చున్న చోటే వ్యాయామం చేయడం. టీ బ్రేక్స్ తీసుకుని బాల్కనీ దాకా నడవడం, అలారం పెట్టుకుని మరీ ఆఫీస్ చుట్టి రావడం.. దీనిలోని ప్రత్యేక అంశాలు. అయితే ఇవన్నీ ఇప్పటికే చాలామంది పాటిస్తున్నా.. ఈ మధ్య ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఎక్కువైందని ఇటీవల విడుదలైన హెల్త్ సర్వేలు చెబుతున్నాయి. బాగా ఒత్తిడిగా అనిపించినప్పుడో.. అలసట, ఆందోళనా చుట్టుముట్టినప్పుడో మైక్రో-డోసింగ్ అంటూ ఈ తరహా వ్యాయామాలు చేసునతన్నారట. మీరూ చేస్తున్నారా? లేకపోతే మొదలుపెట్టండి మరి. □



## ఆసియా యూత్ గేమ్స్
# స్వర్ణం సహా ప్రీతికి డబుల్ మెడల్స్

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ప్రీతిస్మిత భోయ్ యూత్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. ఈ గేమ్స్‌లోని వివిధ విభాగాల్లో ప్రీతి స్వర్ణం, రజత పతకాలను సాధించింది. బహ్రెయిన్‌లోని మనామాలో సోమవారం జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో ప్రీతిస్మిత భోయ్ 92 కిలోల బరువును ఎత్తి యూత్ వరల్డ్ రికార్డ్‌తో వెయిట్ లిఫ్టింగ్‌లో క్లీన్ జెర్క్ స్వర్ణం సాధించింది. ఆమె స్నాచ్ విభాగంలో 66 కిలోల ఎత్తి రజత పతకాన్ని కూడా గెలుచుకుంది, కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో ఆమె మునుపటి యూత్ నేషనల్ రికార్డును ఈ సారి 3 కిలోలు అధిగమించింది. గత సంవత్సరం యూత్ వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 76 కిలోల లిఫ్ట్‌తో ఆమె నెలకొల్పిన 40 కిలోల కేటగిరీ రికార్డు తర్వాత, 16 ఏళ్ల ఆమె సాధించిన రెండవ యూత్ ప్రపంచ రికార్డు ఇది. ఆమె తన మొదటి ప్రయత్నంలోనే స్నాచ్‌లో విజయవంతంగా 66 కిలోల బరువును ఎత్తడంతో రోజును ప్రారంభించింది. కానీ తదుపరి రెండు ప్రయత్నాలలో వరుసగా 68 కిలోలు మరియు 69 కిలోలు ఎత్తడంలో విఫలమైంది. దీని వలన ఆమె డబుల్ స్వర్ణం సాధించే అవకాశాన్ని కోల్పోయింది, ఎందుకంటే చైనాకు చెందిన జిహాంగ్ వు స్నాచ్‌లో ఆమెను అధిగమించి 68 కిలోల ఉత్తమ ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించింది.



## కెనడా మహిళల ఓపెన్
# వరల్డ్ ర్యాంకర్‌ను ఓడించిన అనాహాత్

**న్యూఢిల్లీ:** కెనడా మహిళల స్క్వాష్ ఓపెన్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్‌ను అనాహత్ సింగ్ ఓడించింది. టొరంటోలో జరిగిన కెనడియన్ మహిళల ఓపెన్ స్క్వాష్‌లో భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ ర్యాంక్‌లో 43వ స్థానంలో ఉన్న 17 ఏళ్ల అమ్మాయి అనహత్, ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ మెలిస్సా అల్వేస్‌ను 17 నిమిషాల్లో 3-1 (12-10, 12-10, 8-11, 11-2) తేడాతో ఓడించింది. ఆమె తదుపరి మంగళవారం బెల్జియంకు చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ మరియు రెండవ సీడ్ టిన్నె గిలిస్‌తో తలపడనుంది. కాగా ఈ నెల ప్రారంభంలో, ఐదు ఆటల థ్రిల్లర్‌లో ఈజిప్టుకు చెందిన జానా స్వైఫీ చేతిలో ఓడిపోయిన తర్వాత అనాహత్ బోస్టన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ నుంచి నిష్క్రమించింది. అయితే ఆగస్టులో అనాహత్ ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ 46కి చేరుకున్నప్పుడు మొదటిసారి టాప్ 50లోకి ప్రవేశించింది.

## మహిళల వన్డే వరల్డ్ కప్..
# సెమీస్‌కు వర్షం ఎఫెక్ట్

### ఇండియా, ఆస్ట్రేలియా ఫైనల్?





**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్స్ నాలుగు జట్ల మధ్య జరగనుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, భారత జట్టు సెమీఫైనల్స్‌లో తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఆస్ట్రేలియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. టీమిండియా నాల్గవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందువల్ల, భారత్, ఆస్ట్రేలియా సెమీఫైనల్స్‌లో తలపడతాయి. ఈ రెంటి మధ్య సెమీఫైనల్స్ మ్యాచ్ ఈ నెల 30న జరుగుతుంది. అలాగే ఇంగ్లాండ్ రెండవ సెమీఫైనల్లో ఈ నెల 29న దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. సెమీఫైనల్ చిత్రం స్పష్టంగా ఉన్నప్పటికీ, వర్షం భయం ఉంది. శ్రీలంకలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఇప్పుడు మొంథా తుపాన్ ప్రభావంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అందువల్ల, సెమీఫైనల్‌లో వర్షం పడితే విజేతను ఎలా నిర్ణయిస్తారనే ప్రశ్న తలెత్తుతుంది. గ్రూప్ దశలో వర్షం పడి మ్యాచ్ రద్దు అయితే, రెండు జట్లకు చెరో పాయింట్ ఇవ్వనున్నారు. కానీ, ఈ నియమం సెమీఫైనల్‌కు వర్తించదు. కాబట్టి, సెమీఫైనల్‌లో వర్షం పడి మ్యాచ్ రద్దు చేస్తే, ఫలితం ఎలా నిర్ణయించనున్నారో అనేది చర్చ జరుగుతోంది. సెమీఫైనల్స్‌లో వర్షం పడితే మ్యాచ్‌ను కొనసాగించడానికి రిజర్వ్ డేను నిర్ణయించారు. షెడ్యూల్ చేసిన రోజున మ్యాచ్ జరగకపోతే, మరుసటి రోజు మ్యాచ్ జరుగుతుంది. అంటే, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మధ్య జరిగే మ్యాచ్‌లో వర్షం పడితే, ఆ మ్యాచ్‌ను మరుసటి రోజు నిర్వహిస్తారు. మరోవైపు, భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌లో కూడా అదే పరిస్థితి తలెత్తితే, ఈ నెల 31ని రిజర్వ్ డేగా పక్కన పెట్టారు. రిజర్వ్ డేన కూడా వర్షం కారణంగా మ్యాచ్ జరగకపోతే, పాయింట్ల పట్టిక ఆధారంగా ఫలితం నిర్ణయించబడుతుంది. అంటే, వర్షం కారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగకపోతే, ఆస్ట్రేలియాకు చివరి రౌండ్‌కు టికెట్ లభిస్తుంది. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో ఉన్న జట్టుకు ముందుకు సాగే అవకాశం లభిస్తుంది. ఇక ఫైనల్స్‌కు రిజర్వ్ డేను రిజర్వ్ చేశారు. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. వర్షం కారణంగా ఆ రోజు మ్యాచ్ జరగకపోతే, నవంబర్ 3న జరుగుతుంది. అయితే, ఈ రోజు కూడా మ్యాచ్ జరగకపోతే, ఫైనల్‌కు అర్హత సాధించిన రెండు జట్లను విజేతలుగా ప్రకటిస్తారు.






## ఆసియా రగ్బీ ట్రోఫీలో..
# రన్నరప్‌గా భారత్



**న్యూఢిల్లీ:** ఆసియా రగ్బీ ఎమిరేట్స్ ట్రోఫీ-2025లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. కోచ్ బెన్ గొల్లింగ్స్ నేతృత్వంలోని భారత్ జట్టు ఆసియా టాప్‌టైర్ సెవెన్స్ సిరీస్‌కు అర్హత సాధించింది. మస్కట్‌లో జరిగిన ఆసియా రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ ట్రోఫీలో భారత సీనియర్ పురుషుల రగ్బీ సెవెన్స్ జట్టు రన్నరప్‌గా ప్రచారాన్ని ముగించింది. అగ్రశ్రేణి రగ్బీ సెవెన్స్ పోటీ అయిన ఆసియా రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ సిరీస్ కి ప్రమోషన్‌ను సంపాదించింది. మాజీ ఇంగ్లాండ్ అంతర్జాతీయ ఆటగాడు, ప్రధాన కోచ్ బెన్ గొల్లింగ్స్ నేతృత్వంలో, భారత జట్టు టోర్నమెంట్ అంతటా క్రమశిక్షణ, నైపుణ్యం మరియు స్థితిస్థాపకతను ప్రదర్శించింది. లెబనాన్‌పై 14-10 తేడాతో ఉత్కంఠభరితమైన విజయంతో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది, ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌పై 26-5 తేడాతో విజయం సాధించి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నాకౌట్ దశల వరకు ఈ జోరు కొనసాగింది. క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ ఇరాన్‌ను 21-7 తేడాతో ఓడించి, సౌదీ అరేబియాపై 17-0 సెమీఫైనల్ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ పోరులో, భారత్ రగ్బీ జట్టు తీవ్రంగా పోరాడినా కాని కజకిస్తాన్ చేతిలో 0-27 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా మిగిలింది.

# రంజీలో చరిత్రాత్మక విజయం

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ చరిత్రలో అరుదైన సంఘటన నమోదైంది. కేవలం 90 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది. 91 ఏళ్ల రంజీ ట్రోఫీ హిస్టరీలో ఇంత తొందరగా (ఓవర్ల పరంగా) ముగిసిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. పూర్తిగా బౌలర్ల ఆధిపత్యం కనబర్చిన ఈ మ్యాచ్‌లో 4 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 32 వికెట్లు నేలకూలాయి. ఓవరాల్‌గా 359 రన్స్ నమోదు అయ్యాయి. 2025-26 రంజీలో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎలైట్ గ్రూప్ సి నుంచి సర్వీసెస్-అసోం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అసోం 17.2 ఓవర్లలో 103 రన్స్‌కు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన సర్వీసెస్ 29.2 ఓవర్లకు 108 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో తొలి రోజు ముగియక ముందే మొదటి ఇన్నింగ్స్‌ల్లో రెండు జట్లు ఆలౌట్ అయ్యా యి. చివరి సెషన్‌లోఅసోం రెండోఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారం భించింది. ఇందులో కూడా తొలిరోజే అసోం5వికెట్లు కోల్పోయింది. 565 స్కోర్‌తో తొలి రోజు ఆట ముగిసింది. ఇక రెండో రోజు మొదటి సెషన్ లోనే అసోం ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 565కు అసోం కేవలం 19 రన్స్ జోడించి మిగిలిన 5 వికెట్లు కోల్పోయి 29.3 ఓవర్లలో 75 పరుగులకు కుప్పకూలింది. ఇక71పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇలా ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి మొత్తం 540 బంతులు మాత్రమే ఆడాయి. దీంతో ఓవరాల్‌గా రంజీ చరిత్రలోనే అతి తక్కువ ఓవర్లలో ముగిసిన మ్యాచ్‌గా రికార్డు కొట్టింది.



# దలాల్‌స్ట్రీట్‌లో ఈక్విటీ సూచీల ర్యాలీ



**ముంబయి, అక్టోబరు 27:** దేశీయ స్టాక్ సూచీలో వారం ప్రారంభంలో లాభాలతో పరుగులు తీసాయి. త్రైమాసిక ఫలితాలు,అ ంతర్జాతీయ ధోరణులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇంధనం, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్‌స్టాక్స్ భారీగా ర్యాలీ తీసాయి. అమెరికా చైనా వాణిజ్య చర్చలు కొలిక్కివస్తున్నాయన్న వార్తలకు తోడు అమెరికా ద్రవ్యోల్బణం కొంతమేర దిగిరావడం కూడా ఫెడ్‌రిజర్వు రేట్ కట్‌లకు మార్గం ఏర్పరిచిందని ఇన్వెస్టర్ల అంచనా. బిఎస్‌ఇ సెన్సెక్స్ 566.96 పాయింట్లు పెరిగి 84,788.84 పాయింట్లవద్దముగిసింది. నిఫ్టీ సూచీ కూడా 170.90 పాయింట్లు పెరిగి 25,966.05 పాయింట్లవద్దముగిసింది. ఇక కంపెనీలపరంగాచూస్తే భారతి ఎయిర్‌టెల్ 2.56శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.24శాతం, హెచ్‌డిఎఫ్‌సి 0.82శాతం పెరిగాయి. ఇక బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.72శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51శాతం పెరిగాయి. మొత్తం 2178 కంపెనీలషేర్లుపెరిగితే 2114 షేర్లు క్షీణించాయి. మరో 218 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత విదేశీకరెన్సీ రిజర్వులు 4.496 బిలియన్‌డాలర్లుపెరిగి రికార్డుస్థాయి అంటే 702.28 బిలియన్ డాలర్లకు చేరడం మార్కెట్లకు కలిసొచ్చింది. బంగారం నిల్వలు కూడా 6.181 బిలియన్‌డాలర్లు పెరిగి 108.546 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 87.83వద్ద స్థిరపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ 1.44శాతం క్షీణించి 1,21,676వద్ద కొనసాగాయి. బ్రెంట్ ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 44సెంట్లు పెరిగి 65.50డాలర్లుగా కొనసాగాయి. డౌజోన్స్ ఫ్యూచర్స్ ప్రస్తుతం 259 పాయింట్లుపెరిగింది. యూరోపియన్ సూచీలు అన్నీ కూడా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలకు అనుగుణంగా కదిలాయి. జపాన్‌నిక్కీ రెండుశాతంపెరిగి 50వేల మార్కును చేరింది. నిఫ్టీలో పిఎస్‌యు సూచీ 2.22శాతం పెరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా 5.05, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.38శాతం, సెంట్రల్ బ్యాంకు 2.88శాతం, పీఎన్‌బి 2.78 శాతం, యుకోబ్యాంకు 2.65శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.63శ్రాతం, ఎస్‌బిఐ 2.48శాతం, ఐఒబి 2.15శాతం, పంజాబ్‌సింధ్ బ్యాంకు 1.66శాతం, ఇండియన్ బ్యాంకు 1.63 శాతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 0.53శాతం చొప్పున పెరిగాయి. కోటక్ బ్యాంకు 1.74శాతం క్షీణించింది.


# డెట్ సెక్యూరిటీల్లో రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రాధాన్యం

### ఎక్కువ డిస్కౌంట్లు, ఎక్కువ కూపన్‌రేట్ల ఆఫర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ డెట్ సెక్యూరిటీల మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహవించాలని నిర్ణయించింది. డెట్‌సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూల్లో వీరికి ప్రాధాన్యత ఇచ్చేందుకుగాను ఒక సంప్రదింపుల పత్రం విడుదలచేసింద.ఇ సెబీ ఇందుకోసం కొన్ని ప్రోత్సాహకాలు కూడా సిఫారసుచేసింది. వీరికి ఎక్కువ కూపన్‌రేటు లేదా ఎక్కువ డిస్కౌంట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇష్యూధరకంటే మరికొంత ప్రోత్సాహకం ఉంటే వారి భాగస్వామ్యం పెరుగుతుందని అంచనా. సీనియర్ సిటిజన్లు, మహిళలు, సాయుధదళాల సిబ్బంది వంటి కేటగిరీలకు ఎక్కువప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. ఇటీవలి ఇష్యూ అయిన ఎన్సీడీలలో 81.49 బిలియన్ రూపాయలకు తగ్గడాన్ని సెబీ సీరియస్‌గా తీసుకుంది. అదే గత ఏడాది అయితే 191.68 బిలియన్ రూపాయలు పబ్లిక్ ఇష్యూలో వచ్చాయి. ఈ తగ్గుదలను భర్తీ చేసేందుకు రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రాధాన్యం పెంచాలని నిర్ణయించింది. అయితే సెబీ జారీ చేసిన ఈ సంప్రదింపుల పత్రంపై సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలను కోరింది. వచ్చే నెల 17వ తేదీలోపు తమకు తెలియజేయాలని సూచించింది.




# అదానీ ఎనర్జీ నికరలాభం రూ.557 కోట్లు




**ముంబయి, అక్టోబరు 27:** ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ రెండోత్రైమాసికంలో 21శాతం నికరలాభాలను పెంచుకోగలి గింది. 557 కోట్లు ఆర్జించినట్లు ఎక్ఛేంజిలకు నివేదికి చ్చింది. ఏడాదిక్రితం ఇదే కాలంలో 314 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈ త్రమాసికంలో 557కోట్లు రా బట్టింది. ఇక రాబడులు మొత్తం 6767 కోట్లుగా ఉన్నాయి. మొదటి ఆరునెలల కాలంలోనే 13,793కోట్లు ఆర్జించామని కంపెనీ ప్రకటిం చింది. ఇబిటిడా అయితే 2126 కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే 12శాతం పెరిగింది. స్మార్ట్ మీటరింగ్ బిజినెస్‌లో పంపిణీ విభాగం రాబడులు పెరిగాయి. అర్ధసంవత్సర కాలంలో ఎబి టిడా 13శాతం పెరిగి రూ.4144కోట్లుగా ఉంది. మొదటి ఆరునెలల కాలంలోనే 1404 కోట్లుగా ఉంది. రెండో త్రైమాసికంలో 25శాతం పెరిగింది. మార్కెట్ సమయం ముగిసిన తర్వాత కంపెనీ తన ఫలితాలు ప్రకటించింది. కంపెనీ షేర్లు 0.16శాతం పెరిగి బిఎస్‌ఇలో రూ.946 వద్ద ట్రేడ్ అయ్యాయి.

వాణిజ్యం




## ఇండియన్ ఆయిల్ నికరలాభం
# 7817.55 కోట్లు

**ముంబయి, అక్టోబరు 27:** ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రెండోత్రైమాసికంలో 7817.55 కోట్ల నికరలాభం ప్రకటించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 169.58 కోట్ల నికరనష్టం చవిచూసిన సంస్థ ఈ ఏడాది లాభాల్లో దూసుకుపోయింది. అంతర్జాతీయంగా ముడిచమురుధరలు తగ్గడంతో ప్రతి బ్యారెల్‌ముడిచమురుపైనా 19.6 డాలర్లు రాబడి సాధించింది. ఏప్రిల్ సెప్టెంబరుకాలంలో స్థూల రిఫైనింగ్ మార్జిన్ బ్యారెల్‌కు 6.32 డాలర్లుగా ఉంది. అంతకుముందు 4.08 డాలర్లు మాత్రమే ఉండేది. కార్యకలాపాలద్వారా రాబడులు 2.06 లక్షల కోట్లు సాధించింది. వార్షికపద్ధతిలోచూస్తే 3.9శాతం నమోదుచేసింది. మొత్తం వ్యయాలు 1.96 లక్షలకోట్లుగా చూపింది. అంతకుముందు ఏడాది రెండోత్రైమాసికంలో 2.01 లక్షలకోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కూడా 2.14 లక్షలకోట్లు వ్యయాలుచూపించింది. కంపెనీ ఇప్పటివరకూ 17.609 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురును శుద్ధిచేసింది. స్థూలంగా చెప్పాలంటే రాబడులు 2.06 లక్షల కోట్లుకాగా నికరలాభం 7817.55 కోట్లు, ప్రతి వాటాకు రాబడి 5.68 రూపాయలుగా ఉంది.

## టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.148.16 కోట్లు లాభం

**ముంబయి, అక్టోబరు 27:** టాటాస్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రెండోత్రైమాసికంలో నికరలాభం 19.8శాతం పెంచుకోగలిగింది. 148.16 కోట్ల నికరలాభం అర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో 123.69 కోట్లు ఆర్జించిన టాటా ఇన్వెస్ట్‌మెంట్‌కార్పొరేషన్ ఈసారి లాభాలు పెంచుకోగలిగింది. కార్యకలాపాల ద్వారా వచ్చిన రాబడులు 153.98 కోట్లుగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 142.48 కోట్లు రాబడులు నమోదు చేసింది. టాటా గ్రూప్ లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థగా కొనసాగుతున్న మధ్యస్థాయి హోదాతో నడుస్తోంది. రెండో త్రైమాసికంలో డివిడెండ్ల ద్వారా కేవలం 116.44 కోట్లు ఆర్జించింది. కంపెనీ అంతకు ముందు ఏడాది 102.14 కోట్లు రాబట్టినసంగతి తెలిసిందే. ఇక కంపెనీ వ్యయాలు 11.40 కోట్లు పెరిగాయి. అంతకుముందు ఏడాది 9.43కోట్లు మాత్రమే ఉన్నాయి. సోమవారం కంపెనీ స్టాక్ 837.20 వద్దముగిసింది. ముందురోజు కంటే 0.03శాతం క్షీణించినట్లు కనిపించింది.




# డిహెచ్‌ఎఫ్‌ఎల్ ఎండి బెయిల్ పిటిషన్‌పై సిబిఐకి నోటీసులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** డిహెచ్‌ఎఫ్‌ఎల్ ఎండి కపిల్‌వాద్వాన్ దాఖలుచేసుకున్న బెయిల్‌పిటిషన్‌పై అభ్యంతరాలుంటే వెంటనే వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐని ఆదేశించింది. కంపెనీ వేలాదికోట్ల అవినీతి కుంభకోణానికి పాల్పడిన కేసులో వాద్వాన్‌ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ జెకె మహేశ్వరి, విజయక్ష బిష్ణోయ్‌లతో కూడిన బెంచ్ ఇందుకు సంబంధించి తన వివరణ ఇవ్వాలని సిబిఐకి నోటీసులు జారీ చేసింది. అలాగే ఢిల్లీ హైకోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడాన్ని కూడా వాద్వాన్ సుప్రీంలో సవాల్‌చేసారు. సిబిఐనుంచి వివరణ అందిన తర్వాత సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకటిస్తామని చెప్పింది. కపిల్‌వాద్వాన్ ఆయన సోదరుడు ధీరజ్ వాద్వాన్‌లు భారీ ఎత్తున ఆర్తిక మోసాలకు పాల్పడ్డారని, 34,900 కోట్లరూపాయలు 17 బ్యాంకులనుంచి తీసుకున్న రుణమొత్తాన్ని దారిమళ్లించారని సిబిఐ ఆరోపించింది. మొత్తం 87 డొల్ల కంపెనీలను సృష్టించి తమ అసోసియేట్లు, ఉద్యోగులపేరిట ఏర్పాటుచేసి నిధులను మళ్లించినట్లు సిబిఐ గుర్తించింది. మనుగడలోలేని బాంద్రా బ్రాంచ్ 001 పేరిట గృహరుణాలు ఇచ్చినట్లుగా చూపించింది. సిబిఐ వాద్వాన్‌ను 2022 జులైలోనే అరెస్టుచేసింది. అదే ఏడాది ఆయనకు దిగువకోర్టు బెయిల్ మంజూరుచేసింది. అయితే సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను 2024 జనవరిలో పక్కనపెట్టింది. కేసులో తీవ్రస్థాయి ఆర్తికనేరాలున్నందున బెయిల్ రద్దుచేసినట్లు వెల్లడించింది. అలాగే ఢిల్లీ హైకోర్టుకూడా ఈ ఏడాది ఆగస్టులో బెయిల్ తిరస్కరించింది. ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నందున వీలుకాదని చెప్పింది. ఈ అవినీతి ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగించేదిగా ఉందని అందువల్ల కస్టడీలోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది. అయితేరుణాలరూపంలో సేకరించిన ఈ నిధులను వివిధ సంస్థలకు మళ్లించారని, ఇవన్నీ కూడా వాద్వాన్ కుటుం బం, వారి అనుబంధ సంస్థల్లోకి వెళ్లాయని, వాటికి రుణాలు మంజూరు చేసినట్లుగా రికార్డుల్లో చూపించారన్నారు.

# ప్రభుత్వరంగ బ్యాంకుల్లోకి 49% విదేశీ పెట్టుబడులు

### ఆర్బీఐ అభిప్రాయం కోరిన ఆర్థికశాఖ




**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** ప్రభుత్వరంగ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 49శాతంగా ఉండేవిధంగా ఆర్థికశాఖ సూచిస్తోంది. ఇందుకు ఆర్బీఐ అభిప్రాయాన్ని కూడా కోరింది. ప్రస్తుతం విదేశీ పెట్టుబడులను 20శాతానికి మాత్రమే పరిమితంచేసారు. ప్రైవేటు బ్యాంకులు మాత్రం 74శాతం వరకూ విదేశీ యాజమాన్య హక్కులు పొందేవిధంగా ఫ్‌డిఐకి అనుమతులిచ్చినట్లు తెలిపింది. భారత్‌లోప్రస్తుతం 12 ప్రభుత్వరంగ బ్యాంకులున్నాయి.వాటి మొత్తం ఆస్తుల విలువ 1.95 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. దేశ బ్యాంకింగ్ రంగంలో వీటి వాటా 55శాతంగా ఉంది. ప్రభుత్వం కనీసం 51శాతం వాటాలను ఈ బ్యాంకుల్లో సర్కారువాటాగా ఉంచి మిగిలిన మొత్తానికి విదేశీ పెట్టుబడులను ఆమోదించాలని చూస్తోంది. బ్యాంకింగ్ రంగ మనుగడకోసమే ఈ చర్యలు అవసరమని ఆర్థికశాఖ చెపుతోంది. దుబాయి కేంద్రంగా ఉన్న ఎమిరేట్స్‌కు చెందిన ఎన్బీడీ ఆర్బీఎల్ బ్యాంకులో 60శాతం వాటా కొనుగోలుకు ముందుకువచ్చింది. ఈ డీల్ విలువ 300 కోట్ల డాలర్లు. ప్రిఫరెన్షియల్ ఇష్యూగా 51శాతం వాటాకు ముందుకువచ్చింది. అలాగే జపాన్‌కు చెందిన సుమితోమో మిట్సుయి బ్యాంకింగ్‌కార్పొరేషన్ 20శాతం వాటాను ఎస్‌బ్యాంకులో కొనుగోలుచేసింది. సింగపూర్ డిబిఎస్, కెనడా ఫెయిర్‌ఫ్యాక్స్ సంస్థలుకూడా బ్యాంకుల్లో వాటాలు కొంటున్నాయి. అయితే ఇవి కేవలం ప్రైవేటు బ్యాంకులకే పరిమితం అయ్యాయి. ఈ డీల్స్ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో దీర్ఘకాలిక డీల్‌గా ఉండాలని సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి అయితే మరింతగా మేలుజరుగుతుందని ఆర్థికశాఖ అధికారులు చెపుతున్నారు. ఇపుడు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కూడా ఎఫ్‌డిఐల పరిమితిని పెంచేందుకు నిర్ణయించడంవల్ల ఆర్థికంగా బ్యాంకులు మరింతగా నిలదొక్కుకోగలవని అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.